
# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం, 20 జనవరి 2025 సంపుటి: 9 సంచిక: 26 పేజీలు: 12 వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## రాత్రి పదిన్నరకు ప్రమాణం



అమెరికా 47వ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్ ● హాజరవుతున్న జైశంకర్, ముఖేశ్ అంబానీ

2

## వరల్డ్ ఖోఖో ఛాంపియన్‌షిప్స్ విజేత భారత్



ప్రపంచ ఖోఖో మహిళల, పురుషుల ట్రోఫీలు రెండూ భారత దేశమే గెలుచుకుంది. ఇండియన్ మెన్, ఉమెన్.. రెండు టీమ్‌లూ ఒకే సారి ఒకే ఆటలో ఛాంపియన్‌షిప్‌లు సాధించడం సరికొత్త చరిత్ర.

వివరాలు.. క్రీడా పేజీలో..

# ఈ సారి ఛబ్బీస్ జనవరి చాలా ప్రత్యేకం

## రాజ్యాంగ రూపకర్తలను స్మరించుకోవాలి

- ఎన్నికల కమిషన్ వల్లే దేశంలో ప్రజాస్వామ్యం దృఢంగా కొనసాగుతోంది
- భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక కుంభమేళా
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ సూచనలు

2




# 75 ఏండ్లకు రైలొస్తోంది(ట)

### స్వాతంత్ర్యం తర్వాత ఇంత కాలానికి జార్ఖండ్‌లోని 4 జిల్లాల్లో రైలు కోసం డీపీఆర్

**రాంచీ:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటిన తర్వాత జార్ఖండ్లోని నాలుగు జిల్లాలకు తొలిసారి రైలు సౌకర్యం అందుబాటులోకి రానున్నది. ఖుంటి, సిమ్డేగా, గుమ్లా, చత్రా జిల్లాలను రైలు మార్గంతో అనుసంధానించనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాంచీ డివిజన్ ...మిగతా 2లో



### ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే..

# యోగ్యులకే పథకాలు

- సాగులేని ఒక్క ఎకరాకు కూడా రైతు భరోసా ఇచ్చేది లేదు?
- లబ్ధిదారుల ఎంపికలో తప్పులు దొర్లొద్దు
- బాధ్యులపై కఠిన చర్యలంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరిక
- పాత రేషన్ కార్డులు తొలగించం



**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ ఆర్థిక పరిస్థితి అత్యంత దుర్భరంగా ఉందని.. మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన కామెంట్ చేశారు. ఇకనుంచి సాగుకు యోగ్యమైన భూములకు తప్ప సాగులేని భూములకు ఒక్క ఎకరాకు కూడా రైతు భరోసా డబ్బులు ఇచ్చేదిలేదని ఆయన కరాఖండీగా చెప్పేశారు. జనవరి 26 నుంచి అమలు చేసే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీపై నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం సందర్భంగా.. జూపల్లి కృష్ణారావు ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలోకంటే భిన్నంగా తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో.. అధికారులకు కూడా మంత్రి హెచ్చరికలు జారీ చేశారు. అసలే డబ్బులు లేని పరిస్థితుల్లో ఉన్నాం.. పథకాలు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.


**సర్కార్ లక్ష్యాన్నినీరు కార్చొద్దు..**
**అధికారులకు మంత్రి వార్నింగ్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ...మిగతా 2లో

## సింగపూర్ నదిలో సీఎం 'పరిశీలక' ప్రయాణం



మూసీ పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సీఎం సింగపూర్ నదిలో పయనించారు. బోటులో తిరుగుతూ నది పునరుజ్జీవనం గురించి రేవంత్ పరిశీలించారు. నది నీటి నిర్వహణ పద్ధతులు,, నదీ తీరంలో ఆధునిక బిల్డింగ్‌లు నిర్మించే సమయంలో హెరిటేజ్ కట్టడాల పరిరక్షణ కోసం అక్కడి అథారిటీ తీసుకున్న జాగ్రత్తలు, చర్యల గురించి అధికారిని అడిగి తెలుసుకున్నారు.



ముగిసిన సీఎం సింగపూర్ పర్యటన

# రూ.540 కోట్లతో ఐటీ పార్కు

### ఆఖర్రోజు వరుసగా పారిశ్రామికవేత్తలతో భేటీలు

### దావోస్‌కు బయల్దేరిన రైజింగ్ తెలంగాణ బృందం

**హైదరాబాద్, జనవరి 19 (మనం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మూడు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతంగా ముగిసింది. అక్కడ నుంచి ఆదివారం రాత్రి సీఎంతో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు దావోస్‌కు బయల్దేరి వెళ్లారు. సోమవారం దావోస్‌కు చేరుకుని అక్కడ నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం వార్షిక సదస్సులో పాల్గొంటారు. ప్రపంచ వేదికపై తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న భౌగోళిక, ...మిగతా 2లో



### పల్లె సంక్రాంతిని పట్నానికి తీసుకురావడం

# ముదావహం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్ 19, (మనం న్యూస్):** తెలుగు సంగమం పేరుతో పల్లె సంక్రాంతిని నగరానికి తీసుకు రావడం ముదావహమని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఓం కన్వెన్షన్ సెంటర్‌లో తెలుగు సంగమం ఆధ్వర్యంలో సంక్రాంతి సమ్మేళనం నిర్వహించారు. మురళీధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అత్యంత వేడుకగా జరిగే సంక్రాంతి పండుగకు నగర ప్రజలు పల్లె బాట పడతారనీ, దీనికి భిన్నంగా హైదరాబాద్ నగరానికి పల్లెదనాన్ని ...మిగతా 2లో

# ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్

- మహేష్‌కు ప్రతిష్ఠాత్మకం
- మరోసారి పోటీకి నో అన్న జీవన్ రెడ్డి
- ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశావహులు

**హైదరాబాద్, జనవరి 19 (మనం న్యూస్):** త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ దృష్టి సారించింది. పీసీసీ చీఫ్‌గా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు చేపట్టిన తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఆయన ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఎన్నికలు జరుగనున్న జిల్లాల్లో ఒకటైన నిజామాబాద్ లోకల్ వ్యక్తి కావడంతో మహేష్ గౌడ్‌కు ఈ ఎన్నికలు సవాల్‌గా మారాయి. దీంతో అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు మొదలు పెట్టింది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంకు మార్చి 31వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం ఈస్థానం ...మిగతా 2లో




# రండి.. నాతో కలిసి నడవండి

### వైట్ టీ షర్ట్ మూవ్‌మెంట్‌లో పాల్గొనండి

### యువత, కార్మిక వర్గ మిత్రులకు పిలుపు

**ఢిల్లీ:** ఈ ఉద్యమంలో నాతో కలిసి నడిచేందుకు ఈ నంబర్ కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే రాహుల్ గాంధీ ఆదివారం ఆసక్తికర ట్వీట్ చేశారు. మోడీ ప్రభుత్వం పేద, శ్రామిక వర్గాలకు వెన్నుపోటు పొడిచి, వారి శ్రేయస్సును పూర్తిగా గాలికొదిలేసిందని.. ప్రస్తుతం ప్రభుత్వ దృష్టి అంతా ఎంపిక చేసిన కొంతమంది పెట్టుబడిదారులను సంపన్నం చేయడంపైనే ఉందని, దీనివల్ల అసమానతలు నిరంతరం పెరుగుతూ ఉన్నాయని పేర్కొన్నారు. దేశాన్ని పోషించేందుకు కష్టపడి పనిచేసే కార్మికుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతోందని రాశారు. అంతేకాదు, వారు వివిధ రకాల అన్యాయా లను, దౌర్జన్యాలను ...మిగతా 2లో



2 రాహుల్‌పై ఎఫ్ఐఆర్

### మహోత్సాహంగా

# మల్లన్న జాతర మొదలు

- 2 నెలల పాటు సాగనున్న కొమురవెల్లి జాతర
- దక్షిణాది రాష్ట్రాల నుంచి తరలి వస్తున్న భక్తులు



2

## ఫిబ్రవరి 14న మాట్లాడ్దాం

### రైతు నాయకుడు దల్లేవాల్‌తో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధి

**ఢిల్లీ:** రైతుల డిమాండ్లపై చర్చించేందుకు ఫిబ్రవరి 14న వారితో సమావేశం కానున్నట్టు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియా రంజన్ వెల్లడించారు. రంజన్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు పంజాబ్-హర్యానా బార్డర్ ఖానౌరీ సరిహద్దులో ఆమరణ దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌తో శనివారం ...మిగతా 2లో

### నా కొడుక్కు మరణ శిక్ష

# విధించండి

### ఆర్జీకర్ కేసు దోషి సంజయ్ రాయ్ తల్లి

### సంజయ్‌తో పాటు ఇతర నిందితులనూ విచారించాలె

**కొల్‌కతా:** ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషిగా సుప్రీం కోర్టు ప్రకటించిన సంజయ్ రాయ్‌కు మరణశిక్ష విధించాలని అతడి తల్లి వ్యాఖ్యానించారు. తన కొడుకు తప్పు చేస్తే కచ్చితంగా తగిన శిక్ష విధించాలని పేర్కొన్నారు. తన కుమారుడు చేసిన తప్పును ఓ మహిళగా ఎప్పటికీ క్షమించనని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని.. వైద్యురాలు పడిన బాధను.. నరకాన్ని అర్థం చేసుకోగలనని ఆవేదన వ్యక్తం చేశారు. "నా కొడుకు చనిపోతే ...మిగతా 2లో

## రేవంత్‌కు పాలనపై

# పట్టు లేదు

### అధికారులు బ్రోకర్లుగా మారిండ్రు

- 7-10 శాతం లంచాలిస్తే తప్ప బిల్లులిస్తలేరు
- పేదల ఇండ్ల జోలికొస్తే ఊర్కోం.. పోలీసులు మారకుంటే శిక్ష తప్పదు
- మూడు నెలలు హైడ్రా పేరుతో హైడ్రామా
- మీడియాతో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్ 19, (మనం న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డికి పరిపాలనపై పట్టు లేదనీ, అధికారులు బ్రోకర్లుగా మారి లంచాలు డిమాండ్ చేస్తున్నారని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. పేదల ఇళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదనీ, బాస్‌ల ఆదేశాల మేరకు పనిచేసే అధికారులు, పోలీసులు మారకపోతే శిక్ష తప్పదని హెచ్చరించారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బద్దం బాల్‌రెడ్డి, దత్తాత్రేయ, నరేంద్ర అండగా నిలబడి పేదలకు ఇప్పించిన ఇళ్లను అధికారులు కూల్చాలని చూస్తున్నారని ఆరోపించారు. 7-10 శాతం లంచాలు ఇస్తే తప్ప బిల్లు బయటకు రాని పరిస్థితి ఉందనీ, ఇళ్లలో ఉండేవాళ్లు సైతం దుకాణాలు తెరిచారని వ్యాఖ్యానించారు. అత్యంత అసమర్థ, అవినీతి, సమన్వయం లేని పాలన రేవంత్ కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. మళ్లీ అధికారంలోకి వస్తామో లేదో అని అందినకాడికి దండుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మూడు నెలల పాటు హైడ్రా పేరుతో హైడ్రామా చేశారనీ, కొన్ని నెలలు మూసీ పక్కన ఉన్న ఇళ్ల మీద పడి ఇప్పుడు బస్తీల్లో ఉన్న ఇళ్ల మీద పడ్డారని విమర్శించారు. దేశంలో అతిపెద్ద, పురాతన స్లమ్ అయిన బాలాజీనగర్, జవహర్ నగర్‌లో తెలంగాణ, యూపి, బెంగాల్, బీహార్, ఆంధ్రా వాళ్లు ఉంటారనీ, ...మిగతా 2లో

## ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇండ్లు

### దీనికనుగుణంగానే హౌజింగ్ శాఖను పునరుద్ధరించాం

### ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జనవరి 19 (మనం న్యూస్):** కూడు, గూడు, గుడ్డ... గరీబీ హటావో నినాదంతో ఇందిరమ్మ పేదల గుండెల్లో కొలువైందనీ, అట్లాంటి ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌజింగ్, సమాచార, పౌర సంబంధాల ...మిగతా 2లో

# రాత్రి పదిన్నరకు ప్రమాణం

న్యూయార్క్‌: అమెరికా 47వ అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ నేటి మధ్యాహ్నం 12 గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 10.30 గంటలు) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. యునైటెడ్ స్టేట్స్ చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ యూఎస్ క్యాపిటల్లో జరిగే ఇనాగరేషన్ డే కార్యక్రమంలో ట్రంప్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సాంప్రదాయం ప్రకారం క్యాపిటల్ బిల్డింగ్ బయట ఈ కార్యక్రమం నిర్వహించాలి. కానీ, వాషింగ్టన్ డీసీలో అత్యంత చలిగా ఉండటంతో కార్యక్రమాన్ని బిల్డింగ్ లోపలికి మార్చారు. వైట్ హౌస్ వరకు మిలటరీ, స్కూల్ బ్యాండ్స్, అమెరికా పౌరులతో పరేడ్‌ను నిర్వహించాల్సి ఉంది. కానీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వీటిని కూడా క్యాపిటల్ వన్ ఎరేనాలోనే పరేడ్ నిర్వహించనున్నారు. గతంలో ఉన్న సాంప్రదాయాలను బ్రేక్ చేస్తూ ట్రంప్ తొలి సారిగా పలు దేశాల ప్రధానులు, అధ్యక్షులను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించారు. మన దేశం నుంచి విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.

**తొలి రోజే 10 ఆర్డర్లపై సంతకాలు**

2016లో తొలిసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రోజు కేవలం ఒకే ఆర్డ్రు సంతకాలు చేశారు. అప్పట్లో 'ఒబామా కేర్'ను రద్దు చేస్తూ ఆయన తొలి సంతకం చేశారు. కానీ ఈ సారి ఏకంగా 10 ఆర్డర్లపై సంతకాలు చేయనున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన అనేక హామీలపై తొలి రోజే సంతకాలు పెట్టాలని ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా చరిత్రలోనే ఇవి కీలకమైనవని పరిశీలకుల వ్యాఖ్యానం.

# ఈ సారి ఛెబ్బీస్ జనవరి చాలా ప్రత్యేకం

ఢిల్లీః రాజ్యాంగ రూపకర్తలను స్మరించుకోవల్సిన సమయం ఇది. మనకు పవిత్రమైన రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నానని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 2025గాను తొలి మన్ కీ బాత్‌ను ఆదివారం నిర్వహించారు. వాస్తవానికి ప్రతీ నెల నాలుగో ఆదివారం ప్రసారం కానున్న ఈ కార్యక్రమం, నాలుగో ఆదివారం రిపబ్లిక్ డే రావడంతో ఒక వారం ముందుగానే విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పరిషత్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రాజేంద్ర ప్రసాద్, శ్యామా ప్రసాద్ ముఖర్జీలు చేసిన ప్రసంగాలను శ్రోతలకు వినిపించారు. ఈ సారి రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైంది. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయ్యింది. మనకు రాజ్యాంగం అందించిన వారందరినీ తప్పకుండా గౌరవించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని రూపొందించిన వ్యక్తులందరూ నాకు గుర్తున్నారు. రాజ్యాంగ పరిషత్‌లో అనేక చర్చోపచర్చలు జరిగాయి. వారందరూ మనకు వారసత్వ సంపద. అందుకే ఈ రోజు వారి గొంతులను వినిపిస్తున్నాను అన్నారు ప్రధాన మంత్రి.

జనవరి 25 జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్నికల కమిషన్ సేవలను ప్రధాని మోడీ ప్రశంసించారు. 25నే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాను స్థాపించారు.

ఆనాటి నుంచి ఈసీ బలోపేతం అవుతూ వచ్చింది. ఎప్పటికప్పుడు ఆధునిక పద్ధతులను, టెక్నాలజీని వాడుకుంటూ వోటింగ్ ప్రాసెస్‌ను బలోపేతం చేసిందని ప్రధాని చెప్పారు.

ఈసీ కారణంగానే దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగుతుందని చెప్పారు. ఇండియా వంటి అతిపెద్ద దేశంలో మొట్టమొదటి సారిగా ఎన్నికలు నిర్వహించినప్పుడు ప్రజలు ప్రజాస్వామ్యం మీద అనుమానాలు ఉండేవి. కానీ ఎలక్షన్ కమిషన్ కారణంగా ప్రజాస్వామ్యం దృఢంగా కొనసాగుతోంది. దేశంలో నిష్పాక్షికమైన ఎన్నికలు నిర్వహిస్తున్నందుకు గాను ఎలక్షన్ కమిషన్‌ను ప్రధాని మోడీ అభినందించారు.



భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక కుంభమేళా

ప్రయాగ్రాజ్లో జరుగుతున్న మహా కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. ఈ పవిత్ర కార్యక్రమానికి అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలు హాజరవుతుండటం సంతోషంగా ఉంది. ఇది ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది. కుంభమేళాకు యువత భారీ సంఖ్యలో తరలి రావడం అభినందనీయమన్నారు. దేశంలోని యువత మన ఆచార వ్యవహారాలను తెలుసుకున్నప్పుడే.. మన మూలాలు బలంగా మారతాయన్నారు.

దేశంలో మరో రెండు కొత్త టైగర్ రిజర్వ్లు ఏర్పాటు చేయడం అత్యంత సంతోషంగా ఉంది. ఛత్తీస్గఢ్లో గురు ఘసిదాస్ తామోర్ పింగ్లా టైగర్ రిజర్వ్, మధ్యప్రదేశ్లో రాతాపాని టైగర్ రిజర్వ్ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోడీ తెలిపారు. ఇక యువత స్టార్టప్ కంపెనీల వైపు ఆకర్షితులవడం మంచిదని ప్రధాని చెప్పారు. ఇండియా ఇప్పుడు స్టార్టప్ల దేశంగా మారిందని అన్నారు. ప్రస్తుతం సమాజంలో పరిస్థితులు అన్నీ మారిపోయాయని.. దేశం డిజిటల్ యుగంలోని ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో యువత మాత్రమే కాకుండా మహిళలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. తన స్టార్టప్ కంపెనీ ద్వారా నిరాశ్రయులకు సేవ చేస్తున్న దీపక్ నబం అనే వ్యక్తిని ఈ సందర్భంగా మోడీ ప్రశంసించారు.

# 75 ఏండ్లకు రైలొస్తోంది(ట)

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోకి వచ్చే ఈ రైల్వే ప్రాజెక్ట్ కోసం ప్రాథమిక సర్వే నివేదికను పూర్తి చేసినట్లు తెలిపింది. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వే బోర్డుకు పంపినట్లు పేర్కొంది. కాగా, ప్రస్తుతం ఉన్న రాంచీ-లోహర్దగా రైలు మార్గంతో గుమ్లా, ఖుంటి, సిమ్డేగా జిల్లాలను అనుసంధానిస్తారు. అలాగే రాంచీ-హజారీబాగ్ రైలు మార్గంలో చత్రా జిల్లాను కలుపుతారు. లోహర్దగా నుంచి గుమ్లా వరకు 55 కిలోమీటర్లు, గుమ్లా నుంచి సిమ్డేగా వరకు 43 కిలోమీటర్లు, హతియా నుంచి ఖుంటి వరకు 20 కిలోమీటర్లు, హజారీబాగ్ నుంచి చత్రా వరకు 42 కిలోమీటర్ల మేర రైలు మార్గాన్ని నిర్మిస్తారు.

మరోవైపు ఒడిశా, జార్ఖండ్, ఛతీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్లోని ఏడు జిల్లాల్లో కొత్త రైల్వే లైన్లు, ఇతర ప్రాజెక్టుల కోసం గత ఏడాది ఆగస్ట్లో కేంద్ర మంత్రివర్గం రూ. 6,500 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది.

# రండి.. నాతో కలిసి నడవండి

(మొదటి పేజీ తరువాయి)

ఎదుర్కోవల్సి వస్తోందన్నారు. ఇటువంటి పరిస్థితిలో వారికి న్యాయం చేసేందుకు, వారు తమ హక్కులు పొందడం కోసం గళమెత్తడం మనందరి బాధ్యత అంటూ.. ఈ ఆలోచనతోనే 'వైట్ టీషర్ట్ మూవ్మెంట్' ను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు.

ఈ ఉద్యమంలో పాల్గొనవలసిందిగా యువత, కార్మిక వర్గ మిత్రులకు విజ్ఞప్తి చేశారు.

ఈ ఉద్యమంలో తనతో కలిసి నడిచేందుకు, దీనికి సంబంధించిన వివరణాత్మక సమాచారం కోసం 9999812024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

**రాహుల్‌పై ఎఫ్ఐఆర్**

దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై అస్సాంలోని గువాహటి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదైంది. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమితులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని మోన్జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు. అవి అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా.. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్ కు ఉంది. కానీ, ఆయన అందుకు బదులుగా అబద్ధాలు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు' అని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాలయ ప్రారంభం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ఆరెస్సెస్ భావజాలం వేల సంవత్సరాల నాటిది. బీజేపీ, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయి. మేము ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈవ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుబట్టారు.

# ఫిబ్రవరి 14న మాట్లాడ్దాం

(మొదటి పేజీ తరువాయి)

భేటీ అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. దల్లేవాల్ ఆరోగ్యం క్షీణించడాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపినట్టు చెప్పారు. వచ్చే నెల 14న సమస్యలపై చర్చించేందుకు రైతులతో భేటీ అవుతామని స్పష్టం చేశారు. అయితే నిరాహార దీక్ష విరమించాలని దల్లేవాల్‌కు అధికారులు విజ్ఞప్తి చేసినా ఆయన నిరాకరించినట్టు తెలుస్తోంది.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్

(మొదటి పేజీ తరువాయి)

నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్సీగా జీవన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రానున్న గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ హవా కనిపించాలంటే ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ల స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవాల్సిందేనని హస్తం నేతలు భావిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ ఈ స్థానాన్ని కైవసం చేసుకుంది. అయితే, ఇప్పుడు సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న జీవన్ రెడ్డిని మరోసారి పోటీ చేయించాలని కొంతమంది కాంగ్రెస్ పెద్దలు కోరినప్పటికీ తనకు పోటీ చేసే ఆలోచన లేదని జీవన్‌రెడ్డి సున్నితంగా తిరస్కరించారు. దీంతో కొత్త వ్యక్తులు ఈ టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా అల్‌ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, సివిల్స్ కోచింగ్ సెంటర్ అధినేత రమణారెడ్డి, మాజీ పోలీస్ అధికారి గంగాధర్, కోచింగ్ సెంటర్లకు చెందిన మరో అధినేత హరికృష్ణ సైతం ప్రసన్న సైతం కాంగ్రెస్ టికెట్ కోసం హస్తం పెద్దల చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నారు. కాగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన వారం రోజులలోపే ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ రెండు రోజుల క్రితం ప్రకటించారు. దీంతో ఆశావహులు తమ ప్రయత్నాలను మరింత వేగవంతం చేశారు. ఎవరూ ఊహించని వ్యక్తి బరిలో ఉంటారనీ, సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ తాము కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పెద్దలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందనీ, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పని చేయాలని సూచించారు. ఆదివారం ఇక్కడి బంజారా హిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల డైరీ, క్యాలండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు వచ్చే నాలుగు సంవత్సరాల్లో దశల వారీగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించారు. పేదలకు ఇండ్లు నిర్మించే హౌసింగ్ శాఖను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందనీ, ఆ విభాగాన్ని మూసివేసి ఉన్న ఉద్యోగులను ఇతర శాఖల్లో విలీనం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం



ఒక్కొక్క అడుగు వేస్తూ ఈ శాఖను పునరుద్ధరించి లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణ వరకు అవసరమైన యంత్రాంగాన్ని సమకూర్చుకుందన్నారు. 326 మంది ఉద్యోగులను తిరిగి నియమించడం ద్వారా కార్పొరేషన్‌ను బలోపేతం చేశామని చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ పేదవారి జీవితంలో వెలుగులు నింపేందుకు ఈ ప్రభుత్వం కృషి చేస్తుందనీ, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పథకాలలో లక్షలాది మంది నీడలేని నిరుపేదలకు ఐదు లక్షల స్కీమ్‌తో పక్కా గృహాలు నిర్మించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో దానికి గృహ నిర్మాణ శాఖ సిబ్బంది పూర్తిగా సహకరించాలని సూచించారు. హౌసింగ్ శాఖ ఉద్యోగులు మరింత శ్రమపడి ప్రభుత్వ లక్ష్యాలను పేదలకు చేరవేసే ప్రయత్నం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నా కొడుక్కు మరణ శిక్ష విధించండి

(మొదటి పేజీ తరువాయి)

నేను ఏడుస్తానేమో.. కానీ ఓ అమ్మాయి పట్ల ప్రవర్తించిన తీరుకు.. సంజయ్‌కు జీవించే హక్కు లేదు. అతడికి మరణ శిక్ష విధించినా మాకు ఎటువంటి అభ్యంతరం లేదు. వైద్యురాలు నాకు కూతురితో సమానం. కుమార్తెకు ఇటువంటి పరిస్థితి వస్తే ఏ తల్లీ ఊరుకోదు'' అని ఆమె అన్నారు.

ఈ కేసుపై సుప్రీం కోర్టుకు వెళ్తారా అని మీడియా అడిగిన ప్రశ్నకు సంజయ్ సోదరి మాట్లాడుతూ.. ఆ ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. అతడు ఇలాంటి దారుణానికి ఒడిగడతాడని తామెప్పుడూ అనుకోలేదన్నారు. అయితే నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్‌తో పాటు మరికొంతమంది ఉన్నట్లు కథనాలు వస్తున్నాయని.. ఈ విషయంపై పోలీసులు, సీబీఐ క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, వారికి కూడా తగిన శిక్ష విధించాలని కోరారు.

# మహోత్సాహంగా మల్లన్న జాతర మొదలు

హైదరాబాద్, మనం ప్రతినిధిః కన్నుల పండువగా సాగే.. కొమురవెల్లి మల్లన్న జాతర ఆదివారంనాడు అట్టహసంగా ప్రారంభమైంది. సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో జాతర ఘనంగా ప్రారంభమైంది. రెండు నెలల పాటు ఈ జాతర జరగనుంది. సంక్రాంతి పండుగ తర్వాత మొదటి ఆదివారం కావడంతో మల్లికార్జున స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం ప్రారంభమైన జాతర ఉగాదికి ముందు వచ్చే ఆదివారం (మార్చి 23న) ముగియనుంది. ఇక, ఈ ఆలయంలో ప్రతి ఆదివారం విశేష కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తులు ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పిస్తారు. పట్నం వేసి స్వామి వారి కల్యాణం జరిపించి మొక్కు తీర్చుకుంటారు. తెలంగాణ, ఏపీతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేలాది భక్తులు తరలి వస్తారు. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రాజగోపురం పక్కన ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటిపై చలువ పందిళ్లు వేయించారు. కొత్తగా నిర్మించిన ప్రసాదాల విక్రయం, ఆర్జిత సేవల రసీదుల అందజేత కేంద్రం వద్ద పక్కా క్యూలైన్లు నిర్మించారు.

# సోయిలేని సర్కారు

- ప్రతిపక్షం నిలదీస్తే గానీ నిరుపేదల గురించి ఆలోచించరా?
- ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్ కార్డులిస్తామనడం మా విజయమే
- మీ సేవా దరఖాస్తులను సైతం పరిగణనలోకి తీసుకోవాలె
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్, మనం ప్రతినిధిః ప్రభుత్వానికి సోయి లేదు?.. సిగ్గు లజ్జ అసలే లేదు?.. ప్రతిపక్షం నిలదీస్తే గానీ.. ప్రభుత్వం నిరుపేదల గురించి ఆలోచించదా? అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులకు కూడా రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం బీఆర్ఎస్ విజయమని చెప్పారు. మీ సేవా దరఖాస్తులు కూడా పరిగణనలోకి తీసుకోవాలని, పెరిగిన ద్రవ్యోల్బణం ఆధారంగా రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. దరఖాస్తులు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రజలను మోసం చేయాలని చూసిన ప్రతిసారి, తాము మిమ్మల్ని ప్రశ్నిస్తుంటాం, నిలదీస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

'పేదలకు రేషన్ కార్డులు అందకుండా చేస్తున్నారని, కోతలు విధిస్తున్నారని ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాసి నిలదీస్తే గాని, ఈ ప్రభుత్వానికి జ్ఞానోదయం కాలేదన్నారు. కుల గణన దరఖాస్తులతోపాటు, ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం, ఇది తుది జాబితా కాదని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వంపై ఒత్తిడి చేసి చెప్పించడం బిఆర్ఎస్ విజయం. ఆదాయ పెంపు విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉండటం వల్ల లక్షల మంది నిరుపేద వర్గాలు రేషన్ కార్డులకు దూరం అవుతాయన్నారు. కేసీఆర్ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పొందేందుకు వీలుగా ఆదాయ, భూ పరిమితి నిబంధనల్లో మార్పులు చేశారు. ఉమ్మడి ఏపీలో ఆదాయ పరిమితి గ్రామీణంలో 60 వేలు, పట్టణంలో 75వేలు ఉంటే, దాన్ని గ్రామీణంలో లక్షా 50వేలకు, పట్టణంలో 2.50 లక్షలకు పెంచారు. మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట 5 ఎకరాలుగా ఉన్న పరిమితిని మాగాణి మూడున్నరకు, మెట్ట ఏడున్నర ఎకరాలకు పెంచారు. దీనివల్ల లక్షల మంది నిరుపేదలకు రేషన్ కార్డు పొందే అర్హతను కేసీఆర్ ప్రభుత్వం కల్పించింది.

పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఆదాయ



పరిమితితోపాటు భూ పరిమితి పెంచుతూ నిబంధనల్లో మార్పు చేయాలని తెలంగాణ ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. తద్వారా ఆశాలు, అంగన్వాడీలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జర్నలిస్టులు.. ఇతర అల్ప ఆదాయ వర్గాలు, పేదలు రేషన్ కార్డులు పొందే వీలు ఉంటుందని స్పష్టం చేశారు. ఇతర అల్ప ఆదాయ వర్గాలు, పెదాలు రేషన్ కార్డులు పొందే వీలు ఉంటుందన్నారు. పల్లెల్లో అయినా పట్టణంలో అయినా కూలీ ఎక్కడైనా నిరుపేదే అన్నారు. కాబట్టి పల్లెలు పట్టణాల్లో పనిచేసే వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని, 20 రోజుల పనిదినాల నిబంధన తొలగించాలని, భరోసా పథకాన్ని ఉపాధి హామీకి లింకు చేయకుండా అర్హులైన అందరికీ వర్తింప చేయాలని కోరారు.

# రేవంత్‌కు పాలనపై పట్టు లేదు

(మొదటి పేజీ తరువాయి)

భూమికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదనీ, ఆ స్థలంలో నిర్మించిన ఇళ్లను రేవంత్ ప్రభుత్వం కూలగొట్టాలని చూస్తున్నదని విమర్శించారు. మల్కాజ్‌గిరిలో బీజేపీని ఓడించడం నీ జేజమ్మ తరం కాదని అప్పుడు చెప్పాననీ, రాబోయే రోజుల్లో బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదని ఇప్పుడు చెప్పున్నానని స్పష్టం చేశారు.

# యోగ్యులకే పథకాలు

(మొదటి పేజీ తరువాయి)

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల లక్ష్యాన్ని నీరు కార్చొద్దని అధికారులకు మంత్రి సూచించారు. ఖచ్చితంగా అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందాలని ఆదేశించారు. రైతు భరోసాపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని.. వాటిని ఏమాత్రం నమ్మొద్దని మంత్రి సూచించారు. గతంలో ఉన్న ఏ పథకాన్ని ఎత్తివేయటం లేదని.. పైగా ఎన్నో కొత్త పథకాలు అమలు చేస్తున్నామని జూపల్లి వెల్లడించారు. త్వరలో ప్రారంభంకానున్న పథకాలకు లబ్దిదారుల ఎంపిక, అత్యంత జాగ్రత్తగా చేయాలన్నారు. ఒకవేళ తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి హెచ్చరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమల్లో గ్రామసభలో తీసుకునే నిర్ణయాలే కీలకమని చెప్పారు. గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలను 10 రోజుల్లో అధికారులు నివృత్తి చేయాలని జూపల్లి ఆదేశించారు.రానున్న రోజుల్లో సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తామని.. సాగు యోగ్యం కానీ, ఒక్క ఎకరాకు కూడా డబ్బులు ఇచ్చేది లేదని మంత్రి జూపల్లి తేల్చి చెప్పారు. అర్హులైన రైతు కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తామని ఆయన చెప్పుకొచ్చారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తున్న వేళ.. పాత రేషన్ కార్డులు తొలగిస్తారంటూ సోషల్ మీడియాల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదని మంత్రి జూపల్లి కొట్టిపారేశారు. అది కేవలం విపక్షాల అసత్య ప్రచారం, అపోహ మాత్రమేనని తెలిపారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ అనేవి నిరంతర ప్రక్రియ అని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

# పల్లె సంక్రాంతిని పట్నానికి తీసుకురావడం ముదావహం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చి సంబరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గంగిరెద్దుల నృత్యాలు, హరిదాసుల కీర్తనలతో కన్నుల పండువగా నిర్వహించిన వార్షిక సమ్మేళనానికి భగవాన్ శ్రీశ్రీశ్రీ విశ్వయోగి విశ్వంజీ హాజరై ఆశీర్వచనం అందించారు.

ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, మనోహర్‌రెడ్డి, గౌతంరావు, పెరిక సురేష్ తదితరులు హాజరయ్యారు.

# రూ.540 కోట్లతో ఐటీ పార్కు

(మొదటి పేజీ తరువాయి)

వాతావరణ అనుకూలతలను చాటి చెప్పి హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేసే భారీ లక్ష్యంతో రాష్ట్ర ప్రతినిధి బృందం దావోస్ పర్యటనకు బయల్దేరి వెళ్లింది. సింగపూర్ పర్యటన విజయవంతం కావడంతో తెలంగాణ రైజింగ్ బృందం దావోస్ సదస్సుపై భారీ అంచనాలు పెట్టుకుంది. చివరి రోజున సింగపూర్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి బృందం అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో ముఖాముఖి సంభాషణలు చర్చలు జరిపింది. ఇండియన్ ఓషన్ గ్రూప్ ఫౌండర్, సీఈవో ప్రదీప్తో బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్ హిమ్‌చౌన్, డీబీఎస్ గ్రూప్ హెడ్ అమిత్ శర్మ, బ్లాక్‌స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండి గౌతమ్ బెనర్జీ, మెయిన్ హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షాజాద్‌తో చర్చలు జరిపింది. హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వం విధానాలను ఈ సందర్భంగా వారికి వివరించారు.

**విజయవంతమైన సింగపూర్ పర్యటన**

సింగపూర్‌లో మూడు రోజుల పాటు రాష్ట్ర ప్రతినిధి బృందం బిజీబిజీగా గడిపింది. వివిధ రంగాల్లో పేరొందిన ప్రపంచ స్థాయి సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక చర్చల్లో పాల్గొంది. ఆశించిన పెట్టుబడుల ఒప్పందాలతో పాటు సింగపూర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన కుదుర్చుకోవడం కీలక పరిణామం. హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటుకు ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. రూ.3500 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం క్యాపిటల్ ల్యాండ్ సంస్థ హైదరాబాద్‌లో భారీ ఐటీ పార్కు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.540 కోట్లతో ఈ పార్కును అభివృద్ధి చేయనుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ పరిశ్రమలు, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.



# పాగా వేసేందుకే పసుపు బోర్డు

- ఏస్తున్నట్టు మాకేందుకు చెప్పలే?
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత


హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణలో పాగా వేసేందుకు.. ఇక్కడి రాజకీయం కోసమే పసుపు బోర్డును ప్రకటించారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అయినప్పటికి ఇందూరులో పసుపు బోర్డు ఏర్పాటును తాము స్వాగతిస్తున్నామన్నారు. కానీ, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరును మాత్రం తాము వ్యతిరేకిస్తున్నట్లు కవిత చెప్పారు. ఆదివారంనాడు హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ... పసుపు బోర్డు ఏర్పాటుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. దీనిని రాజకీయ కోణంలోనే ప్రకటన చేశారన్నారు. నిజంగా రైతుల



కోసమే ఈ నిర్ణయమైతే పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలని ఆమే డిమాండ్ చేశారు. అయితే, ప్రజలు ప్రతి విషయాన్ని గమనిస్తున్నారన్నారు. పసుపు బోర్డు కోసం బీఆర్ఎస్ పార్టీయే పోరాటం చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడే పసుపు బోర్డు కోసం కృషి చేశానన్నారు. నిజామాబాద్‌కు విమానాశ్రయం తీసుకురావాల్సిన బాధ్యత ఎంపి అరవింద్‌పై ఉందని కవిత అన్నారు.

# ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ సేవలు మరువలేనివని

- **కాంగ్రెస్ పార్టీ నేత రవి కిరణ్ రెడ్డి**



**తలకొండపల్లి, జనవరి 19(మనంన్యూస్):** తలకొండపల్లి మండలం బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రవి కిరణ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి, ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తారా సింగ్ అధ్యక్షతన జరిగిన వీడ్కోలు సమావేశానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రవి కిరణ్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రవి కిరణ్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని, వారు పాఠశాలలో నిర్వహించి న విద్యాకార్యక్రమాలను, విద్యార్థులకు ఆటపాటల ద్వారా విద్యనేర్పిన తీరుతెన్నులను గుర్తుచేసి ఉపాధ్యాయ వర్గంలో వారు ఆణిముత్యాలని ప్రశంసల జల్లు కురిపించారు. వారు ఎక్కడికి వెళ్లినా ఇలాఏ మన్నలు పొందాలన్నారు, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు పాఠశాలకు ఎనలేని సేవలు చేశారని, మంచి ఫలితాలు తీసుకొచ్చారని వారి సేవలను కొనియాడారు. గత 6 సంవత్సరాలుగా పాఠశాలలో పనిచేసే పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల చదువు విషయంలో బాధ్యతగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. బదిలీపై వెళ్లిన నూతన పాఠశాలలో కూడా రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలని అన్నారు. బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. అట్లాగే పాఠశాలకు వచ్చిన నూతన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలనిపించి శాలువాలు కప్పి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పెంటమ్మ కుమారుడు రామస్వామి, మాజీ స్కూల్ వైస్ చైర్మన్ దుడ్డు మల్లయ్య, సీనియర్ నాయకులు మాజీ వార్డ్ సభ్యులు కాలే శేఖర్,మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఐలయ్య, ఉపాధ్యాయులు బాల్రామ్, అంగన్వాడి టీచర్ నిర్మల, ఆశ వర్కర్ మాధవి, పద్మ, గ్రామ పెద్దలు దుడ్డు స్వామి, సప్పిడి మల్లేష్, యువకులు జాజల శేఖర్ ముదిరాజ్, భాస్కర్ తల్లిదండ్రులు,విద్యార్థిలు తదితరులు పాల్గొన్నారు.

## ఐపీఎల్ తరహాలో డిపిఎల్ సీజన్ – 1 క్రికెట్ టోర్నమెంట్

**చేవెళ్ల, జనవరి 19 (మనం న్యూస్):** సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఐపీఎల్ తరహాలో దేవుని ఎర్రవల్లి గ్రామంలో డిపిఎల్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో నాలుగు జట్లు పాల్గొనగా ఫైనల్ లో చీర రమేష్ మెంటర్ పరిధిలో కెప్టెన్ విజయ్ కాంత్ టీం ఫైనల్లో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కెప్టెన్ కరికే విజయ్ , వైస్ కెప్టెన్ కరికే రవీందర్ టీం సభ్యులకు మొదటి బహుమతి రూ. 10వేలు, షీల్ ను ముఖ్యఅతిథి సామ రంగారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పాన్సర్స్ చింపుల బుచ్చిరెడ్డి , కావలి మాణిక్యం, ఎదిరే కుమార్ లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



# సివిల్ పోలీసులతో మమేకమై పనిచేయాలి



**హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్**

బంజారాహిల్స్,జనవరి 19(మనం న్యూస్): ఏఆర్ పోలీసు కానిస్టేబుళ్ళు సివిల్ పోలీసులత మమేకమై పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ అన్నారు. కమిషనరేట్ పరిధిలోని శాంతి భద్రతలు, ఇతర విభాగాల పనితీరును మరింత మెరుగుపరచడానికి సీఏఆర్ హెడ్ క్వార్టర్స్లో పనిచేస్తున్న 573 మంది ఏఆర్ పోలీస్ కానిస్టేబుళ్లను (మహిళలు-223, పురుషులు-350) హైదరాబాద్ సిటీలోని మొత్తం 71 లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లకు -284, ట్రాఫిక్ డిపార్ట్మెంట్-225, స్పెషల్ బ్రాంచ్-25, టాస్క్ ఫోర్స్-25, హెచ్ న్యూ-8, సైబర్ క్రైమ్-6 అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటరులోని ఆడిటోరియంలో వారితో ఇంటరాక్షన్ సెషన్ నిర్వహించారు. సమావేశంలో కమిషనర్ సివి ఆనంద్ మాట్లాడుతూ సివిల్ పోలీసులతో మమేకమై పని చేయాలని సూచించారు. చాలా సహనంతో వివిధ వర్గాల ప్రజల మధ్య పని చేయాల్సి ఉంటుందన్నారు. హైదరాబాద్ శాంతి భద్రతలను కాపాడుకోవడం మనందరి ముఖ్య కర్తవ్యమన్నారు. సివిల్ పోలీసు విధుల్లో చేరిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఇది కేవలం అటాచ్మెంట్ మాత్రమేనని, వారికి సీనియారిటీ, విభాగముమార్పిడి హక్కులు ఉండవని స్పష్టం చేశారు. పోలీసు స్టేషన్లలో పెట్రోలింగ్, ప్రాథమిక విధులను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్న సివిల్ పోలీసుల కొరతను అధిగమించడానికి అటాచ్మెంట్ చేస్తున్నామని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. విధుల్లో ఉన్నప్పుడు ఏదైనా చిన్న సమాచారం వచ్చినా, ఏదైనా సంఘటన చూసినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ట్రాఫిక్ జామ్లు ఏర్పడే అవకాశం ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని స్పష్టం చేశారు. పని చేస్తున్న ప్రదేశంలోని స్థానిక ప్రజలు, పెద్దలతో స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. తమ నిర్ణయం సరైనది అనిపించేలా రోల్ మోడల్ గా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, అడ్మిన్ విభాగ జాయింట్ కమిషనర్ పరిమళ హనా నూతన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షిత కృష్ణ మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ పాలనలో అందరికీ అభివృద్ధి ఫలాలు

- **బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి**



**ఖైరతాబాద్,జనవరి 19(మనం న్యూస్):** ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశ ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రా రెడ్డి అన్నారు. హిమాయత్ నగర్ డివిజనుకు చెందిన పలువురు యువకులు పార్టీలో ఆదివారం చేరగా, వారికి కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితో కలిసి పార్టీలోకి ఆహ్వానం పలికారు. అనంతరం రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో ముందకు సాగుతోందన్నారు. మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయన్నారు. దేశ ఖ్యాతి ప్రపంచ నలుమూలలకు వ్యాపిస్తోందన్నారు. అందుకే యువత ఆయన పాలనకు ఆకర్షితులై బిజెపిలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన అభిషేక్ తో పాటు అతని అనుచరులు, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతం రావు, నాయకులు పందిళ్ళ ప్రసాద్, శ్రీధర్, హిమాయత్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ భవిష్యత్తు కల్పించిన సబితమ్మ నాయకత్వంలోనే పనిచేసా

- **డీసీఎంఎస్ చైర్మన్ పి .కృష్ణారెడ్డి.**

**చేవెళ్ల , జనవరి 19 (మనం న్యూస్):** తనకు రాజకీయ భవిష్యత్తు కల్పించిన సబితమ్మ నాయకత్వంలోనే పనిచేస్తానని డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.... బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. నా ఊపిరి ఉన్నంత వరకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితమ్మతోనే ఉంటానని తేల్చి చెప్పారు. కావాలనే తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. షాబాద్ లో జరిగిన రైతు దీక్షలో తనకు అవమానం జరిగిందని, స్టేజిపైకి పిలువలేదని తప్పుడు ప్రచారం చేశారని మండి పడ్డారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను ఎంతో ఆప్యాయంగా పలకరించారని, నాపై వస్తున్న పుకార్లను, షికార్లను నమ్మొద్దని, సబితమ్మ ఎక్కడ ఉంటే అక్కడ ఉంటానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా కింద రూ.15వేలు ఇస్తానని, రూ.12వేలకు కుదించడం ఏమిటని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ కొంతమంది రైతులకే వచ్చిందని, రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు పక్షాన పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని, త్వరలో 2వేల మంది రైతులతో సభ నిర్వహిస్తానని తెలిపారు. ఈసమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పెద్దోళ్ల ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ నర్సింలు, మాజీ ఎంపీటీసీ రవీందర్, నాయకులు మాదన్రెడ్డి. రాంప్రసాద్ తదితరులు ఉనారు.



## పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**రంగారెడ్డి, జనవరి 19 (మనం న్యూస్):** మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ చందన చెరువు కట్ట పైన ' పండుగ సాయన్న విగ్రహావిష్కరణ' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి విగ్రహాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డిఆవిష్కరించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ పండగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. పండగ సాయన్న జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, అన్యాయం ఎక్కడ జరిగిన ఎదురించే తత్వం కలిగి ఉండాలని, పండగ సాయన్న జీవిత చరిత్రను భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి, మీర్పేట బి.ఆర్.ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, నీలం మధు, బి ఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు వివిధ పార్టీలకు చెందిన నాయకులు,ముదిరాజ్ సోదరులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపండి

- **దళితులలో ఒక వర్గం ద్రోహిగా మిగలకుండా నిర్ణయం తీసుకోండి:బత్తిన సుధాకర్**
- **మాదిగ ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలిపిన కాచం,బీసీ నేతలు**



**రంగారెడ్డి,జనవరి19(మనం న్యూస్):** ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపాలని బత్తిన సుధాకర్ మాదిగ అన్నారు. ఆదివారం చంపాపేట్ లోని శిల్పి గ్రాండ్ కన్వెన్షన్ లో సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు, బీసీ ఐక్యవేదిక కన్వీనర్ చామకూర రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి బీసీ నేతలు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు,విలేకరులు పాల్గొని ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫిబ్రవరి 7వ తేదిన జరిగే వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల కార్యక్రమంలో పాల్గొని ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు తెలుపుతమని అన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి బత్తిన సుధాకర్ మాదిగ మాట్లాడుతూ... సుప్రీమ్ కోర్టు ఇచ్చిన తీర్పు అందరు గౌరవించి సహకరించాలని, ఎస్సీ వర్గీకరణకు సహకరించకుండా దళితులకు ద్రోహులుగా మిగలకుండా నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకాష్ మాదిగ, వెంకట్ మాదిగ, రాజు మాదిగ, నర్సింగ్ రావు మాదిగ, శేఖర్ మాదిగ, రాములు మాదిగ, బైగల రాములు మాదిగ, ఇరుగు రావి మాదిగ,శాస్త్రీయ ఆనంద్ స్వామి, శశిధర్,కృపానందం తదితరులు పాల్గొన్నారు.



## చర్లపల్లిలో గంజాయి స్వాధీనం నవీన్ కుమార్ ఆభ్కారి అధికారి



**కాప్రా/ చర్లపల్లి, జనవరి 19 (మనం న్యూస్)**నిషేదిత డ్రగ్స్, గంజాయి కొన్న అమ్మిన కఠిన చర్యలు తప్పవని మేడ్చల్ జిల్లా అభ్కారి అధికారి నవీన్ కుమార్ హెచ్చరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అభ్కారి ఉపఅధికారి ముకుంద్ రెడ్డి అదేశాల మేరకు అభ్కారి టస్కోర్ సిఐ భారత్ భూషన్ అధ్వర్యంలో ఆదివారం చర్లపల్లి రాంపల్లిలో దాడులు చేసి గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పట్టుకున్నారు. మధ్యప్రదేశ్ చెందిన హరికుషావా వద్దనాలుగు కిలోలు, ఒరిస్సాకు చెందిన బైనాథ్ బిస్వాల్ వద్ద రెండు కిలోల గంజాయి పట్టుకుని ఘటకేసర్ అభ్కారి స్టేషన్ లో అప్పగించినట్టు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ఇద్దరి నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సిఐ భరత్ భూషణ్, ఎస్ఐ శ్రీనివాన్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ వైద్య సంస్థలు ప్రజాసేవకై అంకితం కావాలి

- **ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

రంగారెడ్డి, జనవరి 19 ( మనం న్యూస్): కార్పొరేట్ వైద్య సంస్థలు ప్రజాసేవక అంకితం అవ్వాలని మహేశ్వరం శాసనసభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ చందనం చెరువు సమీపంలో ఉచితంగా నిర్వహించిన సృష్టి ఆక్యుపంచర్ , నేచరోపతి ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని కార్పొరేట్ వైద్య సంస్థలన్నీ ప్రజల అవసరాల కోసం ప్రజల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు దోహదపడాలని సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి, సిద్దాల లావణ్య, అరకల భూపాల్ రెడ్డి, దిపులాల్ చౌహాన్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకురాళ్ళు తదితరులు పాల్గొన్నారు.



# అనతి కాలంలోనే ప్రజలకు చేరువైన సుధా బ్యాంక్

- **పేద మధ్య తరగతి కుటుంబాలకు బాసటగా రుణాల మంజూరు**
- **స్థాపించిన నాటినుండి నేటి వరకు ఖాతాదారుల మనోధైర్యం**
- **జనాల ఆర్థిక అవసరాల కేరాఫ్ అడ్రస్ గా సుధా అర్బన్ బ్యాంక్**
- **ఏ చోటైనా డిజిటల్ లావాదేవీల సేవలతో మరింత పురోగతి**
- **25 వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యాటక కార్పొరేషన్ శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి**



**సూర్యాపేట, జనవరి 19 (మనం ప్రతినిధి):** సూర్యాపేట జిల్లా కేంద్రంలో అన్నది కాలంలోనే సుధా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ ప్రజల చేరువైందని రాష్ట్ర పర్యటక అభివృద్ధి శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు.. ఆదివారం పట్టణంలోని త్రివేణి ఫంక్షన్ హాల్లో సుధా అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ 25వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ముందుగా జ్యోతి ప్రజ్వల చేశారు . స్థానిక మారుతి విద్యానికేతన్ విద్యార్థులు చేసిన నృత్య కళ పలువురిని ఆకట్టుకున్నాయి .ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ఖాతాదారులకు మనోధైర్యం నింపుతూ వస్తుందని తెలిపారు. 2000 సంవత్సరంలో ప్రముఖ పారిశ్రామికవేత మీలా సత్యనారాయణ చేతుల మీదుగా స్థాపించిన ఈ బ్యాంకు దినదిన అభివృద్ధి చెందుతూ ఆరు బ్రాంచీలతో వినియోగదారులకు సేవలందియటం జరుగుతుందని ఎంతో కష్టపడి దేశస్థాయిలో పారిశ్రామికవేత్తగా ఎదిగిన మీలా సత్యనారాయణ తనయుడు మహాదేవ్ ఈ బ్యాంకుకు చైర్మన్ గా వ్యవహరించడం అటు పారిశ్రామిక రంగంలోనూ ఇటు ఆర్థిక లావాదేవీల కేంద్రంగా ప్రజలకు భరోసాగా బ్యాంకు ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. బ్యాంకు పాలకవర్గం కృషితో నేడు 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం అంత తేలికేం కాదని తెలిపారు. సామాన్య మధ్యతరగతి జనాలకు వ్యాపార గృహ నిర్మాణాల సీనియర్ సిటిజెన్ డిపాజిట్లపై వడ్డీ సౌకర్యం కల్పిస్తూ ప్రజల నమ్మకానికి భరోసాగా నిలిచిందని కొనియాడారు నేడు ప్రజల ఆర్థిక అవసరాలకు కేరాఫ్ అడ్రస్ గా సుధా అర్బన్ బ్యాంకు నిలవడం ఎంత గర్వకారణం అని ప్రపంచంలో ఎక్కడైనా డిజిటల్ సేవల ద్వారా ఖాతాదారుల లావాదేవీలు నిర్వహించుకునేలా చేయడం క్యాష్ లెస్ గ్రామీణ వ్యాపారాలను విస్తరించడంలో బ్యాంకు కొత్తవరవడి నేర్పిందని చెప్పారు అదేవిధంగా వివిధ రుణాల మంజూరు పై వడ్డీ రేట్లు ఆర్బిఐ నిబంధనల ప్రకారం తీసుకోవడమే కాకుండా ఫిక్స్ డిపాజిట్లు పై ఖాతాదారులకు సకాలంలో వడ్డీ చెల్లింపులో సైతం ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తూ వస్తుందన్నారు. సుధా బ్యాంకు మరిన్ని బ్రాంచీలు స్థాపించి ప్రజలకు ముఖ్యంగా పేద మధ్యతరగతి కుటుంబాలకు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం 25వ వార్షికోత్సవ వేడుకలకు విచ్చేసిన ప్రముఖులకు బ్యాంకు పాలకవర్గ సభ్యులు శాలువా కప్పి మెమోరా నా అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకుల ఫెడరేషన్ అధ్యక్షులు వేమిరెడ్డి నరసింహారెడి, వర్కింగ్ ప్రెసిడెంట్ మదన గోపాల స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, బ్యాంకు చైర్మన్ మీలా మహాదేవ్, వైస్ చైర్మన్ పోను గోటి నిర్మల, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్, డైరెక్టర్లు భునగిరి భాస్కర్, అనంతల ప్రభాకర్. శంకర్ లాల్, ఏపూరి శ్రవణ్ మీలా సందీప్ కుమార్, కక్కిరేణి చంద్రశేఖర్, బాణావత్ సుజాత, నిర్వహణ బోర్డు చైర్మన్ స్వామి వెంకటేశ్వర్లు, సభ్యులు చెన్నకేశవరావు, రింగు లక్ష్మీనారాయణ, వెంపటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



# కథా కనికట్టు గుట్టు విప్పిన కథా కార్యశాల



ఇటీవల మహిళా రచయితలకు రెండు రోజుల కథా కార్యశాల జరిగింది. స్వయంగా రచయిత, ప్రచురణ కర్త, వుమెన్ రైటర్స్ ఫోరం వ్యవస్థాపకురాలు భండారు విజయగారి ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. చుట్టూ కొండలు, చెట్లు, పచ్చటి పంటచేలు, ప్రశాంతమైన వాతావరణంలో జరగడం ఆహ్లాదకరంగా ఉంది. భోగారంలోని అంకురం సంస్థ ప్రాంగణంలో ఉదయం పదకొండు గంటలకు మొదలైంది.

హైదరాబాదు, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, సిరిసిల్ల, మహబూబాబాద్, ఒంగోలు, విజయవాడ ఇలా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు ముప్పై మంది రచయిత్రులు ఈ కార్యశాలలో పాల్గొన్నారు. ప్రముఖ రచయిత, బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ బి.ఎస్. రాములుగారు, పలు అవార్డులు పొందిన సుప్రసిద్ధ రచయిత, ట్రావెలర్ శిరం శెట్టి కాంతారావు గారు, విమర్శకులు, రచయిత మండవ సుబ్బారావు గారు సామాజిక కార్యకర్త, రచయిత, గత ముప్పై యేళ్లుగా స్త్రీల కొరకు అహర్నిశలూ పని చేస్తున్న భూమిక సత్యవతి గారు, రచయిత, వ్యవసాయ వేత్త నెల్లుట్ల రమాదేవిగారు శిక్షకులుగా పాల్గొన్నారు. భండారు విజయ,అంకురం సంస్థ నిర్వాహకురాలు సుమిత్ర, రచయిత్రి శాంతి ప్రబోధ, గిరిజ పైడిమర్రి కార్యశాలకు నిర్వాహకులుగా ఉన్నారు.

అంకురం సంస్థలో వాలంటీర్ గా పని చేస్తున్న రాజ రాజేశ్వరి గారు తన స్వీయ రచనా గీతంతో అతిథులకు ఆహ్వానం పలికారు. వుమెన్ రైటర్స్ ఫోరం వ్యవస్థాపకురాలు ఫోరం ఏర్పాటు నేపథ్యాన్ని, లక్ష్యాలను, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. తరువాత జ్యోతి ప్రజ్వలన జరిగింది. అనంతరం రచయితల పరిచయాలతో సమావేశం ప్రారంభమైంది. బి. ఎస్ రాములుగారి సహచరి శ్యామల గారు తమ అనుభవాలను పంచుకున్న తరువాత అట్టడుగున మరుగున పడి వున్న అలాంటి వ్యక్తుల కథలే ప్రస్తుతం కథా వస్తువులు కావాలని శ్రోతలందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

కథా శిల్పం, వస్తువు అనే అంశం పైన బి. ఎస్ రాములు గారు మాట్లాడుతూ... కథలు రాసేవారికి నిశిత దృష్టి, పరిశీలన, వివేచన ఉండాలన్నారు. వాక్య నిర్మాణంలో పట్టు సాధించాలి. కొత్తగా కథలు రాస్తు న్న వాళ్ళకు తాను రాసిన కథల బడి పుస్తకం కరదీపిక లాగా పనిచేస్తుందని చెప్పడమే కాకుండా ఆ పుస్తకాన్ని అందరికీ అందుబాటులో ఉంచారు. ప్రతి కథకు ప్రారంభం, కొనసాగింపు, ముగింపు ఉండాలి. మూడు నాలుగు పాత్రలు మాత్రమే ఉండాలి. 8 నుంచి 20 పేజీల వరకు కథ నిడివి ఉండవచ్చు. కథలో సంభాషణలు తప్పకుండా ఉండాలి. పాత్ర చిత్రణ భిన్నంగా ఉండాలి. సార్వజనీన విలువలతో కూడిన వస్తువు ఉండాలి. అంటే ప్రేమ, స్నేహం మొదలైన అంశాలు. సన్నివేశాలను మారుస్తూ ఉండాలి. సన్నివేశానికి అనుకూలమైన ప్రకృతి వర్ణన కూడా చేయొచ్చు. ఇవన్నీ కథ కొనసాగింపుకు ఉపయోగపడతాయి. పూర్వ జ్ఞాపకాల ద్వారా కూడా కథను నడిపించ వచ్చు. వస్తువుని బట్టి కథలో వేగం ఉండాలి. స్థూలంగా.....1. పాత్రలు, 2. దృశ్యీకరణ, 3. సంఘర్షణ, 4. సంఘటనలు, 5. వ్యక్తిత్వ చిత్రణ, 6. ఆహార్యం, 7. సంభాషణలు అనే అంశాలు కథలో ఉండాలి.



ప్రఖ్యాత రష్యన్ రచయిత లియో టాల్ స్టాయ్ STORY కి ఇచ్చిన నిర్వచనాన్ని గుర్తు చేశారు.
S... soft
T... Telling
0... on
R... Reality
Y... Yesterday.
అంటే గతంలో జరిగిన వాస్తవాన్ని మృదువుగా చెప్పడమే కథ.

వాక్య నిర్మాణం ద్వారానే పాత్రల కదలికలను చెప్పాలి. దీనినే ఆహార్యం అంటారు. ఉదాహరణకు :- ' కోపంగా ఉన్నాడు ', ' కోపంగా చూశాడు ' అనే రెండు చిన్న వాక్యాలను గమనిస్తే.... మొదటి వాక్యం వ్యాసరచనలో ఉంటుంది. రెండో వాక్యంలో ' చూశాడు ' పదం ద్వారా ఆహార్యాన్ని చెప్పడం. ఈ పద ప్రయోగం తో పాత్రలోని కదలికను సూచించడం అన్నమాట. చివరగా అతిముఖ్య విషయం... కథా వస్తువు వ్యక్తిగతంలోనుంచి సమూహాలలోకి మార్పు చెందాలి. అంటే సమస్యను వ్యక్తిగతంగా తీసుకున్నా దానిని జనరలైజ్ చేసినపుడే పాఠకులు ఆదరిస్తారని ముగించారు.

తరువాత కథల మాంత్రికుడు శిరం శెట్టి కాంతారావు గారు సంభాషణ ధోరణిలో మాట్లాడుతూ ఉత్సాహపరిచారు. ఆయన రాసిన మూడు వందల కథలలో దాదాపు వంద కథలకు అవార్డులు వచ్చాయి... బీ.ఎస్ రాములు గారు నిర్మించారని, తాను రంగులు వేసి ఎలా ఆకర్షణీయంగా మార్చ వచ్చునో వివరిస్తామన్నారు. ఏ కథకైనా ఆరంభం, కొనసాగింపు, ముగింపు ఉండవలసిందే... అయితే కొనసాగింపు పాఠకులకు విసుగెత్తించ కూడదు. ముగింపు అద్భుతంగా ఉండాలి. దీనికి నెల్లూరు కేశవరావు కథను ఉదాహరణగా చెప్పారు. ఉత్తమ సాహిత్యానికి ప్రయోజనం ఉంటుంది. రచన పాఠకులకు ఉపయోగ పడాలి. అంటూ తాను రాసిన 'వారి కుటుంబంలో తిరిగి వెన్నెల వచ్చింది ' అనే కథను ఉదహరించారు. మనస్పర్థల వలన దూరమైన కుటుంబ సభ్యులు తిరిగి ఏక మయ్యారట. అది ఆ కథా ప్రయోజనం. విన్నవాటిని, కన్నవాటిని తనదైన పంథాలో రాయడమే కథ. అదే కథా వస్తువు. పైన పేర్కొన్న కథ అలాంటిదే. కథకు ముందరే శీర్షికను నిర్ణయించ కూడదు. కథా వస్తువుకు సంబంధించిన పేరు పెడితే... పాఠకులకు చదివే ఆసక్తి ఉండదు. ఎందుకంటే పేరును బట్టి కథను ఊహిస్తారు. పాత్ర మారినప్పుడల్లా పేరా మారాలి. సన్నివేశంతోపాటు పరిసరాల పరిశీలన వర్ణన ఉండాలి. కూరలో ఉప్పు లాగా రచయిత అంతర్గతంగా ఉండాలి. దీనినే సర్వసాక్షి కథన పద్ధతి అంటారు. కథను ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుషలలో చెప్పవచ్చు.

స్థూలంగా......1. డేగ కళ్ళు ( సునిశిత పరిశీలన)
2. పాము చెవులు ( వినికిడి శక్తి )
3. కుక్క ముక్కు ( వాసన పసిగట్టే శక్తి ) రచయితకు ఉండాలి

వీటికి ఉదాహరణగా తన స్వీయ కథ 'గంధపు చెక్కలు' చెప్పారు.

రచయిత తాను రాసిన కథను స్వయం సవరణ (self editing) చేసు కోవడం తప్పని సరి. 4,5 సార్లు సవరించుకొని, బాగుందని తనకు అనిపించిన తరువాతనే కథను పత్రికకు పంపిస్తానని చెప్పారు. రచయితకు కావలసిన వస్తువు దొరికే వరకు కొంగ లాగా తపస్సు చేయాలని, పాఠకుడికి ఎలాంటి కథను ఇవ్వాలో కుక్కుటం (కోడి) లాగా తెలియాలన్నారు. ఒక ప్రాంతంలోని ఆదివాసీలు కరక దుంపలను కుడుములుగా చేసుకొని తింటారట. అయితే అవి విషతుల్యమైనవి. వాటిలోని విషాన్ని పోగొట్టడానికి మూడు రాత్రులు నదీప్రవాహంలో ఉంచుతారట. నానిన తరువాత విషం పోతుందట. రచయిత వాళ్ళతో కొంత కాలం ఉండి తెలుసుకొని రాశారట. అందుకే క్షేత్ర పర్యటన, జీవితాలను పరిశీలించి రాసినప్పుడే పాఠకులు కథలను ఆదరిస్తారని, అలాంటి వాటికి అవార్డులు వాటికవే వెతుక్కుంటూ వస్తాయని తమ కథలకు అవార్డులు రావడంలోని రహస్యాన్ని వెల్లడించారు.

విమర్శకుడు, రచయిత అయిన మండవ సుబ్బారావు గారు మాట్లాడుతూ కథ అంటే చెప్పడం అని అర్థం. దానికి ప్రత్యేక లక్షణాలు అవసరం లేదని మనం చెప్పడమే ప్రధాన లక్షణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత రష్యన్ రచయిత లియో టాల్ స్టాయ్ STORY కి ఇచ్చిన నిర్వచనాన్ని గుర్తు చేశారు.

S... soft
T... Telling
0... on
R... Reality
Y... Yesterday.

అంటే గతంలో జరిగిన వాస్తవాన్ని మృదువుగా చెప్పడమే కథ. దానికి నిడివితో కూడా పనిలేదంటూ ఆంధ్రజ్యోతిలో వరుసగా కొంతకాలం ప్రచురితమైన నానో కథలను పేర్కొన్నారు. వేగవంతమైన ప్రస్తుత కాలంలో పెద్ద కథలు చదువరని, పాఠకులకు అవసరమైన రచనలే రచయితలు చేయాలన్నారు.

భూమిక సత్యవతిగారు మాట్లాడుతూ ముఖ్యంగా రచయితలకు 'Genderlens' ఉండాలన్నారు. ఈ సందర్భంగా 2004 లో భూమిక,అన్వేషి సంస్థలు కలిసి నిర్వహించిన కథా కార్యశాలను గుర్తు చేసారు. అప్పటిదాకా గురజాడ రాసిన ' దిద్దుబాటు ' కథనే మొదటి కథగా చెప్పేవారు. ఆ కార్యశాల ఫలితంగా బండారు అచ్చమాంబ మొదటి కథకురాలిగా ప్రపంచానికి తెలిసింది. సాహిత్య చరిత్ర పురుషులు రాయడం కూడా ఒక కారణం కావచ్చు. ' మనకు తెలియని మన చరిత్ర ' పుస్తకాన్ని ప్రస్తావించారు. ఒంటరితనం, మార్కెట్ బ్రాండ్ ఇమేజీ కథావస్తువులు కావాలన్నారు. ట్రాన్స్ జండర్ వ్యక్తుల జీవితాలు సాహిత్యంలోకి రావాలన్నారు. ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న స్త్రీల చట్టాలు, చట్టాలుగానే మిగిలాయని, ఆచరణలోకి రాలేదని బాధను వ్యక్తం చేశారు.

అప్పటిదాకా సీరియస్ గా ఉన్న వాతావరణం నెల్లుట్ల రమాదేవి గారి హాస్య ప్రసంగంతో కొంత తేలిక పడింది. ఆమె ప్రసంగాంశం రచనలో హాస్యం. ఆమె తన ప్రసంగంలో హావభావాలతో హాస్యాన్ని పండించారు. సందర్భానుగుణంగా హాస్యం ఉండాలి. హాస్యంలో సంభాషణకే ప్రాధాన్యత ఉంటుంది. ఔచిత్యంతో కూడిన హాస్యం తప్పనిసరి. శోకం, సందర్భం (Situation) హాస్యానికి పునాదులు. ఎదుటివారిని బాధపెట్టే విధంగా హాస్యం ఉండకూడదు. వీటికి ఉదాహరణలుగా బలిపీఠం, జానకి విముక్తి లోని హాస్య సంఘటనలను పేర్కొన్నారు. యర్రం శెట్టి సాయి రచనలను పేర్కొన్నారు. ఇటీవల ఆమె విడుదల చేసిన పుస్తకం 'రమాయణం' కూడా హాస్యస్ఫోరకమైనదే...

భోజనానంతరం ఐదు గ్రూపులుగా విభజించి ఓల్గా రాసిన ' నోర్ముయ్ ' కథను విశ్లేషణకు ఇచ్చారు నిర్వాహకులు. కొండపల్లి నీహారిణి గారు కథను భావయుక్తంగా చదివారు. పిదప బృంద చర్చ చేసి, బృందంలోని ఒకరు దానిని ప్రజెంట్ చేశారు. కథ దాదాపు పాతికేళ్ళ కిందట రాసిందే అయినా ప్రస్తుత కాలానికి కూడా తగినదే...పితృస్వామ్య వ్యవస్థలో నేటికీ స్త్రీలు నోరు మూసుకొని ఉండాల్సిన పరిస్థితే ఉంది. నిర్దేశించిన పరిమితిలోనే మాట్లాడాలి. ఒక చిన్న మాటను తీసుకొని, కుటుంబం, సమాజంలోని రాజకీయాలను విశ్లేషిస్తూ కథ నడిపిన తీరు అద్భుతం. చిన్న వాక్యాలలో సంభాషణలతో ఉత్తమ పురుషలో కథ నడిచింది. కథా విశ్లేషణతో మొదటి రోజు సెషన్ ముగిసింది.

రాత్రి భోజనాల సమయంలో కూడా చర్చ సాగింది. వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. కొందరు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మరి కొందరు. తాము రాసి తెచ్చిన కథలలోని లోపాలు సవరించుకున్నారు.


మరునాడు ఉదయం తొమ్మిది గంటలకే కార్యక్రమం మొదలైంది. ముది గంటి సుజాతరెడ్డి రాసిన 'ఆక్రమణం', విమల మోర్తాల రాసిన 'కొన్ని నక్షత్రాలు కాసిన్ని కన్నీళ్ళు', ఎండ్లూరి మానస రాసిన 'మెర్సీ పరిశుద్ద పరిణయం' కథలను చర్చించి విశ్లేషించారు. నిర్వాహకులు ఐదు కథలను ఈ కార్యశాలలో చర్చకు పెట్టాలని అనుకున్నారు. కానీ సమయాభావం చేత నాలుగు కథలనే విశ్లేషించడం జరిగింది. నాలుగూ విభిన్నమైన కథలను ఎన్నుకోవడం విశేషం. ఒకటి పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీల పరి స్థితిని చెపితే, రెండోది ఆదివాసీల సంస్క ృతి, అస్తిత్వాలు ఎలా ఆక్రమణకు గురి అవుతున్నాయో వివరించింది. మూడో కథ నవ యువకులు విప్లవోద్యమం లోనికి వెళ్ళీ వెళ్ళక ముందే బూటకపు ఎన్ కౌంటర్లకు బలి అయ్యే విధానం. శవాలను కూడా చూడనివ్వని దారుణమైన పరిస్థితులను కళ్ళముందు ఉంచింది. నాలుగో కథ క్రిస్టియానిటీలోని వివాహ పద్ధతిని చెపుతూనే సమాజంలోని కులవ్యవస్థను చర్చించింది.

ముగింపు సమావేశానికి అతిథిగా వచ్చిన రచయిత, న్యాయవాది హేమ లలితగారు మాట్లాడుతూ స్త్రీల చట్టాలను సాహిత్యంలోకి తీసుక రావలసిన అవసరాన్ని చెపుతూ యోధ కథా సంపుటిలో తాను రాసిన 'భార్యా భరణం' కథను ప్రస్తావించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరు తమ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. రెండు రోజుల కార్యశాలలో తమకు తెలియని ఎన్నో విషయాలను తెలుసుకున్నామని, ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, బోలెడంత ఉత్సాహాన్ని మూటగట్టుకుని వెళుతున్నామన్నారు. కథలు రాయడంతోపాటు, ఎలా విశ్లేషించాలో, విమర్శించాలో తెలియ చేయడం కార్యశాల సాధించిన ప్రతిఫలం. చివరగా ప్రతి ఒక్కరూ కథ రాయాలని, వాటిని హస్మిత ప్రచురణ సంస్థ పుస్తకంగా ప్రచురిస్తుందని భండారు విజయ ప్రకటించారు. ప్రశాంత వాతావరణంలో ఉదయపు నడక, ట్రెక్కింగ్, ఉయ్యాల ఆటలు, రుచికరమైన టిఫిన్, టీ, కాఫీలు, భోజనాలు... అదనపు ఆకర్షణలు. ఉత్సాహంగా తిరుగుతూ అందరి అవసరాలు తీరుస్తూ అంకురం లోనే పెరిగి పెద్దదైన తఫీన్ అంకురం సంస్థ కృషికి సజీవ సాక్ష్యం.

**- గిరిజ పైడిమర్రి**
9949 44 3414

## కవిత్వమొక తీరని దాహం

జీవితం చాల చిన్నది అని అందరు అంటుంటారు. కానీ నేను మాత్రం ప్రేమించక పోతే జీవితం చాల చిన్నగా అనిపిస్తుంది అని నమ్ముతున్నాను. ఆ నమ్మకం మీదనే నా మొదటి పుస్తకాన్ని రాసాను. 'జాయ్ ఆఫ్ లవింగ్ ' పేరుతో వస్తున్న నా పుస్తకం విభిన్న కవిత్వాల సంపుటి. నా అనుభవాలు అనుభూతులుతో పాటు నేను చూసిన, విన్న ఎన్నో కథలను చాలా సులభమైన ఇంకా చాలా సాధారణమైన చిన్న చిన్న కవితలుగా తీర్చిదిద్దాను. ఒక్కో కవిత ఒక్కో కథ, ఒక్కో కథ ఒక్కో జ్ఞాపకం. నావే కాదు మీ అందరివీ కూడా.





చదివే ప్రతి కవిత్వం మీ మీ జీవితాలలో ఎదో ఒకసారి అయినా జరిగే ఉంటాయనే జరిగితే బాగుండు అనో అనిపిస్తూనే ఉంటుంది. ఇవి మీ అందరి జీవితాలలో కూడా జరిగే మధుర జ్ఞాపకాలే. చిరుజల్లుల్లా మీద పడతాయి చదువుతూ ఉంటే ఒక్కో అక్షరం..!! నేను రాసిన ఈ కవితలు బతుకు తాలూకు ప్రేమ కథలు. మిమ్మల్ని ఖచ్చితంగా మెప్పిస్తాయి,ఊరడిస్తాయి, ఊరటనిస్తాయి. పదాల అల్లికనో, వాక్య నిర్మాణమో కాదు కవిత అంటే, హృదయం చిన్నాభిన్నం చేసే ఉద్వేగాల సముదాయం కవిత. మనచుట్టుము ఉన్న చిన్న చిన్న సరదాలని ప్రేమించ గలిగితే అందరం కవులమే. అలా ప్రేమించటం కుదరట్లేదనో లేక ప్రేమలో పడటం ఎలానో తెలియట్లేదు అనో ఆనుకుంటున్న వాళ్ళకి నా పుస్తకం నేను ఇచ్చే బహుమానం. సోషల్ మీడియా జనరేషన్ లో ఎక్కువ పేజీలు రాస్తే చదవరు అని తెలిసే ప్రతి కథని ప్రతి కవిత్వాన్ని కేవలం ఒకే పేజీ లో రాసాను. 'ప్రయాణమే గాని గమ్యం కాదు ప్రేమంటే. గెలుపు ఓటములు ఉండవు.'ఈ విషయం అర్థం కాక చాలా మంది మదన పడిపోతుంటారు. ప్రేమలో ఓడిపోయాం అనుకుని, తమలో ఏదో లోపం ఉంది అనుకుని తమని తాము నిందించుకుని, చాలా గాయపరుచుకుంటుంటారు.అలాంటివాళ్ళకి నేను చెప్పాలనుకున్నది ఒక్కటే, 'మీరు ఒంటరి కారు'. అందం గా నవ్వే ఎన్నో చిరునవ్వుల వెనుక ఈ విరిగిన మనసులు దాగివుంటాయి. అలా విరగని మనసులని చూసి అసూయ పడటం ఎంత తప్పో, విరిగిన మనసులని నిందించటం కూడా అంతే తప్పు. ప్రేమ లో కలిగే దురదృష్టాలని మలుపులు గా మార్చుకుని మళ్లి ప్రయాణం సాగించటమే జీవితం. ప్రేమలో పడాలి అనుకునే వాళ్ళకి, పాత ప్రేమ జ్ఞాపకాల నుండి బయటకి పడాలి అనుకునే వాళ్ళకి న పుస్తకం ఒక మంచి తోడు గా నిలిచి పోతుంది అని ఆశిస్తున్నాను.

**ఆధునిక కవిత్వం అర్థం కాలేదంటే, ఆధునిక జీవితం అర్థం కాలేదన్నమాటే..**
**కవిత్వ మొక తీరని దాహం - శ్రీశ్రీ.**
**అబద్ధాలాడడమంత సులభం అవదు సుమూ! కవిత అల్లడం-దాశరథి కృష్ణమాచార్య**

**- జాయ్ సాగర్**

## పఠనంతో మానసిక ఆరోగ్యం

మానసికంగా ఆరోగ్యంగా ఉండటం అనేది ఒక విలాసం కాదు ఇది అత్యవసరం.'ది ల్యాంసెట్ సైకియాట్రి'అనే పుస్తకం (2017 )లో తెలిపినట్లుగా ఒక పరిశీలనలో 197.3 మిలియన్ ప్రజలు భారతదేశంలో మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. ఇందులో 45.7 మిలియన్ ప్రజలు నిస్ప ృహ,నిరాశ రుగ్మతలతో బాధపడుతున్నారు. 44.9 మిలియన్ ప్రజలు ఆందోళన రుగ్మతతో బాధపడుతున్నారు.అంటే ప్రతి 7 గురిలో ఒకరు ఏదో ఒక రుగ్మతతో బాధపడుతున్నారు. కానీ వారు బాధపడుతున్నట్లు ఎవరికీ చెప్పడం లేదు. చాలా తక్కువ మంది మాత్రమే తాము బాధపడుతున్నట్లు తెలియజేస్తున్నారు. అవగాహన లోపంతోనూ, సమాజంలో పరువు పోతుందనే భావనతోను వీరు సరైన సహాయాన్ని సరైన సమయంలో పొందలేకపోతున్నారు. మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారిలో క్షేమకరమైన మనసు ఉన్నవారు కొంతమంది మాత్రమే. పుస్తకాలు చదవడం వలన ఎంతోమంది నిరాశ, నిస్ప ృహ, ఒత్తిడిల నుండి బయట పడిన వారు చాలామంది ఉన్నారు. పుస్తక పఠనం ఇటువంటి బాధలలో ఉన్న వారికి ఎంతగానో సహాయపడింది. నిరాశ, నిస్పృహ, ఒత్తిడి నుండి బయటపడిన వారి స్ఫూర్తిదాయకమైన కథలను పుస్తకాల నుండి తెలుసుకొనుట ద్వారా ఎంతో మేలు చేకూరుతుంది. భయం, అపజయం, తిరస్కరణ లాంటి వాటి నుండి అధిగమించడానికి అవసరమైన వివిధ రకాల మార్గాలను ఈ పుస్తకాలు అందిస్తాయి. ఉత్తర ఆఫ్రికా రచయిత 'కాల్లిన్ హర్ గ్రీవ్స్' తను రచించిన 'గ్లిమ్మర్స్'అనే పుస్తకంలో తన 10వ ఏటనే 'స్వయం ప్రతిరక్షక వ్యాధి' నుండి బయటపడినట్లు తెలుపుతుంది. జీవితం అనేది ఎన్నో రకాల ఇబ్బందులతో కూడుకున్నదని,ఎన్నో చీకటి రోజులు ఉంటాయని, అవి మనకి జీవితంలో మచ్చలు లాగా మిగిలిపోతాయని, వాటినుండి బయటపడ టానికి ఆశ, సంతోషం అనే మెరుపులు ఎంతగానో ఉపయోగపడతాయని తన'గ్లిమ్మర్స్' పుస్తకంలో తెలియజేస్తుంది. అది ఒక పసిపాప నవ్వులు చూడడం ద్వారా లేదా వస్తూ,పోతూ ఉన్న మబ్బుల మధ్యలో ఉన్న సూర్యుని అస్తమయంలో గమనించవచ్చు. ఎన్నో కష్టతరమైన బాధల నుండి ఉపశమనం పొందడానికి తనను తాను ప్రేమించుకోవడం,కృతజ్ఞతాపూర్వకంగా ఉండడం, చిన్న చిన్న విషయాల్లో ఆనందాన్ని పొందడం వంటివి ఎంతగానో దోహదపడతాయని తెలుపుతుంది. ఆమె తన పుస్తకంలో జీవితంలో సంతోషంగా ఉండటానికి ఎన్నో రకాల పద్ధతులను ఉదహరించింది.



ఒత్తిడి అనేది మానసిక ప్రశాంతతకు మరియు ఆరోగ్యానికి భంగం కలిగిస్తుంది. నిపుణులు తెలిపే దాన్ని బట్టి ప్రస్తుత జీవన శైలిలో ఒత్తిడి లేకుండా ఉండడం సాధ్యం కాదంటారు. పనిచేసే ప్రదేశంలో మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉండేటట్లు చేయడమే లక్ష్యంగా ఈనాటి ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. తీవ్రమైన భావోద్వేగాలు కలిగి ఉన్నప్పుడు, పుస్తక పఠనం ఎంతగానో ఉపశమనం కలిగిస్తుంది. 2019 లో ప్రచురితమైన 'బర్న్ అవుట్ ' పుస్తకంలో ఎమిలీ మరియు అమెలియా నాగోస్కి అనే ఇద్దరు అక్కచెల్లెళ్ళు పురుషుల కంటే మహిళలు ఎంత భావోద్వేగాలకు గురవుతారో తెలియజేశారు.

ఆ మానసిక ఒత్తిడిల నుండి బయటపడటానికి మహిళలకు చిన్నచిన్న పరిష్కారాలను తెలియపరిచి సమతుల్యమైన జీవితాన్ని ఎలా పొందాలో తెలియజేశారు. జోహన్ హరి 2019లోవ్రాసిన 'లాస్ట్ కనెక్షన్స్' పుస్తకంలో వ్యక్తిగత బాధలు ఇతరులకు తెలియపరచుటకు ఎంతో ధైర్యం ఉండాలి అంటారు. ఆ విధంగా తెలియపరచ నందు వల్లనే నిరాశ, నిస్ప ృహ, ఒత్తిడి లాంటి మానసిక సమస్యలకు దారితీస్తాయి అంటా రు. సమాజానికి, చుట్టు ప్రక్కల వారికి తెలియజేయనంతవరకు ఆ సమస్యలు నీతోనే ఉండి వాటిని అధిగమించలేని స్థితిలో ఉండిపోతాయి అంటారు.

వీలైనంతవరకు ఆలస్యం చేయకుండా ఇతరులతో తన బాధలను పంచుకొనడం ద్వారా,పుస్తక పఠనం ద్వారా,చిన్న చిన్న ఉపాయాలను తెలుసుకొనుట ద్వారా ఈ బాధల నుండి విముక్తి పొందవచ్చును అంటారు.

'ఇన్టెన్ టైమ్స్‌కామర్' పుస్తకంలో డాక్టర్ కిరెన్ షెనెక్ తెలిపినట్లు ఒత్తిడి లేని జీవనం అనునది మనం ఆలోచించే దానికంటే చాలా సులభం. ఈ ఒత్తిడికి ఎటువంటి మందులు అవసరం లేదు. మన జీవితంలో ఈమె తెలిపిన ప్రథమ చికిత్స ఉపకరణాలు పాటిస్తే జీవితం ఎంతో ఆనందదాయకంగా ఉంటుంది.డేవిడ్ మెకానిక్ 2013లో రాసిన'మెంటల్ హెల్త్ అండ్ సోషల్ పాలసీ'లో మానసిక రుగ్మతలు రావడానికి కల వివిధ రకాల కారణాలను తెలియపరుస్తారు. 2013 లో ప్రచురితమైన 'ది ఫ్యామిలీ గైడ్ టు మెంటల్ కేర్' రచయిత ఐ.షెడరర్ మానసిక అనారోగ్యానికి వయసు, ప్రాంతం, జాతీయత, ఆదాయ వనరులు లాంటి వాటితో సంబంధం లేదు అని తెలుపుతారు. సరియైన సమయంలో గుర్తించకపోతే, కుటుంబం మొత్తం ప్రమాదంలో పడే అవకాశం ఉందంటారు. ఈ పుస్తకంలో సమస్యను గుర్తించడం ఎలా, ఏమి చేయాలి, ఎలా చేయాలి, ఎటువంటి చర్యలు తీసుకోవాలి, సరియైన జాగ్రత్తలు ఎలా తీసుకోవాలి, ఉపయోగ కరమైన వైద్యము మరియు నివారణ మార్గాలను ఇందులో తెలుపుతారు. పుస్తక పఠనం అనునది వీటన్నింటికీ గొప్ప చికిత్సగా చెప్పవచ్చు.

**- గోమఠం నరసింహా చార్యులు**
9948204890

## ఊపిరి



నిన్ను నా ఊపిరి
ఆగే ఆఖరి గడియవరకు
గుండె గదిలో
దాచుకుంటా!
మస్తిష్కంలో
ముద్రించుకుంటా!

నువ్వో తీపి జ్ఞాపకానివని కాదు
మరువలేని పాఠాలను
దిగమింగుకోలేని గుణపాఠాలను
ఊహించని ఉప్పెనలిచ్చి తల్లకిందులు చేసావు

బ్రతకడం నేర్పావు
బ్రతికించడం నేర్పావు
కావాల్సినంత ఓర్పునిచ్చావు
నాలో సహనానికి సంతకమైనావు

ఓదార్పు ఇవ్వకపోయినా..
ఒంటరితనపు అనుభవాన్నిచ్చావు
ఆనందాన్నివ్వకపోయినా...
పరిస్థితేదైనా మొండిగా ముందుకెళ్లడం నేర్పావు

ఇన్ని నేర్పిన నిన్ను
ఊపిరి ఆగేవరకు, చితిపై చేరి
నా కాయం బూడిద అయ్యేవరకు
నిన్ను మరువలేను మిత్రమా!

**- వాసి జ్యోత్స్న**
9866843005

## కొమురవెల్లి మల్లన్న



కొమురవెల్లి లో కొలువైన
మల్లన్న
కోరిన కోరికలు తీర్చే
మల్లన్న
కోర మీసాల కోటి
మహిమల మల్లన్న!!

కొండ సొరకలో వెలిసిన మల్లన్న
బండారి తో దండిగా పూజలు
బోనంతో సాక పెట్టి సల్లంగా
ఉండాలనే కోరే భక్తులు
పసుపు కుంకుమతో మల్లన్నకు పట్నాలు!!

ఒగ్గోళ్ళ కొలుపుతో మేలుకొలుపులు మల్లన్నను
కోరుకున్న వారికి కొంగు బంగారం
వారం వారం ఆదివారంనాడు పూజలు
కొమురవెల్లి కొండల్లో కొలువైన మల్లన్న!!
బండారితోభక్తుల శివసత్తులతో ఆటపాటలు
డప్పులడమరుకంతో సప్పుళ్ల ఘనమైన
పూజలుమల్లన్నకు!!

**- దేవులపల్లి రమేశ్**
9963701294

ఎడిట్ పేజీ కోసం మీ మీ వ్యాసాలు, సామాజిక విశ్లేషణలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
– ఎడిటర్

## 21న వుప్పల నరసింహం యాదిలో సభ

21-01-2025 మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ,సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియం 1వ అంతస్తు, నిజాం కాలేజీ ఎదురుగా హైదరాబాద్ మిత్రులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వుప్పల నరసింహం యాదిలో సభ జరుగుతున్నది. సీనియర్ జర్నలిస్ట్ కథా రచయిత వ్యాసకర్త వుప్పల నరసింహం నవంబర్ 14.2024 రోజున గుండెపోటుతో చనిపోయిన విషయం అందరికీ తెలిసిందే.

ఈ సభకు సభాధ్యక్షులుగా వుప్పల బాలరాజు, వక్తలుగా జయధీర్ తిరుమలరావు, బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, కవి యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, ఎస్.యం. ప్రాణ్ రావు, తుమ్మలపల్లి రఘురాములు, శంకర నారాయణ, అనిల్ అట్లూరి, వనపట్ల సుబ్బయ్య, కెపి. అశోక్ కుమార్, జంపాల ప్రవీణ్ తదితరులు ప్రసంగిస్తారు. సభకు అందరు హాజరై నివాళులు అర్పించాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

**- నిర్వహణ**
వుప్పల నరసింహం
మిత్రులు మరియు కుటుంబ సభ్యులు

## వల

వాడు
వల పట్టుకుని చెరువులో కాలు పెడితే
చెరువు చెరువంతా ఉలిక్కిపడ్డది

వాడు
వల ఎగరేసి చూపు విసురుతుంటే
గండె పర్కలు కూడా
బుడ్డపర్కల్లెక్క గుండె పగులుతున్నయి

వాడు
ఏ ఆయుధమూ లేని ఒంటరి మీద
జరుగుతున్న కత్తి దాడి
యుద్ధం గమనిస్తున్న చెట్టు మీది కొంగలు
శాంతి దూతలు

ఇక్కడ కడుపు నిండాలంటే
ఎదుటోని పొట్ట గొట్టాలి
చేతగాని కొంగలు
ఆకలి వెంటబెట్టుకొని
ఇంకో తావు వెతుకుతున్నయి

వల చేపలకే కాదు
గట్టునున్న పక్షులకూ మోసమే.

**- గజ్జెల రామకృష్ణ**
8977412795

# సిపిఎం రాష్ట్ర మహాసభల జయప్రదంకై 2కేరన్

- 25న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి




**కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 19(మనం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)సిపిఎం తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని 25న గొప్ప బహిరంగ సభ జరుగుతుందని అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ఆదివారం మహాసభలు జయప్రదం కావాలని కాంక్షిస్తూ గీత భవన్ చౌరస్తా నుండి కమాన్ చౌరస్తా వరకు పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2కె రన్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ సిపిఎం ప్రజాసమస్యల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. పార్టీ నిరంతరం పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, కూలీలు, వృత్తిదారులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం పోరాడుతున్న పార్టీ అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానం సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమిస్తున్న పార్టీ సిపిఎం అన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని ఆర్థిక సామాజిక అంశాలు కార్మిక కర్షక పేదలు మహిళలు ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామికరంగాన్ని వ్యవసాయరంగాన్ని దివాలా తీయించాయని, విద్య వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిందన్నారు. ఉపాధి హామీని పట్టణాలకు విస్తరించాలన్నారు. ఈనెల 26 నుండి అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొదలైన సంక్షేమ పథకాల్లో నిజమైన పేదలని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డులు, రేషన్ కార్డులు ప్రతిపాదికగా తీసుకుంటే అవి లేనివారికి అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏడో గ్యారెంటీ అయినా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అనే అంశాలు కాంగ్రెస్ ఏడాది పాలనలో కానరావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే ఎవరినైనా ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. గత సర్కార్ బాటలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రయాణిస్తుందని విమర్శించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ రాష్ట్ర నాలుగో మహాసభ నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు ఒక దిక్సూచిగా దిశా నిర్దేశం చేసే విధంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ రాష్ట్ర మహాసభల్లో అనేక ప్రజా సమస్యలపై చర్చించి ప్రజల పక్షాన రాజీలేని నికరమైన పోరాటాలు చేస్తుందన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు, సానుభూతిపరులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వాసుదేవ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, జి. బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, జి. రాజేశం, డి. నరేష్ పటేల్, కోనేటి నాగరాణి నాయకులు తిప్పారపు సురేష్, జి. తిరుపతి నాయక్, గజ్జల శ్రీకాంత్, కాంపల్లి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# గుడ్ లైఫ్ ఆసుపత్రి పై దాడి ఘటనలో నిందితుడికి శిక్ష

- డాక్టర్ మరియు సిబ్బంది పై దుర్భాషలాడిన వైనం
- టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు






**కరీంనగర్ క్రైమ్, జనవరి 19 (మనం న్యూస్):** నగరంలోని గుడ్ లైఫ్ హాస్పిటల్ పై రౌడీషీటర్ మతిన్ తన అనుచరులతో దాడి చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆసిఫాబాద్ కాగజ్ నగర్‌కు చెందిన నఫీస్ ఫాతిమా (70) అనే వృద్ధురాలు గత బుధవారం అనారోగ్యంతో స్థానిక కరీంనగర్‌లోని డాక్టర్ స్ట్రీట్ నందలి గుడ్ లైఫ్ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరింది. చికిత్స కొనసాగుతుండగానే రోగి మనుమడైన అహ్మద్ గురువారం నఫీస్ ఫాతిమాను డిశ్చార్జ్ చేయాలనీ అడగగా డాక్టర్ అంకిత్ సక్సేనా ఎం డి ఫిజీషియన్, అప్పటివరకు రోగికి చేసిన చికిత్స ఖర్చును చెల్లించి తీసుకెళ్లవచ్చని డాక్టర్ తెలిపాడు. ఇదిలా ఉండగా అదే రోజు రాత్రి సమయంలో సుమారు 10:40 గంటలకు అహమద్, రౌడీ షీటర్ మతిన్ ఖాన్ మరికొంత మంది స్నేహితులు కలిసి ఆసుపత్రిలోని ఐసియూలోకి ప్రవేశించి బిల్లు చెల్లించకుండా రోగిని తమవెంట తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అక్కడున్న డ్యూటీ డాక్టర్, సిబ్బంది అడ్డుకోగా వారిపై దుర్భాషలాడి, దాడికి సైతం పాల్పడ్డారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కరీంనగర్ టూ టౌన్ పోలీసులు, విచారణ చేపట్టారు. విచారణలో బాధితుడు ఫిర్యాదు నిజమేనని తేలిందని, ఆసుపత్రిలోని డాక్టర్, సిబ్బంది పై దుర్భాషలాడి, దాడికి సైతం పాల్పడ్డారని తేలినందున నిందితులపై 329 (4), 292, 115 (2), 351 (2) రెడ్ విత్ 3 (5) ఆఫ్ బి. ఎన్. ఎస్. - 2023 సెక్షన్ల ప్రకారం నిందితులైన, కరీంనగర్‌లోని మంకమ్మతోటకు చెందిన 1. షేక్ ఖాజా మొయినుద్దీన్ / మతిన్ ఖాన్, తండ్రి: షేక్ మజార్ (32), ముస్లిం, ఓసిసి: కారు డ్రైవర్, 2. అహ్మద్ ఖాన్ లపై కేసు నమోదు కాగా ప్రధాన నిందితుడైన మతిన్ ఖాన్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని, గౌరవ మేజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించారని, కరీంనగర్ జైలుకు తరలించామని కరీంనగర్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి తెలిపారు.

# నేత్రపర్వంగా పదునెట్టాంబడి దీపారాధన

## నేత్రపర్వంగా పదునెట్టాంబడి దీపారాధన



**గంగాధర, జనవరి 19(మనం న్యూస్):** గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో గల ఆనంద గిరి సుందరశాస్త్ర శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి దీపారాధన కన్నుల పండువగ నిర్వహించారు. ఉత్తర నక్షత్రం పురస్కరించుకొని అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మణికంఠ స్వామి 18 మెట్లపై ఆలయ అర్చకులు వివేక్ శుక్ల, తిరునహరి నరేంద్ర స్వామి, సహ అర్చకులు ఆర్యన్ ఆచార్య అయ్యప్ప నామస్మరణతో నయనానందకరంగా దీపారాధన చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి పదునెట్టాంబడి భక్తులకు దేదీప్యమానంగా వెలుగును ప్రకాశించి దర్శనమిచ్చాయి. అనంతరం అర్చకులు నరేంద్ర స్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి 18 మెట్లకు ప్రత్యేకమైన పేర్లు ఉన్నాయని అవి 1. అణిమ 2. లఘిమ 3. మహిమ 4. ఈశ్వత 5. వశ్యత 6. ప్రాకామ్య 7. బుద్ధి 8. ఇచ్ఛ 9. ప్రాప్తి 10. సర్వకామ 11. సర్వ సంపత్కర 12. సర్వ ప్రియకర 13. సర్వమంగళాకార 14.సర్వ దుఃఖ విమోచన 15.సర్వ మృత్యుప్రశమన 16. సర్వ విఘ్ననివారణ 17.సర్వాంగ సుందర 18.సర్వ సౌభాగ్యదాయక. అని పేర్లు ఉన్నాయని,అలాగే అయ్యప్ప స్వామి ఒక్కొక్క మెట్టుకు ఒక్క దేవత చొప్పున పదునెట్టాంబడిపై అష్టాదశ దేవతలు కొలువై ఉంటారని తెలిపారు. అవి 1.మహాంకాళి 2. కళింకాళి 3.భైరవ 4.సుబ్రహ్మణ్య 5.గంధర్వరాజ 6. కార్తవీర్య 7. కృష్ణ పింగళ 8. హిడింబ 9.బేతాళ 10. నాగరాజ 11. కర్ణ వైశాఖ 12. పుళిందిని 13. రేణుకా పరమేశ్వరి 14. స్వప్న వారాహి 15.ప్రత్యంగళి 16.నాగ యక్షిణి 17. మహిషాసుర మర్దని 18. అన్నపూర్ణేశ్వరి దేవతలు ఉంటారని పేర్కొన్నారు. ఈ యొక్క పదునెట్టాంబడిపై దీపారాధన చేస్తే అయ్యప్ప స్వామితో పాటు అష్టాదశ దేవతల అనుగ్రహం ప్రాప్తిస్తుందని పేర్కొన్నారు.

# ఉప్పరమల్యాలలో క్రికెట్ ప్రీమియర్ లీగ్

**గంగాధర, జనవరి 19(మనం న్యూస్):** గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామంలో మానాల వినోద్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. ప్రీమియర్ లీగ్ లో గ్రామంలోని ఐదు జట్లు పాల్గొని తలపడ్డాయి. 10 ఓవర్ల క్రికెట్ ప్రీమియర్ లీగ్ లో కేసిరెడ్డి గంగారెడ్డి జట్టు విన్నర్ కాగా, కె. మహేష్ జట్టు రన్నర్ గా నిలిచింది. ఈయొక్క క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలకు ముఖ్య అతిథిగా గంగాధర మండల ప్రజా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు కర్ర బాపురెడ్డి, ముద్దం నగేష్, మానాల వినోద్ బాబు విజేతలకు బహుమతి (కప్పు) ప్రధానం చేశారు. ఈ సందర్భంగా క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు నిర్వహించిన దూస వంశీ, బందరకంటి మధుకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ నాయకులు మోసపూరిత మాటలు మానుకోవాలి...!




- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్
- నారాయణపూర్ జలాశయానికి చుక్కారాని నీరు
- ఎండుతున్న వరి పొలాలు



**గంగాధర, జనవరి 19(మనం న్యూస్):** నారాయణపూర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, ఇకనైనా కాంగ్రెస్ మోసపూరిత మాటలు మానుకోవాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ పేర్కొన్నారు. ఆదివారం నారాయణపూర్ జలాశయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు రవిశంకర్‌తో వారి బాధను వెళ్ళ బుచ్చుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించుకొని కరువు తెచ్చుకొన్నామని, ఈ రోజు పొలాలకు నీరు అందక పంటలన్నీ ఎండిపోతున్నాయని, రైతులు వారి బాధను చెప్పుకొని అల్లాడిపోతున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు నారాయణపూర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారని మోసపూరిత మాటలు మానుకోని రైతులు పడుతున్న బాధను చూసైన సంబంధిత అధికారులతో మాట్లాడి నారాయణపూర్ జలాశయాన్ని నీటితో నింపి రైతులకు సాగునీరు అందించి వరి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేసే వరకు బిఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి వారి పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండల నాయకులు మేచినేని నవీన్ రావు, కంకణాల విజేందర్ రెడ్డి, ఎండీ నజీర్ హుస్సేన్, కనుకయ్య, వడ్లూరి ఆదిమల్లు, దూలం శంకర్ గౌడ్, దోమకొండ మల్లయ్య, గడ్డం స్వామి, పరుశురాం, పొన్నం రాములు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎం ఆర్.ఎఫ్ చెక్కులను పంపిణీ



- మంచిర్యాల ఎమ్మెల్యే

**మంచిర్యాల, 19 జనవరి (మనం న్యూస్):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని ఎమ్మెల్యే నివాసం వద్ద మంచిర్యాల నియోజకవర్గా నికి చెందిన ముఖ్యమంత్రి సహాయకనిధి కింద 106 మంది లబ్దిదారులకు 32 లక్షల 38 వేల 500ల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం బడుగు, బలహీన వర్గాలకు అందేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్ర మంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మంచి ర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, లక్షెటిపే ట్ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ యోగ్యం కాని భూములను క్షేత్ర స్థాయిలో గుర్తించి తొలగించాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**గంభీరావుపేట, జనవరి 19 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలు, రేషన్ కార్డుల జారీ కోసం గంభీరావుపేట మండలం నర్మాల, గోరంటాలలో సర్వే కొనసాగుతుండగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో సర్వే కొనసాగుతుండగా కలెక్టర్ రికార్డ్స్ పరిశీలించారు. రైతు భరోసా పథకం సాగు చేసే రైతులందరికీ అందుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యంకాని భూములను తొలగించాలని సూచించారు. రేషన్ కార్డుల కోసం పలువురు ప్రజలు కలెక్టర్‌ను కోరగా, త్వరలోనే ఇస్తామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయ ని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ లగిశెట్టి భూపతి, ఎంపీడీవో రాజేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి బీసీ ఉద్యోగులకు దామాషా పద్ధతిలో




- హక్కులు, సౌకర్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి
- సింగరేణి బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు ఏ నాగేశ్వరరావు
- శ్రీరాంపూర్ ఏరియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రథమ మహాసభ

**మంచిర్యాల, జనవరి 19(మనం న్యూస్):** సింగరేణిలో బీసీ ఉద్యోగులకు ప్రస్తుతము ఉన్న రోస్టర్ పద్ధతిలో రిజర్వేషన్ ఎస్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు యాక్టింగ్ బేస్డ్ ప్రమోషన్లు అమలు పరచాలని, అలాగే బీసీ ఉద్యోగులకు దామాషా పద్ధతిలో హక్కులు, సౌకర్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సంబంధిత చట్టసభలలో రిజర్వేషన్ బిల్లును వెంటనే పెట్టి పాలక రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు ఆమోదించాలని సింగరేణి బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు ఏ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం శ్రీరాంపూర్ ఏరియా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏరియా ప్రథమ మహాసభ సిసిసి ఎస్పిఓఏ క్లబ్ లో జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సింగరేణి బీసీ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షులు ఏ నాగేశ్వరరావు, బీసీ వెల్ఫేర్ చీఫ్ లైజనింగ్ అధికారి పి. హరి శంకర్ రావులు హాజరయ్యారు. సింగరేణి బిసి ఉద్యోగుల హక్కులు కాపాడుకోవడానికి గాను జరిగిన ఈ మహాసభకు నాయకులు ముస్కే సమ్మయ్య, పెట్టం లక్ష్మన్, పేరం రమేష్‌లు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ ఉద్యోగులుగా ప్రతి విషయాన్ని తెలుసుకోవాలని, ఎవరికీ భయపడనవసరం లేదని మన హక్కుల విషయంలో ఖచ్చితంగా ఉండాలని ప్రశ్నించాలన్నారు. మన హక్కుల పరిష్కారం కోసమే సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘమని, ఇక్కడ ప్రథమ మహాసభను జరుపుకోవడం, బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ అన్యాయం జరిగినా, సమస్యలు వచ్చినా కొత్తగూడెం కార్పొరేట్ స్థాయిలో అందరం మీకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సింగరేణిలోకి మహిళలు ఎక్కువగా ఉద్యోగులుగా వస్తున్నారని, మైనింగ్ అధికారులుగా, ఇతర దేసిగ్నేషన్‌లో పనులుచేయడానికి వచ్చే వీరికి 33 శాతం రిజర్వేషన్ లు అమలు చేసి న్యాయం చేయాలని అన్నారు. ప్రమోషన్ల విషయంలో బిసి అధికారులకు కూడా అన్యాయం జరుగుతున్నదని అన్నారు. ప్రతి ఏరియాలో జి.ఎం. కార్యాలయాల్లో జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని అయన కోరారు. బీసీ వెల్ఫేర్ చీఫ్ లైజనింగ్ అధికారి పి శంకర్ రావు మాట్లాడుతూ సింగరేణిలో ఉన్న సౌకర్యాలు హక్కులు బీసీలకు రావడం లేదని, వ్యవస్థ కూడా లేదని, బీసీలందరూ ఒక మాటగా, ఒక బాటగా ఐక్యంగా ముందుకు సాగాలని, ఇలాంటి పెద్ద పెద్ద సమావేశాలు జరగాలని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా జ్యోతిరావు పూలే సావిత్రి పూలే జన్మదినం వేడుకలను సింగరేణి యాజమాన్యం అధికారికంగా జరపడానికి కలిసికట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. బిసిలందరం ఒక తాటి మీదకు వచ్చి భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని, అన్ని కార్యక్రమాలకు తాను కూడా ముందుంటానని ఆయన హామీ ఇచ్చారు. శ్రీరాంపూర్ ఎస్.ఓ.జి.ఎం.పి సత్యనారాయణ మాట్లాడుతూ బీసీల్లో తారతమ్యాలు, వర్గాలుగా ఉండకూడదని కలిసికట్టుగా ముందుకు పోతూ అన్ని సాధించుకోవాలని, ఐక్య సాధనకు ఐక్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ టి ఎస్ సి రీజనింగ్ ఆఫీసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఎస్సీ ఎస్టీలే కాదు బీసీలు కూడా వెనుకబడి ఉన్నారని ప్రతి ఒక్కరు నాయకుల్లాగా ఎదగాలని శ్రీరాంపూర్ ఏరియా ప్రకాష్ స్టేడియంకు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టాలని జిఎం కార్యాలయాల్లో ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి చిలక శ్రీనివాస్ మాట్లాడుతూ 60 శాతంగా ఉన్న బీసీలకే 27 శాతం మాత్రమే ఎందుకు అమలు చేస్తున్నారని, బీసీలు రగిలిపోతున్నారని బీసీలలో చైతన్యం పెరిగిందని ఇక జెండాలు మోసే రోజులు పోయాయని తెలంగాణ నే ఎలా అయితే సాధించుకున్నామో అదేవిధంగా రాజ్యాధికారాన్ని సింగరేణిలో ఉన్న హక్కులను సాధించుకోవాలని అన్నారు. మనం ఎవరికి వ్యతిరేకం కాదని మిగతా అన్ని కులాలతో కలిసి ఉండాలని మనకు మన సమస్యలను మనమే పరిష్కరించుకోవాలని ప్రతి ఏరియాకు లై జనింగ్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేయాలని అన్నారు. జ్యోతిరావు పూలేకు భారతరత్నను ఇవ్వాలని కోరుతూ సింగరేణి వ్యాప్తంగా బీసీలందరూ పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టాలని అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ టీచర్, గ్రాడ్యుయేట్ ఎన్నికలలో మున్సిపల్, స్థానిక ఎన్నికల్లో మన బీసీ అభ్యర్థులకు సపోర్ట్ చేసి మన శక్తిని చూపించి గెలిపించుకోవాలని కుల మత యూనియన్లకు అతీతంగా ఐక్యతగా ముందుకు సాగాలన్నారు. బీసీ సంఘం నాయకుడు రంగ రంగ రాజేష్ మాట్లాడుతూ బీసీ బిడ్డగా సంఘం ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు అభినందనలు అని బీసీల పట్ల వివక్షతలు తొలగిపోవాలని ఏ ఉద్యమానికైనా పునాది అనేది ఉండాలని, ప్రతి బీసీ బిడ్డ జ్యోతిరావు పూలే అందించిన సూక్తులను అనుసరించాలని, మెజార్టీవర్గమైన బీసీలకు న్యాయం జరగలేదని సమ సమాజం సమన్యాయం జరగాలని కోరారు. ఏఐటియుసి, ఐఎన్టీయూసీ నాయకులు జే. శంకర్ రావు, భాజి సైదలు మాట్లాడుతూ ఎక్కువ శాతంగా ఉన్న బిసిలు వాటాను సింగరేణిలో సాధించుకోవాలని, ఏర్పాటు చేసుకున్న సంఘం విచ్ఛిన్నం కాకుండా కాపాడుకోవాలని, రాజకీయాలకు అతీతంగా నిస్వార్థంగా పనిచేసే ముందుకు తీసుకెళ్లాలని, సింగరేణిలోనే కాకుండా బయట ఉన్న బడుగు వర్గాల బీసీలను కూడా ఆదుకోవాలని సూచించారు. ముస్కే సమ్మయ్య మాట్లాడుతూ ఈ సభకు బీసీ మేధావులు, అధికారులు, ఉద్యోగులు వందలాదిగా కదలి వచ్చి బీసీ ఐక్యతను చాటినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకత్వం, కార్పొరేట్ కమిటీ నాయకులు నల్ల రమేష్, వి. వెంకటేశ్వరరావు, కే. శ్రీనివాస్, టి. నరేంద్రబాబులు శ్రీరాంపూర్ ఏరియా డిజిఎమ్ (పర్సనల్) అరవిందరావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ రాజేశ్వరరావు, రమేష్ రావు, డాక్టర్ మధు కుమార్, తిరుపతి, నూనె శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఏరియా నాయకులు భద్రి బుచ్చయ్య, సాంబయ్య, మహిళలు రాజేశ్వరి, రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సభకు శ్రీరాంపూర్ ఏరియా లోని అన్ని డిపార్ట్మెంట్ల సింగరేణి బీసీ ఉద్యోగులు, అలాగే రామగుండం ఇతర ఏరియాల నుంచి సింగరేణి అధికారులు ఉద్యోగులు, యువ మైనింగ్ అధికారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వివి క్రికెట్ టోర్నమెంట్ ను సందర్శించిన ఎమ్మెల్యే



**జైపూర్, జనవరి 19 (మనం న్యూస్):** ఇటీవల ప్రారంభించిన వివి క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదివారం సందర్శించారు. జైపూర్ మండల కేంద్రంలోని రహదారి పక్కన నిర్వహిస్తున్న వివి క్రికెట్ టోర్నమెంట్ ను చెన్నూరు పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే వివేక్ సందర్శించి క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి బహుమతులు అందజేస్తూ ఉత్సాహ పరిచారు. మండల కేంద్రంలో క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించడం సంతోషించదగ్గ విషయమని యువకులందరూ పాల్గొనాలని చెడు వ్యసనాలను వదిలిపెట్టి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో ముందు ఉండాలని భారతదేశంలో ఎక్కువగా క్రికెట్ యువకులు ఆడుతున్నారని వారు ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. తను హెచ్ సీ ఏ ప్రెసిడెంట్ గా ఉన్నపుడు గ్రామీణ ప్రాంత యువకులను ప్రోత్సహించడం జరిగిందని అన్నారు. ఆటల్లో ఓటమి గెలుపు అనేది సహజం కాబట్టి అందరూ కలిసికట్టుగా ఆడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఫయాజుద్దీన్, జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, కల్కి రమేష్, ఆగిడి శివ, మంతెన లక్ష్మణ్, సంపత్ రెడ్డి,క్రికెట్ ఆర్గనైజర్‌లు అనిల్ కుమార్, షారుక్, వెంకటేష్, అభిరామ్, రవి, మున్నా, మనోహర్, విజయ్ పాల్గొన్నారు.

# జనయేత్రీ ఫౌండేషన్ స్థాపించడంఅభినందనీయం

- జీవితంలో మంచి రిజల్ట్ సాధించాలి
- ఫౌండేషన్ కార్యక్రమాలకు పోలీసులు పూర్తి సహకారం
- డీఎస్పీ రాజశేఖర్ రాజు

**నల్లగొండ, జనవరి 19 (మనం ప్రతినిధి):** మంచి సమాజాన్ని తయారు చేద్దామని ఉద్దేశంతో జనయేత్రి ఫౌండేషన్ స్థాపించడం ఎంతో అభినందనీయమ ని మిర్యాలగూడ డి ఎస్ పి రాజశేఖర రాజు అన్నారు.మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్ర గూడెం ఎస్ వి ఫంక్షన్ హాల్ లో ఆదివారం జరిగిన జనయేత్రి ఫౌండేషన్ చతుర్థ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జీవితంలో జనయేత్రి ఫౌండేషన్ మంచి రిజల్ట్ సాధించాలని ఆకాంక్షించారు. ఫౌండేషన్ షీ టీం సహకారంతో సేవలందించడం చాలా సంతోషకరమని జనయేత్రీ ఫౌండేషన్ కు పోలీస్ సహకారం పూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు పోకుండా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగాల పేరిట మోసగాల చేతుల్లో యువకులు మోసపోవద్దని పేర్కొన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన సంపత్ కుమార్ మాట్లాడుతూ జనయేత్రి ఫౌండేషన్ విద్యా వైద్యం మరింత సేవలు అందించాలని అన్నారు. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ముందు ముందు బడుగు బడిగిన వర్గాలవర్గాల పిల్లలు చదివే పాఠశాలలను స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. నాలుగు సంవత్సరాల క్రితం విత్తనంగా ఉన్న జనయేత్రి ఫౌండేషన్ నేడు పెద్ద వృక్షంగా మారిందని తెలిపారు. హాస్య వినోద సినీ నటులు సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరో రోగులకు రక్తదానం చేసి జనయేత్రి సభ్యులు ప్రాణదాతలుగా నిలుస్తున్నారని అభినందించారు. అదే విధంగా, ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని కోరారు.సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జబర్దస్త్ సినీ ఆర్టిస్ట్ వాసు వన్స్ మోర్ మాట్లాడుతూ




రెండు రాష్ట్రాలలో నిరుపేద ప్రజలకు సేవలందిస్తున్న జనయేత్రీ ఫౌండేషన్ ముందు ముందు ఇంటర్నేషనల్ స్థాయిలో ఫౌండేషన్ కొనసాగాలని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ కుల,మత, వర్గ,వైషమ్యాలకు తావు లేకుండా, సహృదయంతో సేవానిరతిని పాటిస్తూ నిస్వార్థంగా పేదలకు, నిరుపేద విద్యార్థులకు, రోగులకు,ఆర్తితో తల్లడిల్లే అభాగ్యులకు సహాయ సహకారాలు ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నామని పేర్కొన్నారు. నిరుపేద కుటుంబాలకు ఉచిత విద్య,వైద్యం అందచేయాలనే సంకల్పంతో పాటు వివిధ రకాలుగా సేవలు చేస్తూ రక్త దాన శిబిరాలు, అత్యవసర పరిస్థితుల్లో రక్త దానం చేస్తూ,చేపిస్తూ ప్రాణాపాయం నుండి కాపాడుతున్నామని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ,అన్నదానం, దుప్పట్ల పంపిణీ, మజ్జిగ పంపిణీ, చలి వేంద్రాల ఏర్పాటు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో, నిరాశ్రయులకు పండ్లు, భోజనం ఏర్పాట్లు, విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ, ఆపదలో ఉన్నవారికి నిత్యావసర సరుకులు, నిస్సహాయులకు ఆర్థికంగా,హార్థికంగా సహాయ సహకారాలు, రక్త దానాలు, ఇంకా ఇలా ఎన్నో సేవలను అందించామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత తొలి మహిళా ఆడియో ఇంజనీర్ సాజిదా ఖాన్, కరాటే గ్రాండ్ మాస్టర్ గోల్ మెడల్ లిస్ట్ నర్ర లక్ష్మి సామ్రాజ్యం , మానవ హక్కుల ప్రజా పరిరక్షణ సమితి జాతీయ చైర్పర్సన్ చలమల హైమావతి, సోషల్ వర్కర్ కవి రచయిత తెలంగాణ రాష్ట్ర ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అజ్మత్ ఖాన్, సామాజికవేత్త, సీనియర్ లెక్చరర్ చిలివేలు శంకర్, హైకోర్టు న్యాయవాది హమీద్,ప్రముఖ వైద్యులు జాడి రాజు,బాలాజీ,తులసి రామ్,నాగుర్,అర్బాష్ ఖాన్,వికాష్,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకట్రామ్ నాయక్, మధీహా, ఏయస్ ఐ బిక్షం, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు కంచర కుంట్ల దయాకర్ రెడ్డి , జాజాల కృష్ణ, గాదె నరసింహ, కోట సైదులు, ఫౌండేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పల్లె కిషోర్ కుమార్, తాజ్ బాబా, సుశ్రిత గ్రామీణ వైద్యుల సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షులు ఎస్కే హుస్సేన్, డివిజన్ కార్యదర్శి ఉబ్బని రవి, ఫౌండేషన్ బోర్డు మెంబర్లు అహ్మద్, ఖా జా వరలక్ష్మి, వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

## రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

హైదరాబాద్, జనవరి 19(మనంన్యూస్): ఆదివారం అదనపు కలెక్టర్ నగేష్ కొడిపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతు భరోసా మరియు రేషన్ కార్డుల ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఫీల్ వెరిఫికేషన్ ప్రక్రియ పకడ్బందీగా మరియు పారదర్శకంగా జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులు మరియు పథకాల లబ్ధిదారులు ఈ ప్రక్రియ ద్వారా తమకు అందే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

- 21 నుంచి గ్రామసభలు ప్రారంభం
- గ్రామ సభకు విస్తృత ఏర్పాటు చేయాలి
- నిరంతర ప్రక్రియగా సంక్షేమ పథకాల అమలు
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**హైదరాబాద్, జనవరి 19(మనంన్యూస్):** ఆదివారం మెదక్ మండలం పాతూర్ గ్రామంలో న్యూ రేషన్ కార్డ్ వెరిఫికేషన్ క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు నూతన రేషన్ కార్డులు జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాలపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియని చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని తెలిపారు. ఇంతకుముందు జరిగిన సర్వేలలో ఎప్పుడు దరఖాస్తు ఇవ్వకపోయినా గ్రామ సభలో వాళ్ళ చేత కొత్త దరఖాస్తులు తీసుకోబడుతాయి. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యంగా వివరించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామసభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారిచేసినట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం రేషన్ కార్డ్ ల లబ్ధిదారుల జాబితా సామిజిక, ఆర్థిక, కుల, రాజకీయ సర్వే ఆదారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి 4 ప్రతిష్టాత్మక పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు స్వీకరించాలని ఆయన స్పష్టం చేశారు. గతంలో స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. ఈనెల 26 ప్రారంభించనున్న నాలుగు పథకాలపై 21వ తేదీ నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయలు, ఫీడ్ బ్యాక్ తీసుకోవడంతో పాటు గ్రామ సభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎంపిడిఓ కార్యాలయాల్లో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇంటి స్థలం ఉన్నవారు, ఇంటిస్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభలలో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని ఆయన సూచించారు. జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రేషన్ కార్డులు జారీకి అర్హుల నుండి దరఖాస్తులు స్వీకరించు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతు భరోసా అందించడం జరుగుతుందని అన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా పథకం కింద ప్రతి సీజన్కు 6000/- రూపాయలు చొప్పున సంవత్సరానికి 12,000/- రూపాయలు ప్రతి ఎకరానికి ఇవ్వబడుతుందని చెప్పారు. ప్రతి నిరుపేద భూమిలేని కుటుంబము 2023 - 24 సంవత్సరానికి 20 రోజుల ఉపాధి హామీ పని చేసి ఉంటే ఆ కుటుంబానికి ప్రతి సీజన్కు 6000/- రూపాయలు చొప్పున సంవత్సరానికి 12,000/- రూపాయలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద ఇవ్వబడుతుంది. గతంలో వివిధ ప్రాజెక్టులకు, రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూములు, రియల్ ఎస్టేట్ భూములు, తదితర వ్యవసాయానికి పనికిరాని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో విచారణ టీములు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసాకు అర్హులైన లబ్దిదారులను గుర్తించాలన్నారు. ఈ నెల 21 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు నిర్వహించనున్న గ్రామ సభలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.

## టిడిపి ప్రజల కోసం పోరాటం చేస్తుంది




- టీడీపీ నల్గొండ పార్లమెంటు కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి

**నల్లగొండ,జనవరి 19 (మనం ప్రతినిధి):** తెలుగుదేశ పార్టీ ప్రజల కోసం పోరాడుతుందని నల్లగొండ పార్లమెంటు పార్టీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రజల గుండెల్లో ఉన్నదని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని తెలి పారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు, ఏపీ ముఖ్యమంత్రి నారాచం ద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి కార్యచరణ రూపొందించారని, అందుకు అనుగుణంగా నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో టీడీపీని గ్రామీణ స్థాయి నుంచి బలోపేతం చేస్తామన్నారు.ఫిబ్రవరి మొదటి వారంలో గ్రామ, మండల, పట్టణ, జిల్లా కమిటీలన్నింటిని తమ రాష్ట్ర నాయకత్వం ప్రకటిస్తుందన్నారు.గత రెండున్నర నెలలుగా నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున చేపట్టడం జరిగింది.తమకు 50వేల సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యం విధించగా ఇప్పటికే 22వేల సభ్యత్వాలు పూర్తి అయ్యాయన్నారు.సభ్యత్వ నమోదులో కోదాడ నియోజకవర్గం ముందు వరుసలో ఉందని,నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మొదటి లేదా రెండవ స్థానంలో నిలపడానికి సభ్యత్వాలు పెద్ద ఎత్తున చేపడుతామన్నారు.గడపగడపకు తెలుగుదేశం పార్టీని తీసుకెళ్లుతామన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి సంవత్సరం పాటు గడువు ఇవ్వడం జరిగిందని ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు లేకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రైతుభరోసా, రైతుబీమాతో పాటు రైతుల సమస్యలన్నింటిని ప్రభుత్వం పరిష్కరించాలని, రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయాలని కోరారు. జిల్లాకు చెందిన మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు కెటాయిస్తున్నారని పేర్కొంటూ పెండింగ్ ప్రాజెక లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు ప్రతి నిరుపేదకు కెటాయించాలని కోరారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం నాయకులు, కార్యకర్తలతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో ఆ పార్టీ నాయకులు గుండు వెంకటేశ్వర్లు, కూరెళ్ల విజయ్ కుమార్, తేలు రవి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి పథకాలు కాంగ్రెస్ ప్రచారాలు

**బిజెపి ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్దిరాములు**

**టేక్మాల్, జనవరి 19 (మనం న్యూస్):** టేక్మల్ మండలంలోని భారతీయ జనతా పార్టీ ప్రవేశపెడుతున్న పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచారాలు చేసుకుంటూ పబ్బం గడుతుందని మండల బిజెపి ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్దిరాములు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటువంటి పీఎం ఆవాస్ యోజన గృహాలను ఇందిరమ్మ ఇండ్లుగా ప్రచారం చేస్తూ అలాగే వివిధ రకాల కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అట్టి పథకాలను ప్రచారం చేస్తుందని ఎద్దేవా చేశారు.



# సర్వేల పేరుతో సంక్షేమ పథకాల అమలుకు కాల యాపన చేస్తున్నకాంగ్రెస్ ప్రభుత్వం

- గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదు.
- పేదలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు
- సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

**హుజూర్ నగర్,జనవరి 19(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేల పేరుతో సంక్షేమ పథకాలు అమలు జరపకుండా కాలయాపన చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ పట్టణంలోని అమరవీరుల స్మారక భవన్ లో జరిగిన సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీ లో భాగంగా అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు,భూమిలేని వ్యవసాయ కార్మికులకు 12000, రైతు భరోసా అమలు కోసం గతంలో ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారని,వాటిని అమలు చేయ కుండా సర్వేల పేరుతో కాలయాపన చేయడం మూలం గా అర్హులైన పేదలు సంక్షేమ పథకాలకు నోచుకోవటం




లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 26 వ తేదీన రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించి, గ్రామాలలో, పట్టణాలలో అధికారులు సర్వేలు నిర్వహించడం జరుగుతుందని,ఈ సర్వేలలో గ్రామపంచాయతీ మున్సిపల్ అధికారులకు వచ్చినటువంటి రేషన్ కార్డు లిస్టు ఏ ప్రాతిపాదికన వచ్చిందో ప్రజలకు తెలియ జేయాలని అధికారులను ప్రశ్నించారు.చాలా గ్రామాల లో ప్రభుత్వమే రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు, భూమిలేని వ్యవసాయ కార్మికుల పేర్లను గుర్తించి గ్రామాలలో సర్వే చేస్తున్నారని దానితో పేర్లు లేని లబ్ధిదారులు తీవ్ర ఆందోళన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని అన్నారు.ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని కోరారు. వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు, చేతి వృత్తిదారులకు పెంచుతామని చెప్పిన పింఛన్ ను వెంటనే పెంచాలన్నారు. పేదల చేతుల్లో ఉన్న అసైన్మెంట్ భూములకు వెంటనే పట్టా హక్కులు కల్పించాలని కోరారు. ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి స్థలం కొనుగోలు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సిపిఎం పార్టీ నాలుగవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.అనంతరం జనవరి 25న జరిగే భారీ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, బివి రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవు తున్నారని అన్నారు.ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కో లిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి,సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ మండల పట్టణ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐహెచ్ఆర్ఓ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లగొండ వాసి ఎండి అఫ్జల్

**నల్లగొండ,జనవరి 19 (మనం న్యూస్ ):** ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నల్లగొండ కు చెందిన మహమ్మద్ అఫ్జల్ ను (ఐ హెచ్ ఆర్ ఓ) వరల్ ఛైర్మెన్ డాక్టర్ నేమ్ సింగ్ ప్రేమి తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ఐ హెచ్ ఆర్ ఓ సౌత్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో 45 మంది సభ్యుల రాష్ట్ర ప్యానల్ ను ఏర్పాటు చేశారు. ఐ హెచ్ ఆర్ ఓ వరల్ చైర్మన్ నేమ్ సింగ్ ప్రేమి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ అవగాహన పెంపొందించడం శాసనసభ న్యాయ వ్యవస్థ రంగాలలో హక్కుల కోసం వాదించడం కోసం కృషి చేయాలని అన్నారు.ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నల్గొండ కు చెందిన మొహమ్మద్ అఫ్జల్ ఎంపిక అయ్యారని అన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ అఫ్జల్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఇంతటి పెద్ద బాధ్యత ఇచ్చినందుకు నీతి నిజాయితీతో బాధ్యతతో తన కర్తవ్యాన్ని ప్రశ్నించే తత్వాన్ని ప్రజల్లో ఎవేర్నెస్ చేస్తానని ఇంతటి పదవి బాధ్యతలు అప్పగించిన ఐ హెచ్ ఆర్ ఓ కు ధన్యవాదాలు తెలియజేశారు.



పలువురు నలగొండ పుర ప్రముఖులు మొహమ్మద్ అఫ్జల్ ను అభినందించారు..ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఎస్ హెచ్ ఆర్ సి చైర్మన్ డాక్టర్ చంద్రయ్య,సౌత్ ఛైర్మన్ సయ్యద్ కాజిమ్ అలీ హష్మీ, నలగొండ అధ్యక్షులు సయ్యద్ సల్మాన్ ఖాద్రి తదితరులు ఐ హెచ్ ఆర్ ఓ మెంబర్స్ పాల్గొన్నారు.

# అసమర్ధ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- అసమర్ధ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- గులాబీ జెండా కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష
- తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకే భవిష్యతు
- కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**కోదాడ, జనవరి 19(మనం న్యూస్):** మాయ మాటలతో ప్రజలను మోసం చేసి అమలకు నోచుకోని హామీలను ఇచ్చిన అసమర్ధ చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఎప్పటికప్పుడు ఎండగట్టాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం దుర్గాపురం లోని వారి నివాసంలో కోదాడ బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ నయీమ్ అధ్యక్షతన జరిగిన పట్టణ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.గులాబీ జెండా కెసిఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని రాష్ట్రంలో భవిష్యత్తు ఉన్న పార్టీ తమదేనని మరల అధికారంలోకి రావడం ఖాయమన్నారు.ప్రతి గడప,గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ప్రజల కోసం నిరంతరం పనిచేశామని ఏడాది కాంగ్రెస్ పాలనలో ఏం కోల్పోయమో ప్రజలందరికీ తెలిసి వచ్చిందన్నారు.పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధి సంక్షేమ పథకాలు కెసిఆర్ చేసి చూపించారని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో గులాబీ జెండా ఎగరవేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు మరల తాము అధికారంలోకి రాలేమని పై నుంచి కింది స్థాయి వరకు ఎవరికి తోచినంత వారు దోచుకుంటున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తమ పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి సాగిస్తున్న పాలనను గడపగడపకు తీసుకువెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు.పోరాటాలు బిఆర్ఎస్ కు కొత్తేమీ కాదని పోలీస్ కేసులకు భయపడేది లేదన్నారు.మరలా పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షుడు షేక్ నయీమ్, ప్రధాన కార్యదర్శి గట్ల కోటేశ్వరరావు, కౌన్సిలర్లు కందుల చంద్రశేఖర్,మేదర లలిత,మామిడి రామారావు,కోఆప్షన్ సభ్యులు సాధిక్, చింతల నాగేశ్వరరావు,లింగయ్య,సంపేట ఉపేందర్,కర్ల సుందర్ బాబు,కాసాని మల్లయ్య,ఇమ్రాన్ ఖాన్,బత్తుల ఉపేందర్,చీమ శ్రీను,అబ్దుల్ రహీం,అబ్బు,ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



# 26 నుండి 4 సంక్షేమ పథకాలు అమలు

- ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా వ్యవసాయ కూలీలకు 12 వేలు
- నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక
- జమలాపురం ఆలయ సమీపంలో అర్బన్ పార్క్ డెవలప్మెంట్
- ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు





**ఎర్రుపాలెం, జనవరి 19(మనం న్యూస్):** ఈ నెల 26 నుండి నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేయనున్నామని రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ మొదలవుతుందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి 12 వేల రూపాయలు ఇవ్వబోతున్నామన్నారు. రాష్ట్రంలోని భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి 12 వేలు ఇస్తామన్నారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డు ఇస్తుందన్నారు. ఈ నెల 26 నుంచి మొదలుకానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గ్రామసభల్లో నిష్పక్షపాతంగా పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. లబ్ధిదారుల జాబితా ఎక్కడో తయారు కాదని, ఇందులో అపోహలు, అనుమానాలు పెట్టుకోవద్దని, గ్రామ సభలోనే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజా పాలనలో ప్రజలందరి సమక్షంలోనే నిర్ణయాలు తీసుకుంటామన్నారు. గ్రామ సభలు నిర్వహించి సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితాను తయారు చేస్తారన్నారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్నారు. ఎర్రుపాలెం మండలంలో ఉన్న చెరువులు, అడవులను రక్షించుకుంటూ ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎర్రుపాలెం మండలంలో టూరిజం అభివృద్ధితో స్థానిక ప్రజల ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు పెంచడానికి ప్రజా ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ముందుకు పోతుందన్నారు. ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా జమలాపురం వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలో అర్బన్ పార్క్ డెవలప్మెంట్ కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి పనులు మొదలుపెట్టామన్నారు. త్వరలోనే ఇనీధ్రం, పేట చెరువులను ఆహ్లాదకరమైన పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రాంతాల విశిష్టతను అంతర్జాలంలో పొందుపరిచి వీకెండ్ లో అత్యధిక సంఖ్యలో పర్యాటకులు ఇక్కడికి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామాన్ని సెంటర్ పాయింట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను పునర్నిర్మాణం చేసి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. మాజీ మంత్రివర్యులు శీలం సిద్ధారెడ్డి బనిగండ్లపాడుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జూనియర్ కాలేజీ తీసుకువచ్చి ఇక్కడి పేరు ప్రఖ్యాతలు తెచ్చారన్నారు. కట్టలేరు పై బ్రిడ్జి నిర్మాణం, మధిర రోడ్డు లింకు ఎర్రుపాలెం నుంచి రోడ్డు విస్తరణ చేసి బనిగండ్లపాడును సెంటర్ పాయింట్‌గా మండలంలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను తయారుచేసుకొని ముందుకు పోతున్నామన్నారు. బనిగండ్లపాడు లో నూతనంగా ప్రారంభించుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎర్రుపాలెం మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న 50 పడకల ఆసుపత్రితో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు.

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఘన స్వాగతం**

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం సందర్భంగా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు గ్రామానికి చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు గ్రామ ప్రజలు, అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బనిగండ్లపాడులో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బనిగండ్లపాడు లో రూ. 1.56 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పూలు చల్లుతూ ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది స్వాగతం పలికారు.

అనంతరం బనిగండ్లపాడు గ్రామంలో అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన గోడౌన్లను ప్రారంభించారు.

## శ్రీ కరుణ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్



- సీజనల్ వ్యాధులపై అవేర్నెస్ ప్రోగ్రాం
- మెగా హెల్త్ క్యాంపుకు గ్రామాల ప్రజల సహకరించాలి
- డాక్టర్ నవీన్ కుమార్

**కురవి, డిసెంబర్ 19(మనం న్యూస్):** గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యమే శ్రీ కరుణ హాస్పిటల్ ధ్యేయమని డాక్టర్ నవీన్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రపు తండాలో ఎస్.కె బషీర్ నేతృత్వంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. 200 మంది పేషెంట్లకు పరీక్షలు చేసి మందులు ఇచ్చినట్లు డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. అవసరం ఉన్నవారికి ఈసీజీలు షుగర్ టెస్టులు చేసి వారికి మెడిసిన్ ఇచ్చామని డాక్టర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు హెల్త్ మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవేర్నెస్ ప్రోగ్రాం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు వైద్యం అందించడంలో కరుణ హాస్పిటల్ యజమాన్యం ముందుంటుందని తెలిపారు. మహబూబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ సెంటర్లో శ్రీ కరుణ హాస్పిటల్ ప్రజలకు చేరువులో ఉంటుంద ని అన్నారు. తమ హాస్పిటల్ లో అన్ని రకాల కేసు లకు ట్రీట్మెంట్ చేయబడును తెలిపారు. శ్రీ కరుణ హాస్పిటల్ లో 24 గంటలు వైద్య సేవలు అందించబడును అని పేర్కొన్నారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో ఉమేష్, ప్రశాంత్, రాకేష్, వెంక టేష్, పాషా (చోటు) విజయ్. నీలిమ. అశ్విని. భరత్. వరుణ్, బాలాజీ తదితరులు ఉన్నారు.

# మహిళ ఎదుగుదల ఓర్వలేవా

- తాత మధు పై మండిపడిన
- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య



**ఖమ్మం, జనవరి 19(మనం న్యూస్):** మహిళల ఎదుగుదలను ఎంఎల్‌సి తాతా మధుసూదన్ ఓర్చుకోలేకపోతున్నారని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య విమర్శించారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మల్లు నందిని విక్రమార్క పై తాత మధుసూదన్ విమర్శలు చేయడం పట్ల మహిళల ఎదుగుదల పట్ల ఆయనకున్న వక్రబుద్ధి బయటపడిందని స్పష్టం చేశారు. అమ్మ ఫౌండేషన్ ద్వారా నిత్యం ప్రజల్లో ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, అలాంటి ఆమెపై విమర్శలు చేయడం సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. కళ్యాణ లక్ష్మి చెక్కులు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు సామాన్య కార్యకర్తలకు కూడా పంచుతున్నారని మల్లు నందిని విక్రమార్క పంపిణీ చేయడంలో తప్పేముందని ప్రశ్నించారు.ప్రజా సమస్యలపై నోరు విప్పని తాతా మధు మహిళను నిందించడానికి నోరు విప్పడం సిగ్గు చేటన్నారు. డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖ్యాతిని దెబ్బ తీయాలనే దురుద్దేశంతో బిఆర్ఏస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీ ప్రభుత్వ హయాంలో కేటీఆర్ కుమారుడు హిమాన్షుకి ఏసిపి ర్యాంక్ స్థాయి అధికారిని నియమించి భద్రత కల్పించిందని, అప్పుడు మీకు కళ్ళు కనపడలేదా ఘాటుగా విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి రాష్ట్ర అభివృద్ధిని కుంటు పడేశారని, నేడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులుపెడుతుంటే చూసి ఓర్వలేక లేని పోని ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకొని విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు. భట్టి విక్రమార్క నాలుగు సార్లు ఏకధాటిగా ఎమ్మెల్యేగా గెలుపొందారని, స్థానిక ప్రజలకు భట్టి విక్రమార్క అంటే ఏంటో, అక్కడ ఉన్న స్థానిక బి ఆర్ ఎస్ నేతలు అంటే ఏంటో తెలుసని, తాత మధు పనిగట్టుకొని వెళ్లి చెప్పాల్సిన పని లేదని హితవు పలికారు. ప్రజలు మీ పై విరక్తి చెందే ఇంట్లో కూర్చోబెట్టారని ఇకనైనా మాట్లాడే ముందు మనం ఎక్కడ ఉన్నామని ఆత్మ పరిశీలన చేసుకొని మాట్లాడాలని హితవు పలికారు. నందిని విక్రమార్క ఏ కార్యక్రమం చేసినా తన స్వచ్ఛంధ సేవ సంస్థ ద్వారా మాత్రమే చేస్తారనేది గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా మహిళా సెక్రటరీ ఏలూరి రజిని, బలుసు లక్ష్మి ,బిక్కిసాని స్వరూప, గుంటి భవానీ, చంద్రకళ, గొడుగు రమాదేవి, భార్గవి అనూష, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ చేసి తీరాల్సిందే...

- ఇది మాల, మాదిగల సమస్య కాదు
- ఎస్‌సి వర్గీకరణకు మేధావుల సంఘీభావ సదస్సులో వక్తల ఉద్ఘాటన
- పలు ప్రజా సంఘాల, బిసి సంఘాల, రాజకీయ పార్టీల సంఘీభావం



**ఖమ్మం, జనవరి 19(మనం న్యూస్):** ఎస్‌సి వర్గీకరణ వెంటనే చేసి తీరాల్సిందేనని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. ఇది మాల, మాదిగల మధ్య గొడవ కాదని, రెండు కులాల సమస్యగా చూడొద్దని హితవు పలికారు. జాషువా సాహిత్య వేదిక, స్పర్శ సామాజిక అధ్యయన వేదిక, బిసి సంఘాల జెఏసి, తెలంగాణ పీపుల్స్ జెఏసి ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ-మేధావుల సంఘీభావ సదస్సు ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో ఆదివారం జరిగింది. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలు, కుల, ప్రజాసంఘాల, రాజకీయ పార్టీల నాయకులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు పాల్గొని ప్రసంగించి సంఘీభావం తెలిపారు. ప్రముఖ రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులు ఐవి రమణారావు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ మాల, మాదిగల పంచాయతీ కాదన్నారు. కొంతమంది అలా వ్యవహరిస్తూ చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అట్టడగు వర్గాలకు రాజ్యాంగ ఫలాలు దక్కాలనేది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారన్నారు. అందుకే సమాజంలో అట్టడుగున ఉన్న మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు దక్కేందుకు అందరూ సమైక్యంగా ఉండాలన్నారు. అదే సందర్భంలో మాల, మాదిగలు రెండూ అణగారిన వర్గాలనేది గమనించాలన్నారు. సదస్సులు, సమావేశాలకు పరిమితం కాకుండా ఒక కార్యాచరణ ప్రకటించాల్సిన అవసరం ఉందన్నారు. 40 ఏళ్లుగా వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ చేస్తున్న పోరాటం అభినందనీయమని, అందరూ అండగా ఉండాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సమగ్ర సర్వేద్వారా 91 శాతంగా బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలు, మైనార్టీలు ఉన్నట్లు తెలుస్తోందని, వీరంతా ఐక్యంగా రాజ్యాధికారం కోసం పోరాడాలని సూచించారు. ఈ మేరకు ఎస్‌సి వర్గీకరణ పోరాటానికి సంఘీభావం తెలిపారు. సదస్సులో కాంగ్రెస్ నుండి నల్లమల వెంకటేశ్వరరావు, చోటే బాబా, కోట రాంబాబు, బిఆర్ఎస్ నుండి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధు, టిడిపి నుండి కూరపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ నుండి శింగు నర్సింహారావు, సిపిఎం నుండి ఎం.సుబ్బారావు, మాస్‌లైన్ నుండి ఆవుల అశోక్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నుండి అవునూరి మధు, ఆప్ నుండి ఎన్.తిర్మల్, పిఆర్‌టియు నుండి మనోహర్‌రాజు, యుటిఎఫ్ నుండి జివి నాగమల్లేశ్వరరావు, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నుండి గురుమూర్తి, జూనియర్ లెక్చరర్స్ నుండి నయిం పాషా, బార్ అసోసియేషన్ నుండి శ్రీనివాసరావు, ప్రముఖ సిఏ మందా కృష్ణ తదితరులు ప్రసంగించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జాషువా సాహిత్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ప్రముఖ లాయర్ మేకల సుగుణారావు, దేవిరెడ్డి విజయ్, జాషువా సాహిత్య వేదిక సభ్యులు కోండ్రు బ్రహ్మం, నామా పురుషోత్తం, కన్నెగంటి వెంకటయ్య, ఐనాల సైదులు, గద్దపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



**మంచిర్యాల, 19 జనవరి (మనం న్యూస్):** మంచిర్యాల మున్సిపాలిటీని రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేషన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసిన సందర్భంగా ఆదివారం మంచిర్యాల ఎమ్మె ల్యే నివాసం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్ర పటానికి మంచిర్యా ల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మం చిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పల య్య, వైస్ చైర్మన్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, మంచిర్యాల మార్కెట్ కమి టీ చైర్మన్, లక్షెటీపేట్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మిద్దె తోటల సాగు తో క్యాన్సర్ నివారణ

- జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న




**మహబూబాబాద్, జనవరి 19(మనం న్యూస్):** ప్రతి రోజు తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, మొదలైన వాటి పాటు ఔషద మొక్కలు, పూలు తదితర వాటిని ప్రతి ఇంటిలో పెరటి ఆవరణ లో, మిద్దెల మీద సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పలు రకాల వైరస్ లు,బ్యాక్టీరియా, తదితర సూక్ష్మజీవులు వలన పలు వ్యాధులు కలుగుతాన్నాయని, వీటి బారి నుండి రక్షణ కోసం పలు రకాల పోషకాలు అయిన విటమిన్స్, ఖనిజ లవణాలు, పీచు పదార్థాలు, మొదలైనవి అవసరమని, పట్టణాలు, గ్రామాలు పలు ప్రాంతాలు కాంక్రీట్ జంగిల్ గా మారుతున్నాయని, ఇంటి ఆవరణలో, మిద్దె మీద కూరగాయలు, ఆకు కూరలు, మునగ, కరివేపాకు, పండ్లు, పూలు, ఔషద మొక్కలు, తదితర వాటిని పెంచుకోవాలని సూచించారు. మహబూబాబాద్ పట్టణంలో ఇంటి యజమానుల మిద్దె తోటల పెంపకాన్ని పరిశీలించారు. మహబూబాబాద్ తో పాటు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, తదితర మండల ప్రధాన కేంద్రాలలో ఇంటి ఆవరణలో, మిద్దెల మీద అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, మునగ, కరివేపాకు, పండ్లు,పూలు, ఔషద మొక్కలు సాగు చేస్తున్నారన్నారని అన్నారు. ఈ మిద్దె తోటల సాగు ను ఎలాంటి రసాయన ఎరువులు, పురుగు మందులు లేకుండా కేవలం సేంద్రియ ఎరువులు అయిన పశువుల ఎరువు, వర్మికంపోస్ట్, వేప పిండి, వేపనూనె, కానుగ పిండి తదితర ఆర్గానిక్ ఉత్పత్తులు వాడి, పలు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ మిద్దె తోటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ ద్వారా మిద్దె తోటలు పెంచుటకు అన్ని రకాలుగా సాంకేతిక సూచనలు తెలియజేస్తున్నామని తెలిపారు. మహబూబాబాద్ పట్టణంలో పండ్లు అయిన జామ, వాటర్ ఆపిల్, అవకాడో, స్టార్ ఫ్రూట్, స్వీట్ చింత, బార్బొడాస్ చెర్రీస్, మల్బరీ, మామిడి, స్వీట్ లైమ్, దానిమ్మ,టేబుల్ నిమ్మ , బత్తాయి, మియాజకి మామిడి, పునాస మామిడి, అరటి, ఫైన్ ఆపిల్ ( అనాస) మొదలగు కూరగాయలు అయిన బెండ, బీర, సొర, కాకర, దొండ, బోడ కాకర, టమాటా, పచ్చి మిర్చి, చిక్కుడు, దోస, పలు రకాల ఆకు కూరలు, సుగంధ ద్రవ్యాలు అయిన పసుపు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, ఔషద మొక్కలు అయిన అలోవెరా, వాము ఆకు,యాలకు,తులసి, ఆల్ స్పైస్,నిమ్మగడ్డి, పుదీనా, పూలు అయిన బంతి, చామంతి, మల్లె, కనకాంబరం, లిల్లీలు, ఇలా తీరు తీరు మొక్కలు అన్ని రకాల ఇంటి అవసరాల కు సాగు చేస్తున్నారు బానోత్ రామచంద్ర సునీత, కృష్ణ కాలనీ, కంకరబోడు, మహబూబాబాద్ పట్టణం వారు మిద్దె తోటలు సాగు చేస్తూ ఆదర్శం గా నిలుస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తి తో అందరూ ఇంటి ఆవరణ లో, మిద్దె తోటలు మీ మీ కుటుంబ అవసరాల కు సాగు చేసుకొని మంచి ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి కొరకు క్యాన్సర్ రహిత సమాజం కోసం మిద్దె తోటలు సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## పదవికాలం అయిపోయిందని ప్రజలకు దూరంగా ఉండకుండా సేవలు చేయాలి

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు
- పదవికాలం అయిపోతున్న ప్రజాప్రతి నిధులకు సన్మానాలు

**మంచిర్యాల, జనవరి 19 (మనం న్యూస్):** పదవికాలం అయిపోయిందని ప్రజలకు దూరంగా ఉండకుండా రానున్న రోజుల్లో కూడా నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ, కార్పొరేషన్‌లో కూడా కార్పొరేటర్లుగా ఎదగాలని తానూ కోరుకుంటున్నానని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే నివాసంలో మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టీపేట్ చైర్మన్ల, వైస్ చైర్మన్ల, కౌన్సిలర్ల, కో ఆప్షన్ మెంబెర్స్, పదవికాలం అయిపోతున్న సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలు వారందరినీ శాలువాలతో సన్మానించి, చిరు కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్ల, జనవరి 19 (మనం న్యూస్):** సిరిసిల్ల పట్టణంలో ఆదివారం ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం కొత్త బస్టాండ్ నుంచి బతుకమ్మ తెప్ప వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన స్వీయ రక్షణతో పాటు తన కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్-రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. సిరిసిల్ల ప్రధాన రహదారి కొత్తబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా, నేతన్న చౌరస్తా, కొత్త చేరువు, చంద్రంపేట, అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌరస్తా మీదుగా బతుకమ్మ ఘాట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, బెటాలియన్ సిబ్బంది, పట్టణ ప్రజలు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పిదాల కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి ప్రమాదాల కారణంగా వాహనదారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని అన్నారు ముఖ్యంగా ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తనవంతు బాధ్యత గ గుర్తించాల్సిన అవసరం వుందని. ట్రాఫిక్ నియమాలను అతిక్రమించి వాహనాలను నడపడం ఒక హీరోయిజంగా భవించవద్దని, అలసత్వం వలన జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా కుటుంబాలు వీధిన పడుతున్నాయని, వాహనదారుడు క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చని, ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడపాలని తెలిపారు. వాహనదారులు జరిమానాలు పడ్డాయని అనుకోకుండా వుండాలంటే ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అలాగే రోడ్డు ప్రమాదాల్లో అధికంగా తలకు గాయం కావడం వలన ద్వీచక్రవాహనదారులు మరణించడం జరుగుతోంది. కావున, ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించి వాహనం నడపాలని అన్నారు. జాతీయ రోడ్ భద్రతా పురస్కరించుకొని జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలపై వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు కృష్ణ, వీరప్రసాద్, ఆర్.ఐ రమేష్, ఎస్.ఐలు పోలీస్ సిబ్బంది, బెటాలియన్ సిబ్బంది, పట్టణ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

- గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరణ
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి




**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 19 (మనం న్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని అన్నారు.ఇందులో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డ్ ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామాజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు కూడా స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుజాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని ఆమె తెలిపారు. ఈనెల 26 ప్రారంభించే నాలుగు పథకాలపై 21వ తేదీ నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయలు/ ఫీడ్ బ్యాక్ లను తీసుకోవడంతో పాటు ఈ గ్రామ సభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎండో కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతిలో పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అర్హులైన తుది జాబితాలను ప్రకటించడానికి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీచేయడం జరుగుతుందని తెలియ చేశారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల మంజూరికి గాను దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొన సాగుతుందని ఆమె స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. . ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు కాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్నిబదిలీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల మున్సిపాలిటీలలో కలిసిన గ్రామాల్లో 2023 -24 లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలో తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు.

### గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు

ఈనెల 21 వ తేదీ నుండి 24 వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు . గతం లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల మాదిరిగానే 21 నుండి జరిగే గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తాం

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, జనవరి 19(మనం న్యూస్):** అర్హులందరికీ తప్పనిసరిగా రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మనం న్యూస్ తో మాట్లాడారు. గ్రామ సభల్లో మళ్లీ రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు పంచాయతీలకు పంపింది తుది జాబితా కాదు. పేర్లు రానివారు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ఆయన చెప్పారు. రేషన్ కార్డుల జారీపై కీలక ప్రకటనచేశారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం,రేషన్ కార్డుల జారీ ఒక నిరంతర ప్రక్రియ అని ఆయన స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు. నియోజకవర్గంలోని అర్హులందరికీ కార్డులు ఇచ్చే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. ప్రస్తుత జాబితాలో అర్హులైనవారికి రేషన్ కార్డులు రాకపోతే, వారు ఈనెల 21 నుండి 24 తారీకు వరకు జరిగే గ్రామ సభల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ నిరభ్యంతరంగా రేషన్ కార్డులు అందజేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి



**దేవరకద్ర, జనవరి 19 మనం న్యూస్:** త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో కౌకుంట్ల మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో ఆదివారం బిఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగామాట్లాతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం 6 గ్యారంటీలు 420 హామీలు అమలు చేయాలని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను మరో సారి మోసం చెయ్యడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేసేందుకు డిసెంబర్ 9న సంతకం పెడుతా అన్నారు.ఇప్పటి వరకు దేవరకద్ర నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామంలో పూర్తిగా రుణమాఫీ జరుగలేదు. కేవలం 48 % మందికి రుణమాఫీ చేసి రుణమాఫీ పూర్తి అయిందని కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేస్తుంది అని ఆయన చెప్పారు.అప్పుల భారంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన అన్నారు.కానీ ఇవాళ డిల్లీకి పోయి రుణమాఫీ చేసినం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడుతుండే.. ఇప్పుడు ఓట్లప్పుడు పడుతున్నాయి. కేసీఆర్ జమ చేసిన రూ. 7600 కోట్లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లప్పుడు వేసినారు. వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వలేదు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 15 వేలు రైతుభరోసా ఇవ్వాలి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి వానాకాలం రైతుబంధును ఎగ్గొట్టింది కాంగ్రెస్ పార్టీ..కాంగ్రెస్ పార్టీ కి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ది చెప్పడానికి సిద్ధంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బాలచంద్ర గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలేజ్ హాస్టల్ స్థలాలు మార్చొద్దు

- దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్



**మహబూబ్ నగర్ బ్యూరో, జనవరి 19(మనం న్యూస్):** మహబూబ్నగర్ నడిబొడ్డులో ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పక్కల ఉన్న ఎస్సీ కాలేజీ హాస్టల్ భవనాలు స్థలాన్ని, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్స్కు,( స్టేడియం కు ) ఇవ్వరాదని దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. డిసెంబర్ దళిత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో, ఎస్సీ కాలేజ్ హాస్టల్, బిల్డింగు, స్థలాన్ని కాపాడుకుందాం అని, రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న ఎస్సీ కమిటీ హాల్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ వాళ్లు ఆ స్థలం కావాలని అడిగా రంటే మహిళ లను,చదువుకు దూరం చేయాలని , దళిత మహిళల విజ్ఞానాన్ని ఆదిలోనే అణచివేయాలని కుట్రతో చేశారని వారు ఆరోపించారు. 1972 లో ఆ స్థలంలో ఎస్సీ హాస్టల్ ఉన్నది. ఆ తర్వాత మహేంద్ర నాథ్ మంత్రిగా ఉన్నప్పుడు, మొదటి ఎస్సీ మహిళ గురుకులం జిల్లాలో ప్రారంభించారు. 2012లో ధర్మాపూర్ దగ్గర , ఎస్సీ మహిళా గురుకులం ఏర్పాటు అయిన తర్వాత, ఇక్కడ ఎస్సీ కాలేజ్ హాస్టల్ కొనసాగింది. ఈ హాస్టల్లో 600 మంది విద్యార్థులు చదువుకునేవాళ్ళు, ఎక్కువమంది విద్యార్థులు చదువు కోవడానికి కారణం, బస్టాండు, రైల్వే స్టేషన్, కాలేజీలు, స్కూల్స్, దగ్గరగా ఉండడం, ప్రత్యేకంగా మహిళలకు రక్షణగా ఉండడం, హాస్టల్లో చిన్న చిన్న సమస్యలు, సాకు చూపి డ్రైనేజీ, బాతు రూమ్ లు,మైనర్ రిపైర్స్, చేస్తామని, విద్యార్థులు మోసం చేసి, టిఆర్ఎస్ ప్రభుత్వం, 10 గుంటల భూమి అప్పుడున్న మంత్రి అండతో, లాగేసుకుని స్పోరట్స్ వాళ్లకు అప్పగించారు, ఆ తర్వాత హాస్టల్ ను షా షాప్ గుట్టకు మార్చారు. 350 మంది చదువుకు దూరమైనారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని, సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఎస్సీ కాలేజ్ మహిళా హాస్టల్, డిస్మెంటల్ చేసి, కొత్తగా ఐదు ఫ్లోర్లతో నూతన భవనం నిర్మించాలని 2022 జూలైలో రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ కమిషనర్ కు ప్రతిపాదన పంపడం జరిగింది. ఆ ప్రతిపాదన బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయకుండా, అణచివేసింది 2022 ప్రతిపాదనల ప్రకారం, అదే స్థలములో, ప్రజా ప్రభుత్వం ఎస్సీ మహిళా కొత్త హాస్టల్ భవనాన్ని నిర్మించాలని, స్పోరట్స్ అథారిటీ వాళ్లు, తీసుకున్న 10 గుంటల భూమి తిరిగి హాస్టల్ కి ఇవ్వాలని, దళిత మహిళలను చదువుకు దూరం చేసే డిఐఎస్ఓ ప్రతిపాదన విరమించుకోవాలని, జిల్లా అధికారులు రాజకీయ నాయకులు, దళిత మహిళలు చదువుకునేందుకు ప్రోత్సహించాలి, కానీ దూరం చేసే ప్రతిపాదనలను అంగీకరించవద్దని, రౌండ్ టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. దళిత సంఘాలు విద్యార్థి సంఘాలతో దశల వారీగా ఉద్యమాలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని వారు అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మాణిక్యం రాజు అధ్యక్షతన జరిగింది, ఈ సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం కురుమయ్య, ఎమ్మార్పీఎస్ ఆర్ఆర్, రాష్ట్ర అధ్యక్షులు సింగిరెడ్డి పరమేశ్వర్, టిఎంఆర్ పిఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బోయపల్లి నర్సింహులు, దళిత క్రిస్టియన్ దండోరా రాష్ట్ర నాయకులు మామిడి సామెల్, జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు కంచి మీ లక్ష్మణ్, తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు మంత్రి నరసింహ, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాలరాజు, ప్రజా సంఘాల ఐక్యవేదిక, జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ , బహుజన మహనీయుల శోభ యాత్ర జిల్లా అధ్యక్షులు పాతూరు రమేష్, మాట్లాడినారు .మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డమీది గోపాల్, పి యు జెఎసి నాయకులు బత్తిని రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భరత్, ఎం ఎస్ ఎఫ్ జిల్లా చైర్మన్, కమలాకర్, కెవిపిఎస్ టౌన్ కార్యదర్శి ఆదివిష్ణు, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా మల్లేష్, కెవిపిఎస్ నాయకులు మనోహర్, రవి, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు

# కాళేశ్వరం జోన్ పరిధి పోలీసులకు క్రీడలు

- క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం
- రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో కూడా రాణించి మంచిపేరు తీసుకురావాలి: అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు



**మంచిర్యాల, జనవరి 19(మనం న్యూస్):** రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో కూడా రాణించి మంచిపేరు తీసుకురావాలని అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు కోరారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి గేమ్స్ అండ్ స్పోరట్స్ మీట్ పోటీల కోసం క్రీడాకారుల ఎంపికకై కాళేశ్వరం జోన్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ పోటీలు పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ మైదానంలో ఆదివారం రామగుండం పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఐజీ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు పోలీస్ అధికారులతో కలిసి ఘనంగా క్రీడలను ప్రారంభించారు. అడ్మిన్ డీసీపి మాట్లాడుతూ పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణలో నిత్యం 24/7 విధినిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ సిబ్బంది క్రీడల్లో పాల్గొనడం వారిలో నూతనోత్సాహాన్ని నింపుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములనేవి సహజమని, గెలుపోటముల కంటే టీమ్ స్పిరిట్ గొప్పదన్నారు. క్రీడల్లో గెలుపు కంటే పాల్గొనడం, పార్టీసిపేషన్ ముఖ్యమన్నారు. ఎల్లప్పుడు విధినిర్వహణలో ఉంటారని, అలాంటి నిర్విరామ విధులలో ఉన్న పోలీసులకు స్పోర్ట్స్ నూతన ఉత్సాహంతో పాటు ఉల్లాసాన్ని కలిగిస్తుందని, సిబ్బందికి ఎల్లప్పుడు పని ఒత్తిడి తట్టుకోవడానికి, శక్తిని ఇవ్వడానికి ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయని, స్నేహపూర్వక వాతావరణంలో ఈ క్రీడలను నిర్వహించు కోవాలని గెలుపోటములను ఏదైనా స్పూర్తిగా తీసుకోవాలన్నారు. ఇక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచి కాలేశ్వరం జోన్ తరుపున రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొని అక్కడ కూడా కాళేశ్వరం జోన్‌కు అత్యధిక పతకాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ పోటీలు రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పోలీస్ టీమ్స్ మధ్య షటిల్ బ్యాట్మెంటన్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, స్విమ్మింగ్, తగ్గాఫర్, హై జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో, జవలిన్, అథ్లెటిక్స్ క్రీడ లలో సెలక్షన్లు జరిగాయి. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ఏ ఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి, మల్లేశం, సంపత్, ములుగు ఆర్ఐ సంతోష్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాన్ పాడ్ దర్గా అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి



**పాలకీడు, జనవరి 19(మనంన్యూస్):** పాలకవీడు మండలంలోని జాన్ పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 23వ తారీకు నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ పౌరసరఫరాల శాఖ మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి ఆదివారం అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం రాష్ట్ర వక్ బోర్డ్ చైర్మన్ సయ్యద్ హజ్మతుల్లా హుస్సేన్ 30 లక్షల రూపాయలు చెక్ ఉత్తంకుమార్ రెడ్డి చేతుల మీదుగా వక్ఫ్ బోర్డ్ ఇన్స్పెక్టర్ షేక్ మహమ్మద్ కి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వము అభివృద్ధిని మరిచిపోయి తమ ప్రభుత్వంపై లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని ప్రజలు నమ్మరని తెలిపారు. 10 సంవత్సరాల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడు జాన్ పహాడ్ దర్గా అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వము ఒక్క సంవత్సర కాలంలోనే జాన్పాడుదర్గా అభివృద్ధి కొరకు కోటి 11 లక్షల రూపాయలు తన సొంత నిధుల నుండి ఖర్చు చేసి దర్గా అభివృద్ధికి తమ ప్రభుత్వం సహకరించిందని తెలిపారు. పాలకీడు మండలంలోని ఉన్నటువంటి మూడు లిస్టుల పరిధిలో గల విస్తీర్ణం ఇంకా కొన్ని గ్రామాలకు ఏమైనా పెంచే వీలు ఉంటే దానిపై అధ్యయనం చేసి తమకు సమాచారం అందించాలని లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులను కోరారు. జాన్ పహాడ్ సమీప గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్నటువంటి లిఫ్టును ఆయన పరిశీలించి పనులు త్వరితగదన పూర్తి చేసి రైతులకు అందించాలని కోరారు ఇట్టి లిఫ్టును జవహర్ జాన్ పాడు లిఫ్ట్ గా నామకరణం చేశారు. ఈ లిఫ్ట్ ద్వారా గుల్లపాడు జానపాడు రాఘవాపురం గుండెబోయిన గూడెం బత్తుల పాలం అలంగాపురం ఎల్ 14 వరకు రైతులకు ఉపయోగపడి రెండు పంటలు పండించుకోవడానికి సరిపడా నీటి నిల్వ సౌకర్యం సౌకర్యం ఉంటుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాల కాలంలో కేవలం 40 వేల రేషన్ కార్డులు మాత్రమే మంజూరు చేశారని కానీ తమ ప్రభుత్వం కేవలం ఒక సంవత్సర కాలంలో 40 లక్షల రేషన్ కార్డులు ఇవ్వబోతుందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క చివరి వ్యక్తి వరకు రేషన్ కార్డులు ఇచ్చేటందుకు నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని ప్రజా పాలనలో, ప్రజావాణిలో, మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క అర్హుడికి రేషన్ కార్డు ఇస్తామని తెలిపారు. ఇంకా ఎవరైనా రేషన్ కార్డు లేకుండా దరఖాస్తు చేసుకొన్నట్లయితే అట్టి వారు కూడా ఈనెల 24వ తారీఖున గ్రామాలలో నిర్వహించే గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మిర్యాలగూడ శాసనసభ సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ భూక్య గోపాల్ నాయక్, నేరేడుచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బెల్లంకొండ నరసింహారావు, జిల్లా నాయకులు మోతిలాల్ నాయకు, కొనతం చిన్న వెంకటరెడ్డి, జితేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు అర్హులు దరఖాస్తు చేసుకోండి

- మున్సిపల్ కమిషనర్ జి. రాజు

**రామకృష్ణాపూర్, జనవరి 19 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వే ఆధారంగా క్యాతనపల్లి మున్సిపాలిటీలో 838 రేషన్ కార్డు లబ్ధిదారుల వివరాలను మున్సిపాలిటీ కార్యాలయంకు పంపించడం జరిగిందని, రేషన్ కార్డు జాబితాలో పేర్లు రాని వారు ఉన్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఇంకా ఎవరైనా ఫుడ్ సెక్యూరిటీ కార్డు కావలసిన అర్హులు వారి వివరాలు ప్రభుత్వానికి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అందులో భాగంగా రేషన్ కార్డు కావలసిన లబ్దిదారులు19, 20, 21 తేదీలలో మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో సూచించబడిన విధంగా దరఖాస్తులు అందజేయాలని అన్నారు. ఈ దరఖాస్తులను కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ ఎం.డి. సోహెలుద్దీన్, 6300128054. వార్డు అధికారి ఏ. మద్నూ, 9951765405. ఓఎస్ సిహెచ్. ప్రేమ్, 8106677956. కంప్యూటర్ ఆపరేటర్ బి. దివ్యభారతిలకు కుటుంబ యజమాని, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్సులు, కుల వివరాలు, మొబైల్ నెంబర్లు, చిరునామాతో ధరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి. రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

# విద్యాలయం ఆకస్మిక తనిఖీ

**సిరిసిల్ల, జనవరి 19 (మనం న్యూస్):** మర్రిమడ్ల లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల తరగతి గదులు, హాస్టల్ భవనం, డైనింగ్ హాల్, కిచెన్, స్టోర్ రూమ్ పరిసరాలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కామన్ మెనూ అమలు పై ఆరా తీశారు. ప్రహరీ పూర్తిగా నిర్మించాలని, బోర్వెల్ వేయించాలని కలెక్టర్‌కు ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ విజ్ఞప్తి చేశారు. ప్రహరీ, బోర్వెల్ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని కోనరావుపేట ఎంపీడీవోను కలెక్టర్ కోరారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, తహసిల్దార్లు, ఎంపీడీవోలు విజయ్ ప్రకాష్ రావు, మారుతిరెడ్డి, రామ్ చందర్, భూపతి, శంకర్ రెడ్డి, వాజిద్, సత్తయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ పోల్స్, నెట్ బాల్స్ వితరణ



**రామడుగు, జనవరి 19(మనం న్యూస్):** రామడుగు మండలలోని దేశరాజ్ పల్లి గ్రామంలో జరుగుతున్నటువంటి వాలీబాల్ టోర్నమెంట్ కు కావాల్సిన పోల్స్ నెట్స్, బాల్స్ లను దేశరాజుపల్లి గ్రామంలోని వాలీబాల్ క్రీడాకారులకు రామడుగు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనుపురం పర్శరామ్ ఆదివారం స్పాన్సర్ చేశారు. ఈ కార్యక్రమంలో రామడుగు గ్రామస్తులు పురెళ్ల రాజశేఖర్, మామిడి దిలీప్ కుమార్, మాదం శివ, వేముల రమేష్, గంటే మునిందర్, సిరికొండ సాయి తేజ, పంజాల సతీష్, దేశరాజ్ పల్లి గ్రామ క్రీడాకారులు మామిడి రాజశేఖర్, బండారి మధు, అజయ్ ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# మహాకుంభ మేళాలో అగ్ని ప్రమాదం



**● పరుగులు తీసిన భక్తులు**

ప్రయాగరాజ్, జనవరి 19: ఉత్తరప్రదేశ్ ప్రయాగరాజ్‌లో కుంభమేళా జరుగుతున్న ప్రాంతంలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. సాధువుల కోసం వేసిన టెంట్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో సంఘటనా స్థలం మొత్తం భారీగా పొగ కమ్మేసింది. మంటలు ఎగిసిపడడంతో భక్తులు దూరంగా వెళ్లిపోయారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు తెలియాలేదు. సంఘటనా స్థలంలో ఫైర్ ఇంజిన్లను మోహరించి మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. యూపీ ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఆదివారం ఉదయం 8 గంటల వరకు 1.7 మిలియన్లకుపైగా భక్తులు మహాకుంభ మేళాకు హాజరయ్యారు. ఏడో రోజు 1.7 మిలియన్ల మందికిపైగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు చేసినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. జనవరి 18 నాటికి మహా కుంభమేళా సందర్భంగా సంగం త్రివేణిలో 77.2 మిలియన్లకుపైగా యాత్రికులు స్నానాలు చేసినట్లు పేర్కొంది. ఆదివారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసినా.. భక్తులు భారీగా తరలివచ్చి స్నానాలు ఆచరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను లెక్క చేయకుండా తరలివస్తున్నారు.

# డీఎంకేలోకి సత్యరాజ్ కుమార్తె

చెన్నై,జనవరి 19: సినీనటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య సత్యరాజ్ డీఎంకేలో చేరారు. తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆదివారం ఆమె డీఎంకే తీర్థం పుచ్చుకున్నారు. పోషకాహార నిపుణురాలైన దివ్య సత్యరాజ్ డీఎంకేలో చేరిన విషయాన్ని ఆ పార్టీ 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో డీఎంకే ఎంపీ టీఆర్ బాలు, పార్టీ నేతలు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. 2019 లోకసభ ఎన్నికల సమయంలో ఆమె స్టాలిన్‌ను కలిసిన సమయంలో డీఎంకేలో చేరుతున్నట్లు పెద్ద ఎత్తున ఊహాగానాలు వచ్చాయి.



అయితే, అది మర్యాదపూర్వక భేటీయేనని, ఇరు కుటుంబాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు అప్పట్లో ఆమె వివరణ ఇచ్చారు. తాజాగా డీఎంకేలో చేరిన సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనేది తన కల అన్నారు. చిన్ననాటి నుంచే డీఎంకే విధానాలను ఇష్టపడినట్లు చెప్పారు. ఆ పార్టీలో చేరడానికి అనేక కారణాలున్నాయన్న ఆమె.. తానొక పోషకాహార నిపుణురాలినని, డీఎంకే ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చే పార్టీ అన్నారు. అందుకే రాష్ట్రంలో అల్పాహార కార్యక్రమాన్ని సైతం ప్రారంభించిందని తెలిపారు. మహిళలను,అన్ని మతాలను గౌరవించే పార్టీ డీఎంకే అని పేర్కొన్నారు.

# సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడే..!

**● కీలక వివరాలు వెల్లడించిన ముంబయి పోలీసులు..!**

ముంబయి, జనవరి 19: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన నిందితుడు గురించి ముంబయి పోలీసులకు కీలక విషయాలు వెల్లడించారు.

ఆదివారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో నిందితుడికి బంగ్లాదేశ్‌తో సంబంధాలు ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ నెల 16న తెల్లవారు జామున 2గంటలకు సైఫ్ అలీఖాన్‌పై అతని ఇంట్లోనే దాడి జరిగింది. బాంద్రా పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇప్పటికే ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి పేరు మొహమ్మద్ షరీఫుల్ ఇస్లాం షాజాద్‌గా పోలీసులు పేర్కొన్నారు.




నిందితుడు దొంగతనం చేయాలనే ఉద్దేశంతో ఇంట్లోకి ప్రవేశించాడని.. అతను బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. అతనివద్ద భారత్‌కు చెందిన గుర్తింపు పత్రాలు లేవని డీసీపీ దీక్షిత్ గేదం తెలిపారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించిన తర్వాత పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడని పేర్కొన్నారు. ఐదారు నెలల కిందట ముంబయికి వచ్చినట్లు వివరించారు. మొదట నిందితుడు హౌస్‌కీపింగ్ ఏజెన్సీలో పని చేసే వాడని పేర్కొన్నారు. నిందితున్ని అరెస్టు చేసిన పోలీసులు.. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి, కస్టడీకి కోరనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం కేసు విచారణ జరుగుతుందన్నారు. నిందితుడిని పోలీసులు శనివారం రాత్రి 2.50గంటలకు థానేలోని హిరానంది ప్రాంతంలో అరెస్టు చేశారు. ఈ ప్రాంతంలోనే కార్మికులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బంగ్లాదేశ్ నుంచి భారతదేశానికి రావడానికి అనేకసార్లు తన పేరును మార్చుకున్నాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

## సైఫ్‌పై దాడి ఘటనలో అదే వాస్తవం..: అజిత్ పవార్

నటుడు సైఫ్‌పై దాడి ఘటనపై మహారాష్ట్ర ఎన్సీపీ అధినేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ స్పందించారు. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఓ వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన సంచలనంగా మారింది. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయంటూ విమర్శించాయి. ఈ వ్యాఖ్యలపై తాజాగా స్పందించిన ఎన్సీపీ అధినేత, డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ఆరోపణలను ఖండించారు. సైఫ్‌పై దాడికి దిగిన వ్యక్తికి అదొక సెలబ్రిటీ నివాసమనే విషయం తెలియదని అన్నారు.

అతడు బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చి కోల్కతాలో ఉన్నాడు. అనంతరం కుటుంబంతో సహా ముంబయికి మకాం మార్చాడు. కేవలం దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే అతడు సైఫ్ నివాసంలోకి ప్రవేశించాడు. అంతే తప్ప నిందితుడికి అసలు విషయం తెలియదు'' అని అజిత్ పవార్ పేర్కొన్నారు. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. దుండగుడు సైఫ్ చిన్న కుమారుడు జేహ్ గదిలోకి వెళ్లాడు. దుండగుడిని చూసిన జేహ్ కేర్ టేకర్ కేకలు వేయగా సైఫ్ అక్కడికి చేరుకొన్నారు. అదే సమయంలో వారి మధ్య పెనుగులాట జరిగింది. ఈ క్రమంలోనే నటుడు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. వాదోపవాదాలు విన్న న్యాయస్థానం 5 రోజుల పాటు పోలీసుల కస్టడీకి అనుమతించింది.

# రాహుల్‌కి చరిత్రపై అవగాహన లేదు




**● బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా**

అహ్మదాబాద్, జనవరి 19:రాహుల్ గాంధీకి చరిత్రపై అవగాహన లేదని బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా దుయ్యబట్టారు. ఆయన తండ్రి, నానమ్మ, ముత్తాతలు రాజ్యాంగాన్ని తారుమారు చేయడానికి చేసిన ప్రయత్నాల గురించి రాహుల్‌కు తెలియదన్నారు. అహ్మదాబాద్‌లో బీజేపీ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న నడ్డా.. 65ఏళ్ల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ నేతలు రాజ్యాంగం, దాని స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నించారని మండిపడ్డారు. దేశంపైనే కాంగ్రెస్ పోరాటం చేస్తోందని ఇటీవల రాహుల్ చేసిన వ్యాఖ్యలపైనా జేపీ నడ్డా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ''భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. చరిత్ర గురించి వారికి అవగాహన లేదు. విషయాలను అర్థం చేసుకోకుండా కేవలం రాసి ఇచ్చిన స్పీచ్‌లను మాత్రమే రాహుల్ చదువుతారు. 76వ గణతంత్ర దినోత్సవం చేసుకుంటున్న వేళ.. రాజ్యాంగాన్ని ఎవరు మార్చారు, ఎవరు రక్షించారు, ప్రాథమిక నిబంధనలను ఎవరు నాశనం చేశారు...అనే విషయాలను గుర్తు చేసుకోవాలి'' అని జేపీ నడ్డా పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఏముందో తెలుసుకోకుండా, చదవకుండా.. వాటి ప్రతిని చేత పట్టుకొని తిరుగుతున్న కొందరిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నడ్డా విమర్శించారు. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ)లను అంబేడ్కర్ వ్యతిరేకించినప్పటికీ.. భారత తొలి ప్రధాని నెహ్రూ వాటిని అమలు చేశారని బీజేపీ నడ్డా విమర్శించారు.

# ప్రభుత్వ స్కూల్లో టీచర్స్ రొమాన్స్.. వీడియో వైరల్

**● సస్పెండ్ చేసిన విద్యాధికారి**

జైపూర్, జనవరి 19: ఇద్దరు టీచర్లు ప్రభుత్వ స్కూల్లో రొమాన్స్లో తేలియాడారు. వారిద్దరూ ముద్దులు పెట్టుకుని, కౌగిలించుకుని అసభ్యకరంగా ప్రవర్తించారు. వారి చర్యలకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేశారు. రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అజోలియా ఖేడా గ్రామంలోని సలేరాలో ఉన్న ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. సోషల్ సైన్స్ టీచర్ అరవింద్‌నాథ్ వ్యాస్, ఒక మహిళా ఉపాధ్యాయు రాలితో సాన్నిహిత్యాన్ని పెంచుకు న్నాడు. దీంతో ఆ ప్రభుత్వ స్కూల్లో వారిద్దరూ పలుమార్లు సరస శృంగారాల్లో మునిగిపోయారు. కాగా, గత ఏడాది డిసెంబర్లో ఆ ఇద్దరు టీచర్లు కౌగిలించు కుని, ముద్దులు పెట్టుకుని అసభ్యకర చర్యలకు పాల్పడ్డారు. ఈ వీడియో క్లిప్ తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తు తం ఇది సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉపాధ్యాయుల తీరుపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రభుత్వ స్కూల్లో రొమాన్స్‌లో తేలియాడిన ఆ ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేశారు.



# బీహార్ కులగణనపై రాహుల్ విమర్శ

పట్నా, జనవరి 19: బీహార్‌లో గతంలో చేపట్టిన కులగణనను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నకిలీగా పేర్కొనడంపై ఎన్డీయే మండిపడింది. బీహార్‌లో నీతీశ్ కుమార్ సర్కారు గతంలో చేపట్టిన కులగణనను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫేక్‌గా పేర్కొనడంపై ఎన్డీయే మండిపడింది. మొన్నటివరకు బీహార్ కుల సర్వేను ప్రశంసించిన ఆయన.. ఇప్పుడు దాన్ని నకిలీగా పేర్కొనడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. నీతీశ్ కుమార్ గతంలో 'ఇండియా' కూటమి సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తినప్పుడు రాహుల్ మౌనంగా ఉన్నారని ఆరోపించింది. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర కులగణన వివరాలను ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించింది.

లోకసభ ఎన్నికల తర్వాత తొలిసారి బీహార్లో పర్యటించిన సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణనను నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలను మోసం చేసేందుకు ఉద్దేశించి.. 2022-23లో బీహార్‌లో స్థానిక ప్రభుత్వం నిర్వహించిన విధంగా ఈ ప్రక్రియ నకిలీది కాదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. 2023 అక్టోబరులో కులగణన వివరాలు వెల్లడైన సమయంలో కాంగ్రెస్ సైతం నీతీశ్ కుమార్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండటం గమనార్హం. రాష్ట్రంలో దళితులు,




వెనుకబడిన తరగతుల జనాభా శాతం పెరిగినట్లు సర్వేలో తేలింది.

రాహుల్ వ్యాఖ్యలపై జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా స్పందిస్తూ.. ఆయన ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని విమర్శించారు. భారత ప్రభుత్వానికి, దేశానికి మధ్య తేడాను గుర్తించలేని నేత నుంచి ఇంతకంటే మరేం ఆశించగలమని మంత్రి విజయ్ కుమార్ చౌదరి ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కులగణనకు కాంగ్రెస్ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. సర్వేలోని లోపాలను స్పష్టమైన ఆధారాలతో ఎత్తి చూపితే సరిదిద్దడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# మోదీతో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తా: లెక్స్ ఫ్రిడ్‌మాన్

వాషింగ్టన్, జనవరి 19: భారత ప్రధాని నరేంద్ర మోదీతో తాను త్వరలో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తానని అమెరికాకు చెందిన ఆర్టిఫిషియల్




ఇంటెలిజెన్స్ పరిశోధకుడు, పాడ్‌కాస్ట్ హోస్ట్ లెక్స్ ఫ్రిడ్‌మాన్ పేర్కొన్నారు. తాను త్వరలో భారత్‌లో పర్యటించనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

'నేను భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తా. ఇది ఫిబ్రవరి చివరిలో ఉంటుంది. ఇప్పటివరకు భారత్‌ను ఎప్పుడూ సందర్శించలేదు. అక్కడి శక్తిమంతమైన, చరిత్రాత్మక సంస్కృతి, అద్భుతమైన ప్రదేశాలను సందర్శించేందుకు ఎదురు చూస్తున్నా' అని ఫ్రిడ్‌మాన్ రాసుకొచ్చారు. అయితే, ఈ పాడ్‌కాస్ట్‌పై ప్రధాని కార్యాలయం ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఫ్రిడ్‌మాన్ 2018 నుంచి 'లెక్స్ ఫ్రిడ్‌మాన్' పేరుతో పాడ్‌కాస్ట్ నిర్వహిస్తున్నారు. సైన్స్, టెక్నాలజీ, స్పోర్ట్స్, రాజకీయ రంగాల్లోని ప్రముఖులతో ఇంటర్వ్యూలు చేస్తున్నారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్, అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్ ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలతో సహా అనేక మందిని ఇంటర్వ్యూ చేశారు. ఆయనకు యూట్యూబ్లో 4.5 మిలియన్ల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా.. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో ఇటీవల ప్రధాని మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. అందులో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి అనేక అంశాలపై ఇరువురూ చర్చించారు.

# బాధ్యతల స్వీకరణ తర్వాత భారత్‌లో ట్రంప్ పర్యటన..?

వాషింగ్టన్, జనవరి 19: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్ ట్రంప్ మరికొన్ని గంటల్లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన భారత్‌లో పర్యటించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు చైనాలోనూ పర్యటించే అవకాశాలున్నాయని సమాచారం. ఈమేరకు పలు ఆంగ్లపత్రికల్లో కథనాలు



వెలువడ్డాయి. తాను అధికారం చేపట్టాక చైనా దిగుమతులపై సుంకాలు విధిస్తానంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బీజింగ్‌తో తన సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఆయన ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా బాధ్యతల స్వీకరణ అనంతరం చైనాలో పర్యటించనున్నట్లు సమాచారం.


మరోవైపు.. భారత్‌లో పర్యటించే అంశంపైనా సలహాదారులతో చర్చలు జరిపినట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. మరికొద్ది నెలల్లో వైట్‌హౌస్‌లో జరిగే దేశాధినేతల సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీని ట్రంప్ ఆహ్వానించే అవకాశముంది. ఈ సమావేశాల అనంతరం ఆయన భారత్‌లో పర్యటిస్తారనేది మీడియా కథనాల సారాంశం. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఇటీవల ట్రంప్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఫోన్లో మాట్లాడిన విషయం తెలిసిందే. ప్రపంచ శాంతి కోసం ఇరువురం కలిసి సాధ్యమైనంత మేరకు కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. కాబోయే అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకారానికి జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా ఇదివరకే పేర్కొంది. తమ ప్రతినిధిగా వైస్ ప్రెసిడెంట్ హాన్ జెంగ్‌ను పంపించనున్నట్లు వెల్లడించింది. భారత్ తరపున విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్ ప్రమాణస్వీకారానికి హాజరుకానున్న విషయం తెలిసిందే.

47వ అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ సోమవారం ప్రమాణం చేయనున్నారు. క్యాపిటల్ హిల్లోని రోటుండా ఇండోర్ ఆవరణలో ఈ కార్యక్రమం జరగనుంది. మరోవైపు ప్రమాణస్వీకార నేపథ్యంలో ట్రంప్, ఆయన సతీమణి మెలానియా, కుమారుడు బారన్‌లు డల్లాస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు.

# ట్రంప్‌తో అంబానీ దంపతుల భేటీ

వాషింగ్టన్, జనవరి 19: ప్రపంచ కుబేరుల్లో ఒకరు, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీతో డొనాల్డ్ ట్రంప్ భేటీ అయ్యారు. అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారానికి ప్రపంచ దేశాల అధినేతలు, ప్రతినిధులు, ప్రముఖ వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.ఈ క్రమంలో ప్రపంచ కుబేరుల్లో ఒకరు, రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ ట్రంప్‌తో భేటీ అయ్యారు. అమెరికా కాబోయే అధ్యక్షుడితో ముకేశ్-నీతా అంబానీలు సమావేశమైన ఫొటో ప్రస్తుతం బయటకు వచ్చింది. అయితే, తాజా భేటీలో



అంబానీ-ట్రంప్ చర్చలకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు జనవరి 18న అంబానీ దంపతులు అమెరికా చేరుకున్నారు. ఈ క్రమంలో ట్రంప్ ఏర్పాటు చేసిన 'క్యాండిల్లైట్ డిన్నర్'లో అంబానీ దంపతులు పాల్గొన్నారు. దాదాపు 100 మందికి ఆహ్వానం అందినట్లు సమాచారం. ఈ జాబితాలో భారత్ నుంచి వీరిద్దరే ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వాషింగ్టన్‌లో ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు విందులో ట్రంప్‌తో ముకేశ్ దంపతులు భేటీ అయ్యారని రిలయన్స్ ఫౌండేషన్ వెల్లడించింది. ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు డొనాల్డ్ ట్రంప్‌నకు శుభాకాంక్షలు తెలిపారని పేర్కొంది. ఈ సందర్భంగా ట్రంప్ నాయకత్వంలో భారత్-అమెరికా మధ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపింది.

# జనవరి 21, 27తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష.. అడ్మిట్ కార్డులు విడుదల

ఢిల్లీ,జనవరి 19: యూజీసీ-నెట్ డిసెంబర్ 2024 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. మొత్తం 85 సబ్జెక్టులకు జనవరి 3 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు పూర్తి కావాల్సి ఉండగా.. పండుగ నేపథ్యంలో జనవరి 15న జరగాల్సిన పరీక్షను జనవరి 21, 27 తేదీలకు రీషెడ్యూల్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ రెండు రోజుల్లో జరగనున్న పరీక్షల అడ్మిట్ కార్డులను ఎన్టీఏ అధికారిక వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ, సెక్యూరిటీ పిన్ ఎంటర్ చేసి అడ్మిట్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చు.



అడ్మిట్ కార్డులపై అభ్యర్థి ఫొటో, బార్‌కోడ్, క్యూఆర్ కోడ్‌ను చెక్ చేసుకోవాలని యూజీసీ సూచించింది. వీటిలో ఏది లేకపోయినా మరోసారి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించింది. అడ్మిట్ కార్డుల డౌన్‌లోడ్‌లో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అభ్యర్థులు 011-40759000 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు ఉపయోగపడే ఈ పరీక్ష కోసం డిసెంబర్ 11వరకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే.

# రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు

గువాహటి, జనవరి 19: లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై గువాహటి పోలీస్ స్టేషనలో కేసు నమోదైంది. దేశంతోనూ కాంగ్రెస్ పోరాడుతోందని కాంగ్రెస్అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయనపై అస్సాంలోని గువాహటి పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. మోన్జిత్ చాటియా అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వాక్ స్వాతంత్ర్య పరిమి తులను దాటాయని, అవి జాతీయ భద్రతకు తీవ్రమైన ముప్పు కలిగిస్తాయని చాటియా తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతితో పాటు, వేర్పాటువాద భావాలు కలిగిన వారిని రెచ్చగొట్టే ప్రమాదం ఉందన్నారు. 'ప్రతిపక్ష నాయకుడిగా ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత రాహుల్‌కు ఉంది. కానీ, ఆయన అందుకు బదులుగా అబద్ధా లు వ్యాప్తి చేసి దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని ప్రమాదంలో పడేస్తున్నారు' అని చాటియా ఆరోపించారు. ఢిల్లీలో కాంగ్రెస్ నూతన ప్రధాన కార్యాల యాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ..'ఆరెస్సెస్ వంటి మా భావజాలం వేల సంవత్సరాల నాటిది. బీజేపీ, ఆరెస్సెస్ దేశంలోని ప్రతి సంస్థను తమ గుప్పిట్లో పెట్టుకు న్నాయి. మేము ఇప్పుడు బీజేపీ, ఆరెస్సెస్‌తో పాటు భారత దేశంపై కూడా పోరాడుతున్నాం' అని వ్యాఖ్యానించారు. ఈవ్యాఖ్యలను పలువురు కేంద్ర మంత్రులు తప్పుబట్టారు.

# రాజ్యాంగం దేశ ప్రజల ఆత్మగౌరవం

- రాజ్యాంగ స్ఫూర్తితోనే ఎన్నో ప్రజా పోరాటాలు
- అధికారం అడ్డం పెట్టుకొని అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు
- 75 ఏళ్ల రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్ర
- ప్రతి పౌరుకీ స్వేచ్ఛ వాయువు రక్షణ కవచం రాజ్యాంగం
- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ కోదండరాం






**సూర్యాపేట, జనవరి 19 (మనం ప్రతినిధి):** 75 ఏళ్ల భారత రాజ్యాంగం దేశ ప్రజల ఆత్మగౌరవం అని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిరుమల గ్రాండ్ హాల్లో తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు కుంట్ల ధర్మార్జున్ ఆధ్వర్యంలో 75 సంవత్సరాల రాజ్యాంగ గమనం గమ్య పై సెమినార్ నిర్వహించారు ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ... భారతదేశంలో పాలకుల స్వార్థ రాజకీయాలతో భారత రాజ్యాంగ ని విచ్ఛిన్నత చేసే కుట్ట జరుగుతుందని విమర్శించారు. ప్రతి పౌరునికి రాజ్యాంగం స్వేచ్ఛ వాయువులు ఇచ్చిందని రాజ్యాంగంతో పాలకుల సరళీకృత దోపిడిని అరికట్టేందుకు రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు అని తెలిపారు రాజ్యాంగం తోనే పాలకులు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నేడు ప్రజా పోరాటాలు చేస్తున్నామని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే మన రాజ్యాంగం ఎంతో గొప్పదని భవిష్యత్తు మార్గం అభివృద్ధి పాలన యంత్రాంగం ప్రతి ఒక్కరు సమానత్వం చూపించే విధంగా రాజ్యాంగం ఏర్పడిందని దీనిని జీర్ణించుకోలేని ప్రభుత్వాలు ఇటీవల తరచూ రాజ్యాంగంపై విమర్శలు చేస్తున్నారని గుర్తు చేశారు రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం కాకుండా కాపాడుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు ఎన్నో పోరాటాలు బలిదానాలతో తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలు ఆత్మగౌరవంతో బతకాలని కోరుకుంటున్నారని. ఈ ప్రాంతం ముద్దుబిడ్డ వేణుగోపాల రెడ్డి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బలిదానం చేసుకున్నాడని నేడు ఆయన వర్ధంతి కి నివాళులర్పిస్తున్నానని అన్నారు.

**ప్రజల సొమ్ము అవినీతి చేసే శిక్ష తప్పదు**

అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ సొమ్ము అప్పనంగా ఖర్చు చేసి అవినీతికి పాల్పడితే ఎంతటి వారికైనా శిక్ష తప్పని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ప్రభుత్వ సొమ్ము ప్రజల ఆస్తి అని దానిని స్వార్థ రాజకీయాల కోసం నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసినట్లు విచారణలో తేలి అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా సరే ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**రాజ్యాంగం ఎలక్షన్ మేనిఫెస్టోలో తీసుకురావాలి**

పాలకులు ప్రజలను మభ్య పెట్టేందుకు ఎలక్షన్ సమయంలో ప్రజలకు ఇచ్చే హామీలను మేనిఫెస్టోలో పొందుపరిస్తే దానిని రాజ్యాంగ బద్ధంగా అమలుపరిచేందుకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురావాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షులు కుంట్ల ధర్మార్జును ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దృక్పథ పరిచయం సమాజ కోసం కొత్త తరం నూతన ఆలోచనతో తెలంగాణ రాష్ట్రం ప్రతిసారి అధ్యయనం చేసిందని గుర్తు చేశారు దీనిలో భాగంగానే నైజాం నవాబులు ఆంధ్ర వలస పాలకుల దోపిడీని తెలంగాణ ఎండగట్టి స్వరాష్ట్రాన్ని సాధించుకున్న విషయాన్ని మర్చిపోకూడదని కొంతమంది వ్యక్తులు మాత్రమే రాజ్యాంగాన్ని అనుకూలంగా మార్చుకుంటున్నారని కానీ సామాజికంగా ఆర్థికంగా ప్రతి ఒక్కరు ఎదగాలన్నదే రాజ్యాంగం ముఖ్య ఉద్దేశమని కొంతమంది పాలకులు రాజ్యాంగం పై విమర్శలు చేస్తూ ఇటీవల తప్పు పడుతుండటం చూస్తున్నామని రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ గుర్తు చేసుకుంటూ తాను నాగార్జునసాగర్ లో నిర్వహించిన సెమినార్లో తెలంగాణపై చర్చ జరిగిందని ఎలాగైనా సాధిస్తామని చెప్పిన జయశంకర్ సార్. ఏర్పడింది తెలంగాణ లో వ్యవసాయం నిరుద్యోగం మహిళా అభివృద్ధి బడ్జెట్ రూపకల్పన ఇలా 12 అంశాలపై సుదీర్ఘంగా ఏదో మథనం జరిగిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు బీసీ ఎస్టీ ఎస్టీ అగ్రకులాల నిరుపేదలు ఆర్థికంగా స్థిరపడి ఆత్మగౌరవంతో జీవించాలన్నదే జయశంకర్ చెబుతుండేవారని స్పష్టం చేశారు రాబోయే గ్రామపంచాయతీ మున్సిపల్ ఎన్నికల్లో మద్యం డబ్బు లేకుండా ప్రజల మద్దతుతో గెలవాలని అన్నారు దీని కనుగుణంగానే నేటి యువత ఎక్కువ గా రాజకీయాల్లోకి ప్రవేశించి నూతన మార్పు తీసుకురావాలని అవినీతి లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలని ఇలా జరగాలంటే రాజకీయం పరంగా సమూల మార్పు జరగాలని ఇది కేవలం యువతతోనే సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే 75వ రాజ్యాంగ గమ్యం గమనంపై మొదటి సెమినార్ సభ పేట జిల్లాలో జరుపుకుంటున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో మల్లెపల్లి లక్ష్మయ్య, మూడభూషణ్, తండు నాగరాజ్, కిరణ్ ,గోపి, శ్రీకాంత్, తెలంగాణ జన సమితి నాయకులు, కార్యకర్తలు పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి బస్టాండ్

- ఆవరణలో భోజన సదుపాయము
- డిపో మేనేజర్ దేవరాజ్

**మెట్ పల్లి, జనవరి 19 (మనం న్యూస్):** ఆర్టీసీ సిబ్బందికి బస్టాండ్ ఆవరణలో భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ దేవరాజ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ ఆర్టీసీ ఎండి అదేశాల మేరకు ఈ రోజు విధి నిర్వహణలో ఉన్న సంస్థ సిబ్బంది అందరికి మధ్యాహ్న భోజనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అందచేసే కార్యక్రమంలో భాగంగా మెట్ పల్లి ఆర్టీసీ డిపో సిబ్బందికి బస్టాండ్‌లో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. బస్ స్టేషన్‌లో డ్రైవర్లకు కండక్టర్లకు భోజన ప్యాకెట్లు అందచేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయణీకుల తాకిడి ఎక్కువగా ఉన్నందున వారికి అసౌకర్యం కలగకుండా సిబ్బంది బయటకు వెళ్లకుండా బస్టాండ్ యందు భోజనం చేయుటకు వీలుగా ఈ సౌకర్యం కల్పించినట్లు మేనేజర్ తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది అన్ని సమయాల్లో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించటకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా భోజనం హైర్ బస్ డ్రైవర్లతో పాటు బస్టాండ్ యందలి సిబ్బందికి అందచేశారు. ఈ కార్యక్రమంలో డియమ్ తో పాటు సిబ్బంది సురేష్, రాములు, అశోక్, శేఖర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## సిపిఎం మహాసభలు జయప్రదానికై ఇంటింటికి ప్రచారం

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున

**నల్గొండ, జనవరి 19 (మనం న్యూస్):** సిపిఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నల్గొండ మండలం అప్పాజీపేట గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వాహస్తూ విరాళాల సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడే సిపిఎం పార్టీకి ప్రజలు ఆదరించాలని కోరారు పెద్ద ఎత్తున ప్రజలు సహకారం అందించారు. 25వ తేదీన జరిగే బహిరంగ సభకు ప్రజలు కదిలి రావాలని కోరారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలం చెందుతున్నాయని అన్నారు కేంద్ర ప్రభుత్వం వచ్చిన నాటి నుండి నేటి వరకు పేదలకు వణుగోరింది ఏమీ లేదని పెట్టుబడిదారులు కార్పోరేట్ శక్తులకు మాత్రమే లాభం చేకూర్చాలని తెలిపారు.అడుగడుగునా జీఎస్టీ రూపాయి పతనం జీడీపీ లో వెనుకబతుతనం సాధించిన విజయలని ఇద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు కొండా అనురాధ సిపిఎం మండల కార్యదర్శి నాలుపరాజు సైదులు, మండల కమిటీ సభ్యులుపోలె సత్యనారాయణ, బొల్లు రవీందర్ కుమార్, శాఖ కార్యదర్శి పందుల బిక్షం పాల్గొన్నారు.



## పైప్ లైన్ ప్రాజెక్టు విషయంలో రైతులకు న్యాయం చేయాలి

- యువ రైతు కన్నీటి ఉసురు ఏ అధికారి వరకు పోయి ఆగును

**మునుగోడు, జనవరి 19(మనం న్యూస్):** కృష్ణపట్నం నుండి హైదరాబాద్ పైప్ లైన్ ప్రాజెక్ట్ ప్రైవేట్ దో, ప్రభుత్వందో పూర్తి వివరాలు తెలపమని మండల తహసీల్దార్ని విజ్ఞప్తి చేస్తూ కోరుతున్న రైతు.మండలంలోని కిష్టపురం గ్రామానికి చెందిన బోయలింగస్వామి ఏ ఏ సందర్భాలలో పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చే అధికారం ఉందో పూర్తి వివరాలను కోరుతున్న యువ రైతు రైతు లేనిదే రాజ్యం లేదంటారు అవన్నీ మాటల వరకేనా అని వివరణ కోరుతున్నను ఇట్టి పైప్ లైన్ ప్రాజెక్టు పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చిన విధంగానే తహసిల్దార్ కార్యాలయంలో ఉన్న సమస్యలపై ప్రొటెక్షన్ ఇచ్చి పరిష్కరించడం లేదు ఎందుకని వివరాలను తెలుపుతున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ సమస్యకైనా నోటీసు లేకుండా సమస్యను పరిష్కరించలేదు కానీ ఈ యువ రైతు సమస్యకు ఎలాంటి నోటీసు లేకుండా అలా ఎలా పోలీస్ ప్రొటెక్షన్ ఇస్తారని భావించారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఉన్న పాత పిటిషన్లను ప్రక్కన పెట్టి బదిలీపై కొత్తగా వచ్చిన ఎస్ఐ ఈ పైప్ లైన్ మీద దృష్టి ఎందుకు పెట్టినారు వివరణ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. యువరైతు కన్నీరు మున్నేరుగా తన బాధను ఈ విధంగా తెలియజేస్తున్నారు. సుమారుగా రెండు సంవత్సరాలక్రితం పైప్ లైన్ ప్రాజెక్ట్ వారు రైతుకి నోటీసు ఇచ్చి అభ్యంతరాలు తెలుపు గలరని ఇచ్చినారు.అట్టి నోటీసుకి రైతు అభ్యంతరాలు తెలిపినారు చట్టం ప్రకారం పోలీస్ ప్రొడక్షన్ ఇచ్చినారని రైతు వివరణ కోరుతున్నారు చట్టం ప్రకారం మీరు పోలీస్ ప్రొటెక్షన్ ఇచ్చినారు. అని రాతపూర్వకంగా రైతు అడగగా ఎలాంటి స్పందన లేకుండా తహసిల్దార్ రైతుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.కావున ఇప్పటికీ అతను ఇచ్చిన పోలీస్ ప్రొటెక్షన్ పై పూర్తి వివరణ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అలాగే ఈ సంఘటనకు ముందు ఈ సమస్య రాకముందే యువరైతు తన పంట నష్టం చేశారని పోలీస్స్టేషన్లో పిటిషన్ ఇచ్చి ఉన్నది.ఈ పిటిషన్ పట్టించుకోకుండా బదిలీపై వచ్చిన ఎస్ ఐ ఏమైనా పెండింగ్లో ఉన్న పిటిషన్ లు ఉన్నాయా అని చూడకుండానే రైతుకి నష్టం కలిగేలా ఎందుకు చేసినారో పూర్తి వివరాలను తెలపడం జరిగింది. రైతు పైప్ లైన్ వేయవద్దు అంటే ఇచ్చినారా లేదా పైప్ లైన్ కి భూమి ఇవ్వనంటే ఇచ్చినారా పూర్తి వివరాలను రాతపూర్వకంగా లేదా బహిర్గత స్టేట్మెంట్ ద్వారా వివరాలు తెలపాలని యువరైతే విజ్ఞప్తి చేస్తున్నారు.పైపులైన్ పోయే భూమిని రైతు ఎలాంటి నష్టపరిహారం లేకుండా ఇస్తానని పేపర్ స్టేట్మెంట్ ఇచ్చినారు. పైపులైన్ కి ఇరువైపులా 60 ఫీట్ల వెడల్పు భూమిని తీసుకుంటే రైతుకు ఎంత నష్టం జరుగుతున్నది అని ఆలోచన ఎందుకు చేయలేదని ప్రభుత్వ ఉద్యోగులని పూర్తి వివరణ తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నారు పైప్ లైన్ వేస్తున్న ఈ ప్రాజెక్టు వారు రైతులకు మాయమాటలు చెప్పి ప్రభుత్వ అధికారులను ప్రక్కదోవ పట్టించి చట్టానికి వ్యతిరేకంగా ఈ పైప్ లైన్ వేశారని యువరైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్‌కి జిల్లా పోలీస్ సూపర్ డెంట్ కి ఈ రాష్ట్ర ప్రభుత్వానికి రైతు వందనాలు తెలుపుతూ అంతఃకరణ శుద్ధితో విచారణ చేయాలని వేడుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బోయ లింగస్వామి, రైతులు, గ్రామస్తులు, తదితరులు, పాల్గొన్నారు.



## డప్పు మోగించాలంటున్నా మాదిగ జర్నలిస్టులు



- డప్పుతో దరువు వేద్దాం... ఎస్సీ వర్గీకరణ సాధిద్దాం
- హలో మాదిగ జర్నలిస్ట్ చలో హైదరాబాద్
- లక్ష డబ్బులు... వేయి గొంతులు సభకు తరలిరావాలి

**కోదాడ,జనవరి 19 (మనం న్యూస్):** హైదరాబాదులో ఫిబ్రవరి 7వ తారీకున లక్ష డప్పులు వెయ్యి గొంతుల సభకు మాదిగ జర్నలిస్టులందరూ హాజరుకావలని ఎంజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పిడమర్తి గాంధీ,రాష్ట్ర నాయకులు బంకా వెంకటరత్నం లు అన్నారు. మాదిగ జర్నలిస్టుల ఆధ్వర్యంలో స్థానిక బాయ్స్ హై స్కూల్ లో ఎంజెఎఫ్ రాష్ట్ర జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి నాగరాజు సభాధ్యక్షతన సమావేశము ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులు ఎంజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పిడమర్తి గాంధీ,రాష్ట్ర నాయకులు బంకా వెంకటరత్నం లు పాల్గొని మాట్లాడారు.లక్ష డప్పులు వేల గొంతుల మహా ప్రదర్శన కు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టు అత్యధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపుని పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలోనే వర్గీకరణ సాధకుడైన మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సమాజానికి డప్పు మాదిగ మేల్కొల్పుకోసం,అస్థిత్వ దరువులను మోగించాల ని అన్నారు. వర్గీకరణ సాధన త్వరిత గతిన అమలుజే యాలనే ఫిబ్రవరి 7న హైదరాబాద్ నగరం నడిబొడ్డున నిర్వహిస్తున్న లక్ష డప్పులు-వేల గొంతులై ఎం జె ఎఫ్ సూర్యాపేట జిల్లా తరపున వెయ్యి డప్పుల కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తూ విజయవంతం చేయాలన్నారు.అలాగే కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా మాదిగ జర్నలిస్టుల నూతన కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఈ సమావేశంలో తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రఘు పడిశాల ,మాతంగి సురేష్,చీమ చంద్రశేఖర్, ఏపూరి సునీల్,మందుల రాంబాబు, నేలమర్రి శ్రీకాంత్,తోళ్ల గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## కంటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మునుగోడు, జనవరి 19(మనం న్యూస్): మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రోజున నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి ఉచితంగా వైద్యం అందించి కనుచూపు మెరుగయ్యేలా లక్ష్యంగా కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, దీనికి ఫౌండేషన్ సౌజన్యంత ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఫ్లోరైడ్ పీడిత నియోజకవర్గమని కంటి సమస్యలు ఎక్కువని కంటి సమస్య వల్ల సొంత పని చేసుకోలేక ఇక్కడ ప్రజల కృంగిపోతున్నారని అటువంటి వారికి ఉచితంగా వైద్యం అందించి ఉచితంగా ఆపరేషన్లు చేయించి కనుచూపు మెరుగయ్యేంతవరకు విడతల వారీగా డాక్టర్లతో సమీక్ష చేయించి మందులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.ఏడు మండలాలు మున్సిపాలిటీలు కలుపుకొని ప్రతి నెల ఒక ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించేలా 9 నెలలు ప్రణాళికలు రూపొందిచామని అన్నారు. ఈ ఉచిత మెగా కంటి వైద్య శిబిరాలలో కంటి సమస్యలు ఉన్నవాళ్లు చూయించుకోవాలని నియోజకవర్గం ప్రజలను కోరారు. దాంట్లో భాగంగానే మొదటి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని 1000 నుండి 1200 మంది వరకు ఈ శిబిరంలో వైద్యం చేయించుకునేల ఏర్పాటు చేశామన్నారు. సామాజిక సేవ చేస్తున్న శంకర కంటి ఆసుపత్రికి ఫీనిక్స్ ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో. కోమటిరెడ్డి లక్ష్మి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, కాంగ్రెస్ జిల్లా యువజన నాయకులు మేకల ప్రమోద్ రెడ్డి, మండల నాయకులు, కంటి హాస్పిటల్ డాక్టర్లు, తదితరులు, పాల్గొన్నారు.

## క్లాత్ మర్చంట్ అధ్యక్షులుగా గడూరి కృపాకర్

**సూర్యాపేట, జనవరి 19 (మనం ప్రతినిధి):** సూర్యాపేట పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాలుగవ పర్యాయం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రముఖ వ్యాపారవేత గండేర్ కృపాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు గండూరి కృపాకర్ కు అభినందనలు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఏచూరి ముత్యాలమ్మ గుడి పక్కన గల గండూరి గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నందు పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించడం జరిగింది ఈ ఎన్నికలలో గండూరి కృపాకర్ నాలుగవ సారి పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులుగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అదేవిధంగా పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సింగిరికొండ ప్రదీప్ కుమార్, కోశాధికారి అనంతుల రాజేశ్వర్, ఉపాధ్యక్షులు గా గుండా మదుసూదన్, సాగిరాజు మదుసూదన్ రాజు, సయ్యద్ షఫి, సహాయ కార్యదర్శిగా బొమ్మగాని సైదులు, సంయుక్త కార్యదర్శి గా తేలుకుంట్ల చంద్రశేఖర్, దాసరి రమేష్, పిఆర్ వొ గా పాపని యాదగిరి లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా గండూరి క్రపాకర్ మాట్లాడుతూ తనను నాలుగవ సారి సూర్యాపేట పట్టణ క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. పట్టణంలోని క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఎల్లవేళలా అందరికి అందుబాటులో వుంటూ, అందరితో కలిసి పనిచేస్తానని అన్నారు. ఎన్నికల అధికారులుగా గండూరి శంకర్, సింగిరికొండ రవీందర్, మొరిశెట్టి కోటేశ్వరరావు, ఈగ వెంకటేశ్వర్లు, కర్నాటి సురేందర్ లు వ్యవహరించారు.



## వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం

- కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి వన్నెతేవాలి
- పార్టీలో పని చేసే నాయకులు కార్యకర్తలు అందరిని గుర్తిస్తాం
- మంత్రి ఉత్తమ్ ఎమ్మెల్యే పద్మావతి ల నాయకత్వంలో కోదాడ అభివృద్ధి
- కోదాడ వ్యవసాయ మార్కెట్ ను అందరం కలిసి అభివృద్ధి చేసుకుందాం....
- కాంగ్రెస్ సీనియర్ నేత ఎర్నేని వెంకటరత్నం బాబు



**కోదాడ,జనవరి 19 (మనం న్యూస్):** కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని కోదాడ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. ఆదివారం కోదాడలోని ఎర్నేని బాబు నివాసంలో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా చైర్మన్ గా ఎన్నికైన వేపూరి తిరుపతమ్మ సుధీర్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన షేక్ బషీర్ లకు ఏర్పాటుచేసిన అభినందన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.అందరము కలిసి కోదాడ వ్యవసాయ మార్కెట్ ని అభివృద్ధి చేసుకుందామన్నారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి ల ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గం అని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు.కోదాడ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఉన్న అనుభవంతో నూతన చైర్మన్ వైస్ చైర్మన్ లకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు పార్టీలో కష్టపడి పని చేసే కార్యకర్తలకు నాయకులకు తప్పకుండా గుర్తింపు ఇస్తామన్నారు.అనంతరం సన్మాన గ్రహీతలు చైర్మన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ వైస్ చైర్మన్ షేక్ బషీర్‌లు మాట్లాడుతూ తమకు ఇంత ఘనంగా సన్మానించిన మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు ఎర్నేని బాబు కు కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహాయ సహకారాలతో కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి చేస్తామన్నారు.తమకు పదవి కేటాయించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి,సహకరించిన సీనియర్ నాయకులకులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ జబ్బర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు,మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు,లారీ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాసరావు,కాంగ్రెస్ నాయకులు ఒంటి పులి వెంకటేష్,చింతలపాటి శ్రీనివాస్,రావెళ్ళ కృష్ణారావు,నలజాల శ్రీనివాస్,చందు నాగేశ్వరరావు,మందలపు శేషు,నెమ్మాది దేవమని ప్రకాష్ బాబు,కౌన్సిలర్లు గంధం యాదగిరి,వంటి పులి రమా శ్రీనివాస్,కోళ్ల ప్రసన్నలక్ష్మి కోటిరెడ్డి,పెండెం వెంకటేశ్వర్లు, కర్రీ శివ సుబ్బారావు, ఖదీర్,కాజా,కాంగ్రెస్ నాయకులు వేమూరి విద్యాసాగర్,యూత్ అధ్యక్షులు పోటు కోటేశ్వరరావు,లైటింగ్ ప్రసాద్,చింత బాబు మాదిగ,కాజా గౌడ్,గంధం పాండు,బొలిశెట్టి భాస్కర్ తదితరులు పాల్గొని సన్మానించారు.

## అర్వపల్లిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించవద్దని స్థానికుల నిరసన

**జాజిరెడ్డిగూడెం, జనవరి 19(మనం న్యూస్):** జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి లో ఫ్లైఓవర్ నిర్మించవద్దని అర్వపల్లి గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి దావుల వీర ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ అర్వపల్లి లో ఫ్లైఓవర్ నిర్మించడం వల్ల ఇల్లులు కోల్పోయి ప్రజలు రోడ్డున పడతారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరారు. గతంలో రోడ్డు విస్తరణ పనుల్లో ఇల్లులు కోల్పోయి నష్టపోయారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వీర పాపయ్య, పెద్దలు, నరేష్, శ్రీనివాస్, రామలింగం, వేణు తదితరులు పాల్గొన్నారు.



## బీసీ బిల్లు ప్రతిపాదన ఉత్తర్వులు జారీ చేసినందుకు



**సిరిసిల్ల, జనవరి 19 (మనం న్యూస్):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు మేకల పరశురాం ఆధ్వర్యంలో పార్లమెంట్ చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ కొరకు కేంద్ర సహాయ మంత్రి పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ ఇచ్చిన లేఖకు స్పందిస్తూ బీసీల రిజర్వేషన్ కోసం బీసీ బిల్లు పెట్టుటకు సానుకూలంగా స్పందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుని పెద్దోళ్ళ బాలయ్య ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గము మండల ప్రధాన కార్యదర్శిగా మామిండ్ల వెంకటేష్, ఉపాధ్యక్షులుగా బోయిన బాబు, కార్యదర్శిగా కోరే దేవ దానం, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నేతట్ల అనిల్ వీరికి ఒక పత్రం అందజేయడం జరిగింది.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- హుజూర్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి
- ఇందిరమ్మ హౌసింగ్ కాలనీకి అన్ని మౌలిక సదుపాయాలు
- రాష్ట్రంలోనే ఒక మోడల్ కాలనీగా ఇందిరమ్మ మోడల్ కాలనీ
- నియోజకవర్గ వ్యాప్తంగా డబుల్ రోడ్లు,సాగునీరు, త్రాగునీరు అందించడమే నా ధ్యేయం
- రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి





**హుజూర్ నగర్, జనవరి 19 (మనం న్యూస్):** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,హుజూర్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం హుజూర్ నగర్ నియోజకవర్గంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పాలకీడు మండలంలోని జాన్ పహాడ్ దర్గాను సందర్శించి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని జాన్ పహాడ్ దర్గాలో వార్షిక ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.జనవరి 24,25 తేదీల్లో జరిగే ఉర్సు ఉత్సవాల్లో లక్షలాది మంది భక్తులు హిందువులు, ముస్లింలు దర్గాను సందర్శిస్తారని,జిల్లా యంత్రాంగం అన్ని భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని,భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. అనంతరం హుజూర్ నగర్ పట్టణంలోని ఇందిరమ్మ మోడల్ కాలనీ వద్ద 14 కోట్ల రూపాయలతో నిర్మించ నున్న ఐటిఐ బిల్డింగ్ శంకుస్థాపన చేశారు.హౌసింగ్ కాలనీ పనులను పరిశీలించి అన్ని బ్లాకులను పనులు పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. మోడల్ కాలనీ పనులు త్వరిత్వరగతిన పూర్తి చేయాలని మంత్రి తెలిపారు.హుజూర్ నగర్ మండలంలోని లింగగిరి గ్రామంలో లింగగిరి నుండి కల్మల్ చెరువు వరకు 26 కోట్ల రూపాయలతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే అమరవరం గ్రామంలో అమరవరం నుండి అలింగాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 23 కోట్లతో జరిగే రోడ్డు పనులకు శంకు స్థాపన చేశారు.మఠంపల్లి మండలం చౌటపల్లి గ్రామం లో మేళ్లచెరువు నుండి చౌటపల్లి వరకు 10 కోట్ల రూపాయలతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు.అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శ కాలనీగా హుజూర్ నగర్ ఇందిరమ్మ మోడల్ కాలనీని తీర్చిదిద్దుతానని,మోడల్ కాలనీకి అన్ని మౌలిక వసతులు కల్పించి అన్ని పనులు పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అన్నారు.మోడల్ కాలనీ గత 10 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోలేద న్నారు.జాన్ పాడు,పాలకీడు మండలాలలో 5,560 ఎకరాలకు సాగునీరు అందించడం కొరకై 120 కోట్లతో జరుగు తున్న లిఫ్టు పనులను పరిశీలించడమైనదని పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు మంత్రి ఆదేశించారు.హుజూర్ నగర్ నియోజకవర్గంలోని చదువుకున్న యువత కొరకు 40 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ పనులు ప్రారంభించామని,ప్రస్తుతం 14 కోట్లతో బేసిక్ ఐటిఐ బిల్డింగ్ కొరకు శంకుస్థాపన చేసుకున్నామని, ఎంతో మంది యువత ఉద్యోగాలు పొందగలుగుతారని మంత్రి అన్నారు.విద్యా ,వైద్యం,విద్యుత్తు,అన్ని విషయాలలో ముందుకు పోతున్నామని హుజూర్ నగర్ నియోజక వర్గాన్ని రాష్ట్రంలోని ప్రధమ స్థానంలో నిలుపుతానని మంత్రి తెలిపారు.లింగగిరి నుండి కల్మల్ చెరువు వరకు 13 కిలోమీటర్ల రోడ్డు 26 కోట్ల రూపాయలతో నిర్మించ నున్నట్లు ఈ రోడ్డు వలన లింగగిరి,సర్వారం,గానుగ బండ,గార కుంటతండా, చిన్న చిన్న తండాలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మంత్రి తెలిపారు.హుజూర్ నగర్ నియోజకవర్గంలో ఎక్కడ కూడా సింగిల్ రోడ్డు ఉండకూడదు అన్ని డబుల్ రోడ్లు గా నిర్మించి ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ మా ట్లాడుతూ ప్రజా పాలనలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాలు ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇల్లు,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,రైతు భరోసా,పథకాలకు క్షేత్రస్థాయిలో అధికారు లు సర్వే నిర్వహించారని లబ్ధిదారుల పేర్లను జాబితా ను జనవరి 21 నుంచి 24 తారీకు వరకు జరిగే గ్రామ సభలలో ప్రదర్శిస్తారని జాబితాలో తమ పేర్లు లేని యెడల ఆందోళన చెందాల్సినఅవసరంలేదని గ్రామ సభలో దరఖాస్తులు అందజేయవచ్చని కలెక్టర్ తెలిపారు.రేషన్ కార్డు జారీకి సంబంధించి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు కార్డులు అందజేస్తామని అన్నారు. గ్రామ సభల్లో,ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించిన వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు అందజేస్తామని పేర్కొన్నారు.గ్రామ సభలలో మీ అభిప్రాయాలను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భూమిలేని కూలీలు ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పాటు పనికి వెళ్లిన వారే అర్హులని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు,మండల అధికారులు అందుబాటు లో ఉంటారని,సమస్యలు ఉంటే ప్రజలు వారిని అడిగి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.జనవరి 26 నుండి 4 పథకాలు అమలు పరుస్తామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల కొరకు ఇల్లు లేని వారు గ్రామసభలో దరఖాస్తులు పెట్టుకోవచ్చు అని తెలిపారు.గ్రామ సభలలో ప్రజాభి ప్రాయాలు పరిగణములోకి తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, ఆర్డీవో శ్రీనివాసులు,తహసీల్దార్ మందాడి నాగార్జున రెడ్డి,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి,డీఎస్పీ శ్రీధర్ రెడ్డి,సిఐ చరమందరాజు,సాముల శివారెడ్డి,ఎండి నిజాముద్దీన్,ఎరగాని నాగన్న,మాజీ ఎంపీపీలు భూక్య గోపాల్,గూడెపు శ్రీనివాస్,మాజీ జెడ్పీటిసి బానోతు మోతిలాల్,పెండెం శ్రీనివాస్,చాంద్ మియా,మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి,పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్,కట్టా గోపాలరావు,తదితరులు, పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుంది

- రేషన్ కార్డు దరఖాస్తులు గ్రామ సభల్లోనూ తీసుకోవడం జరుగుతుంది
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి, జనవరి 19(మనం న్యూస్):** అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డు అందజేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డు జారీకి సంబంధించి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి పథకాలు అందజేయడం జరుగుతుందని రాలేదని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభల్లో, వార్డుల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్న వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. ఇప్పుడు కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో విభజన అయినవారు కొత్త కార్డు కోసం చేసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని అన్నారు. ఇదివరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పించక పోయినా నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో కూడా దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు.

## నేడు ప్రజావాణి రద్దు

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్, జనవరి 19(మనంన్యూస్):** జనవరి 20వ తేదీ (సోమవారం) వరంగల్ కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు స్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలిపారు. జిల్లాలో రైతు భరోసా, నూతన రేషన్ కార్డులు సర్వే ప్రక్రియలో, ఈ నెల 21వ తేది నుండి జరుగనున్న గ్రామసభలు నిర్వహణ విధులలో జిల్లా, మండల స్థాయి అధికారులు నిమగ్నమై ఉన్నందున తాత్కాలికంగా రద్దు చేసినట్లు , ఇట్టి విషయాన్ని గమనించి జిల్లా నలుమూలల నుండి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని తెలిపారు.

## ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

- వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యరాణి



**పర్వతగిరి, జనవరి 19, మనం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యరాణి ఆదేశించారు. పర్వతగిరి ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం ప్రభుత్వ పథకాల సర్వే తీరుపై మండలంలో ఏర్పాటు చేసిన ఏడు టీం లీడర్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతు ఈనెల 26 నుంచి ప్రారంభించనున్న పథకాలను రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలన్నారు. గ్రామాల్లో గ్రామసభలు, వార్డుసభలు నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలు వెల్లడించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జిల్లా పంచాయతీ అధికారి కల్పన,ఎంపిడిఓ శంకర్ నాయక్ ,తహశీల్దార్ వెంకటస్వామి , ఎంపీఓ పాక శ్రీనివాస్ , ఏంఏవో ప్రశాంత్ ,గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు, ఇతర మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నల్గొండలో జరిగే కేటీఆర్ సభను విజయవంతం చేయాలి



**జాజిరెడ్డిగూడెం, జనవరి19, మనం న్యూస్:** ఈనెల 21న నల్లగొండ జిల్లా కేంద్రంలో కేటీఆర్ హాజరయ్యే రైతు మహాధర్నా ను విజయవంతం చేయాలి తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మోరిశెట్టి ఉపేందర్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేలా ధర్నా వుంటుందనారు. ఓటుకు నోటు కేస్ లో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి.. అడ్డగోలుగా హామీలు ఇచ్చి అందరిని మోసం చేస్తూ వస్తున్నాడన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులు ప్రస్టేషన్ లో బీఆర్ఎస్ కార్యాలయలాలపై భౌతిక దాడులు చేస్తున్నారు.. మేము తల్చుకుంటే కాంగ్రెసు నాయకులు ఒక్కడు కూడా మిగలడన్నారు. మేము అధికారంలో ఉన్నప్పుడు అందరిని గౌరవించాము, సహనంతో గౌరవంగా అందరిని అక్కున చేర్చుకు న్నామన్నారు. మిటింగ్ ఏది పెట్టినా కేసీఆర్ గారిని తిట్టడమే పనిగా పెట్టుకున్నాడు రేవంత్ ...ముఖ్యమంత్రి అయినంక కూడా బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. డవర్షన్ పాలిటిక్స్ లో భాగంగానే వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఈ కార్ రేస్ కేసు పెట్టారు... బీజేపీ తో కుమ్మక్కై కేటీఆర్ పై కేస్ పెట్టారు. రేవంత్ రెడ్డి అంటేనే మోసం దగా,, ప్రజలకు రేవంత్ పై విశ్వాసం కోల్పోయారన్నారు. 15 వేలు రైతు భరోసా ఇస్తా అన్నారు మాట తప్పారు... ముఖ్యమంత్రి హోదాలో కూడా రేవంత్ దొంగ చెక్కులు ఇచ్చి పచ్చి మోసం చేసాడని వాపోయారు. రుణమాఫీ అంతా బోగస్.. అన్ని అబద్ధాలే.. 6 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి తప్ప అవి నింపే దమ్ము కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సోమేశ్ గౌడ్, మాజీ జడ్పిటిసి దావుల వీరప్రసాద్ యాదవ్, మాజీ ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీ నరసయ్యాయాదవ్, టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మోరిశెట్టి ఉపేందర్, బొడ్డు రామలింగయ్య, శేఖర్ రెడ్డి, పి.పాక సైదులు, పున్నా ప్రసాద్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్దెల రాంబాయి మృతి బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

**కోదాడ,జనవరి 19(మనం న్యూస్):** కోదాడ మున్సిపల్ పరిధిలోని తమ్మర గ్రామానికి చెందిన సిద్ధెల రాంబాయి మృతి బాధాకరమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సిద్ధెల రాంబాయి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు.ఈ సందర్భంగా ఆదివారం తమ్మర గ్రామంలోని మృతురాలి నివాసగృహానికి వెళ్లి పార్థివ దేహం పై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించా రు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంబాయి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతు ని ప్రార్థించినట్లు తెలిపారు.రాంబాయి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిద్దెల వెంకటరమణ శ్రీనివాసరావు, గుండె రాజేష్,బొజ్జ గోపి,ఇమ్రాన్ ఖాన్,కుటుంబ సభ్యులు కుమారులు సిద్ధెల శ్రీనివాసరావు సరిత, ప్రసాద్ నాగమణి,కుమార్తెలు ముత్యాలమ్మ వెంకటేశ్వర్లు ,నాగమణి శివయ్య బంధువులు పాల్గొన్నారు.



## టీయూడబ్ల్యూజే143 జిల్లా ఉపాధ్యక్షునిగా పోలగోని లక్ష్మీకాంత్ నియామకం



**నల్లగొండ, జనవరి19(మనం న్యూస్):** టీయూడబ్ల్యూజే 143 నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా మునుగోడు మండలంలోని చీకటి మామిడి రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన పోలగోనీ లక్ష్మీకాంత్ నీ నీయమిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్ తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీకాంత్ కు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గట్టుప్పల్ ఆంధ్రజ్యోతి విలేఖరిగా పనిచేస్తున్న లక్ష్మీకాంత్ అనుభవాన్ని సంఘం బలోపేతానికి వినియోగించు కోవాలని ఉపాధ్యక్షునిగా నియమిం చినట్లు ఆయన తెలిపారు. నల్లగొండ జిల్లాలో యూనియన్ బలోపేతానికి జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంతో పాటు జిల్లాలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతోపాటు సంఘం బలోపేతాని కి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో. రాంప్రసాద్,శివ ,సల్వాది జానీ, దండెంపల్లి రవికుమార్ గౌడ్ ,సీనియర్ జర్నలిస్టు లు కోడి రాములు, కుంభం ఇంద్రసేనారెడ్డి, మేడి అశోక్, జీడిమడ్ల బాబు, రెడ్డి మల్ల వెంకట్, జిట్టగోని వెంకటేష్,దుబ్బ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఇన్స్పిరేషనల్ ఉపాధ్యాయురాలు

## అవార్డు అందుకున్న నిర్మల

**భువనగిరి ప్రతినిధి, జనవరి 19(మనం న్యూస్):** శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్ ఇండియా ఉమెన్ ఇన్స్పిరేషన్ లో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, మాగ్దూంపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు కు సౌత్ ఇండియా ఉమెన్ ఇన్స్పిరేషన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. సౌత్ ఇండియా ఉమెన్ ఇన్స్పిరేషన్ అవార్డుల వేడుకను పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ లక్డికాపుల్ లో బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో వి నిర్మల ఎస్.ఎ ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు సినీ హీరోయిన్ కవిత చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.




## ప్రతి లబ్ధిదారుని వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి

- సర్వేను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్, జనవరి 19(మనంన్యూస్):** రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హత కలిగిన లబ్ధిదారులను అందించేందుకు సర్వే లో తప్పులు లేకుండా బాధ్యతతో పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. ఆదివారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి, ఉకల్ హావేలి గ్రామాల్లో, దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామం లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేను జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్ర స్థాయిలో సర్వే బృందాల పనితీరును తనిఖీ చేసి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా పకడ్బందీగా సర్వేను చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధికారులను ఆదేశించారు. ప్రతి లబ్ధిదారుని వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన డేటాను సక్రమంగా నమోదు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి, వారికి ఉన్న వ్యవసాయ భూమి, కుటుంబ సభ్యుల వివరాలు, పథకాలకు అర్హత వంటి అంశాలను కలెక్టర్ సర్వే బృందాలతో కలిసి పరిశీలించారు. సర్వే ప్రక్రియలో ప్రజలను స్థానిక నాయకులను భాగస్వాములుగా చేసి, ప్రజలతో నేరుగా మమేకమవడం ద్వారా తగిన సమాచారం సేకరించాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరేలా చూడటమే మన కర్తవ్యమని కలెక్టర్ అన్నారు.సర్వేలో జాప్యం లేకుండా త్వరితగతిన సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.రైతు భరోసా పథకం ద్వారా చిన్న రైతులకు, పేద రైతులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో గృహిణులకు నివాసాలను అందజేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోం దన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సంక్షేమాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి నుండి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు రైతు భరోసా , ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంధిస్తామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో, మునిసిపల్ వార్డులలొ పరిశీలనకు వచ్చే అధికారులు, సిబ్బందికు, పంచాయతీలలో నిర్వహిస్తున్న గ్రామసభల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరి నుండి దరకాస్తుల స్వీకరిస్తామని, గతంలో ప్రజా పాలన కార్యక్రమంలో తెల్ల పేపర్ పై స్వీకరించిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, పరిగణనలోకి తీసుకుంటామని, మిస్ అయిన దరఖాస్తుదారుడు గ్రామ సభలో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. నాలుగు పథకాల అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈనెల 26వ తేదీ నుండి అమలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అసత్య ప్రచారాలకు ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ కోరారు. ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హత కలిగి దరకాస్తూ చేయని వారు దరకాస్తూ చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఓ రామ్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, మండల ప్రత్యేక అధికారులు, ఎమ్మార్వోలు , ఎంపిడిఓ లు తదితరులు ఉన్నారు.

## ఆర్కే హాస్పిటల్ ఆధ్వర్యంలో పల్లెపల్లెకు వైద్యం

- పెద్ద పల్గు తండాలో ఉచిత వైద్య శిబిరం




**భువనగిరి, జనవరి 19(మనం న్యూస్):** భువనగిరి పట్టణంలోని శ్రీ ఆర్కే మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పల్లె పల్లెకి వైద్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 116 వ ఉచిత మెగా వైద్య శిబిరం బీబీనగర్ మండలంలోని పెద్ద పలుగు తండాలో నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని స్వచ్ఛందంగా గ్రామ ప్రజలు బానోతు లక్ష్మణ్, బానోతు శ్రీను, మరియు బానోతు శివరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నందు గ్రామ ప్రజలకు వివిధ రకాలైన దీర్ఘకాలిక సమస్యలను గురించి వివరించారు. అదేవిధంగా గ్రామాలలో ప్రజలకు ఆరోగ్యం పట్ల ఉన్న వివిధ రకాలైన అపనమ్మకాలను గురించి వారికి క్లుప్తంగా వివరించారు. మరియు గ్రామాల్లోని ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ గ్రామం పట్ల శ్రద్ధ వహించి ఇటువంటి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు డాక్టర్ క్యాంప్ ఆర్గనైజ్ చేసిన లక్ష్మణ్ శివరాం మరియు శ్రేణులను అభినందించారు. తదనంతరం గ్రామ ప్రజలకు బిపి, షుగర్, బిఎండి, న్యూరోపతి మొదలగు పరీక్షలు నిర్వహించి డాక్టర్ సలహా మేరకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలియజేశారు.



అండర్-19 ప్రపంచకప్

# వెస్టిండీస్‌ను చిత్తు చేసిన భారత అమ్మాయిలు

అండర్-19 మహిళల టీ20 వరల్ కప్-2025లో భారత్ బోణీ కొట్టింది. కౌలాలంపూర్ వేదికగా వెస్టిండీస్ తో ఇవాళ (జనవరి 19) జరిగిన మ్యాచ్ లో భారత్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ ను భారత బౌలర్లు 44 పరుగులకే (13.2 ఓవర్లలో) కుప్పకూల్చారు.
పరుణిక సిసోడియా మూడు, ఆయుశి శుక్లా, జోషిత్ వీజే తలో రెండు వికెట్లు పడగొట్టారు. ముగ్గురు విండీస్ బ్యాటర్లు రనౌటయ్యారు. విండీస్ ఇన్నింగ్స్ లో అసాబి ఖలందర్ (12), కేనిక కస్సార్ (15) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ఏకంగా ఐదుగురు విండీస్ బ్యాటర్లు డకౌటయ్యారు.
45 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గొంగడి త్రిష 4 పరుగులు చేసి ఔట్ కాగా.. జి కమలిని (16), సనికా ఛల్కే (18) భారత్ ను విజయతీరాలకు చేర్చారు. విండీస్ బౌలర్ క్లాక్స్టన్ కు త్రిష వికెట్ దక్కింది. కాగా, ప్రస్తుత వరల్ కప్ లో భారత్.. శ్రీలంక, మలేసియా, వెస్టిండీస్ తో కలిసి గ్రూప్-ఏలో పోటీ పడుతుంది.
గ్రూప్-ఏలో భాగంగా ఇవాళే మరో మ్యాచ్ జరిగింది. మలేసియాపై శ్రీలంక 139 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. లంక బ్యాటర్లలో దహామి సనేత్మ (55) అర్ధ సెంచరీతో రాణించింది.
163 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మలేసియా 23 పరుగులకే ఆలౌటైంది. మలేసియా ఇన్నింగ్స్ లో ఒక్కరు కూడా రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. లంక బౌలర్లలో చమోది ప్రబోద (4-2-5-3) అత్యంత పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు మూడు వికెట్లు తీసింది.
ఈ టోర్నీలో భారత్ జనవరి 21న (మలేసియాతో) తమ తదుపరి మ్యాచ్ ఆడుతుంది. జనవరి 23న భారత్.. శ్రీలంకతో తమ చివరి గ్రూప్ స్టేజీ మ్యాచ్ ఆడుతుంది.

## షకీబ్‌కు బంగ్లా కోర్టు అరెస్టు వారెంట్..!

బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ కు కష్టకాలం నడుస్తోంది. దేశ, విదేశీ బోర్డులకు సంబంధించి లీగుల్లో అతడు బౌలింగ్ చేయకుండా ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ మండలి నిషేధం విధించిన సంగతి తెలిసిందే. తాజాగా అతడికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బంగ్లాదేశ్ న్యాయస్థానం షకీబ్ పై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఐఎఫ్ఐసీ బ్యాంకుకు సంబంధించి మూడు లక్షల డాలర్ల చెక్ బౌన్స్ కేసులో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని కోర్టు షకీబ్ పై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ కేసులో భాగంగా కోర్టు ఎదుట హాజరు కావాలని గతంలో అతడికి సమన్లు జారీ చేసింది. కానీ, షకీబ్ స్పందించలేదు. దీంతో ఆయనపై అరెస్టు వారెంట్ జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. షకీబ్ తో పాటు మరో వ్యక్తిపై కూడా అరెస్టు వారెంట్ జారీ అయింది. కాగా.. విద్యార్థుల ఆందోళనలతో షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ప్రధాని పదవికి రాజీనామా చేసి ఆమె దేశాన్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె ప్రభుత్వంలో ఎంపీగా పని చేశాడు షకీబ్. బంగ్లాలో ఉద్రికత్త సమయంలో కెనడాలో జరిగిన ఓ మ్యాచ్ లో పాల్గొన్నాడు. నాటి నుంచి ఇప్పటివరకు దేశానికి తిరిగి రాలేదు. అయితే.. ఇటీవల మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ కు రెండు షాక్ లు తగిలాయి. తొలుత ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు అతడి బౌలింగ్ పై నిషేధం విధించగా.. అంతర్జాతీయ క్రికెట్ మండలి కూడా బ్యాన్ విధించింది. దేశ, విదేశీ బోర్డులకు సంబంధించి లీగుల్లో అతడు ఆడకుండా నిషేధించింది.

# ఖోఖో ప్రపంచకప్ విజేతగా భారత మహిళల జట్టు

ఖోఖో ప్రపంచకప్ లో భారత అమ్మాయిల జట్టు ఛాంపియన్ గా నిలిచింది. ఆదివారం ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్ లో భారత్ 78-40తో నేపాల్ ను చిత్తు చేసింది. ఖోఖో ప్రపంచ కప్ ను నిర్వహించడం ఇదే తొలిసారి కావడం విశేషం. తుది పోరు టర్న్1లో భారత్ దూకుడుగా ఆడి 34-0తో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. తర్వాత నేపాల్ పుంజుకోవడంతో 35-24తో రెండో టర్న్ ముగిసింది. మూడో టర్న్ లో భారత్ మళ్లీ దూకుడు పెంచి వరుసగా పాయింట్లు సాధించి ఆధిక్యాన్ని 49కి పెంచుకుంది. చివరి టర్న్ లో నేపాల్ 16 పాయింట్లు సాధించడంతో 38 పాయింట్లతో భారత్ ఘన విజయం సొంతం చేసుకుంది.



## ఖోఖో పురుషుల తొలి ప్రపంచకప్ భారత్‌దే

ఖోఖో మహిళల ప్రపంచకప్ ను సొంతం చేసుకున్న భారత్.. అదే జోరు కొనసాగించి.. పురుషుల



ప్రపంచ కప్ ను కూడా కైవసం చేసుకుంది. ఢిల్లీ వేదికగా నేపాల్ తో జరిగిన ఫైనల్ పోరులో పురుషుల జట్టు విజయఢంకా మోగించింది. 54-36 తేడాతో ఆ జట్టును చిత్తు చేసింది. తొలి రౌండ్లో 26 -18 ఆధిక్యంతో నిలిచిన భారత్ అదే జోరును చివరి వరకు కొనసాగించింది. మూడో రౌండ్ ముగిసే సమయానికి 56-18 లీడ్ లోకి వెళ్లింది. అయితే, నాలుగో రౌండ్ లో అటాకింగ్ కు దిగిన నేపాల్ 37 పాయింట్లు సాధించాల్సి ఉండగా.. కేవలం మరో 18 పాయింట్లు మాత్రమే రాబట్టగలిగి 36 వద్ద చేతులెత్తేసింది.దీంతో భారత్ కప్ ను సొంతం చేసుకుంది. అయితే, ఇక్కడ మహిళల, పురుషుల ప్రత్యర్థి జట్లు నేపాల్ వే కావడం గమనార్హం. మరోవైపు తొలిసారిగా నిర్వహించిన ఖోఖో ప్రపంచకప్ లో భారత అమ్మాయిల జట్టు ఛాంపియన్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్ లో భారత్ 78-40తో నేపాల్ ను చిత్తు చేసింది.

## కర్ణాటకదే విజయ్ హజారే

విజయ్ హజారే వన్డే టోర్నమెంట్లో కర్ణాటక విజేతగా నిలిచింది. మయాంక్ అగర్వాల్ సారథ్యంలోని జట్టు శనివారం ఫైనల్లో 36 పరుగుల తేడాతో విదర్భను ఓడించింది. మొదట కర్ణాటక 6 వికెట్లకు 348 పరుగులు చేసింది. ఛేదనలో విదర్భ పోరాడినా.. 48.2 ఓవర్లలో 312 పరుగులకే ఆలౌటైంది. అంతకుముందు రవిచంద్రన్





స్మరణ్ (101; 92 బంతుల్లో 7X4, 3X6) సెంచరీతో కర్ణాటక భారీ స్కోరు చేసింది. 67కే 3 వికెట్లు కోల్పోయిన జట్టును స్మరణ్ ఆదుకున్నాడు. అభినవ్ మనోహర్ (79), శ్రీజిత్ (78) తోడుగా జట్టును మంచి స్థితికి చేర్చాడు. ఆఖర్లో అభినవ్ దూడుకుగా ఆడడంతో స్కోరు 340 దాటింది. ఛేదనలో విదర్భ కూడా 88/2తో తడబడింది. ఈ టోర్నీలో అదిరే ఫామ్ లో ఉన్న కరుణ్ నాయర్ (27), యశ్ రాథోడ్ (22) త్వరగా ఔటయ్యారు. కానీ ఓపెనర్ ధ్రువ్ షోరె (110; 111 బంతుల్లో 8X4, 2X6) పోరాడాడు. అతడికి హర్ష దూబె (63; 30 బంతుల్లో 5X4, 5X6) మెరుపులు తోడవడంతో ఒక దశలో విదర్భకు విజయవకాశాలు కనిపించాయి. కానీ సెంచరీ తర్వాత ధ్రువ్ పెవిలియన్ చేరడంతో ఆ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. భారీ షాట్లతో హర్ష దూబె ఆశలు రేపినా.. అతడు ఆఖరి వికెట్ రూపంలో నిష్క్రమించడంతో విదర్భకు నిరాశే మిగిలింది. వాసుకి కౌశిక్ (3/47), ప్రసిద్ధ్ కృష్ణ (3/84), అభిలాష్ శెట్టి (3/58) విదర్భకు కళ్లెం వేశారు. విజయ్ హజారే ట్రోఫీ గెలవడం కర్ణాటకకు ఇది అయిదోసారి. ఆ జట్టు చివరగా 2019-20 సీజన్లో ఈ టోర్నీ విజేతగా నిలిచింది.
కర్ణాటక: 348/6 (రవిచంద్రన్ స్మరణ్ 101, అభినవ్ మనోహర్ 79, శ్రీజిత్ 78, మయాంక్ అగర్వాల్ 32)
విదర్భ: 312 ఆలౌట్ (ధ్రువ్ షోరె 110, హర్ష్ దూబె 63, జితేశ్ శర్మ 34, కరుణ్ నాయర్ 27; వాసుకి కౌశిక్ 3/47, ప్రసిద్ధ్ కృష్ణ 3/84, అభిలాష్ శెట్టి 3/58)

మనం మూవీ+ manammovie





## హీరోల్లో రెబల్ స్టార్ టాప్ హీరోయిన్లలో ఎవరంటే?

ప్రముఖ ఆర్మాక్స్ మీడియా ప్రతినెల సినీ స్టార్లకు సంబంధించిన ర్యాంకులను ప్రకటిస్తూ ఉంటుంది. ఎప్పటికప్పుడు దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో ఉన్న స్టార్ల జాబితాను వెల్లడిస్తుంది. అంతేకాకుండా మోస్ట్ అవైటెడ్ చిత్రాల వివరాలు కూడా ప్రకటిస్తుంది. తాజాగా డిసెంబర్ నెలకు సంబంధించిన వివరాలను ట్విటర్ వేదికగా పోస్ట్ చేసింది. డిసెంబర్-2024లో ఇండియాలో అత్యంత ఆదరణ ఉన్న హీరో, హీరోయిన్లు జాబితాను వెల్లడించింది.

**హీరోల్లో మొదటి ప్లేస్లో రెబల్ స్టార్..**

హీరోల విషయానికొస్తే దేశవ్యాప్తంగా అత్యంత ఆదరణ ఉన్న స్టార్స్ లో రెబల్ స్టార్ ప్రభాస్ నిలిచారు. ఆ తర్వాత రెండో స్థానంలో పుష్పరాజ్ అల్లు అర్జున్ చోటు దక్కించుకున్నారు. వీరిద్దరి తర్వాత మూడో ప్లేస్ లో దళపతి విజయ్ ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో వరుసగా బాలీవుడ్ బాద్షా షారూక్ ఖాన్, జూనియర్ ఎన్టీఆర్, అజిత్ కుమార్, మహేశ్ బాబు, రామ్ చరణ్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ టాప్-10 లిస్ట్ లో ఛాన్స్ కొట్టేశారు.

**హీరోయిన్లలో సమంత టాప్..**

హీరోయిన్ల విషయానికొస్తే సమంత టాప్ ప్లేస్ లో ఉంది. ఆ తర్వాత బాలీవుడ్ భామలు ఆలియా భట్, దీపికా పదుకొణె వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఆ తర్వాత వరుసగా పుష్ప భామ రష్మిక మందన్నా, తండేల్ హీరోయిన్ సాయి పల్లవి, త్రిష, నయనతార, కాజల్ అగర్వాల్, శ్రీలీల, శ్రద్ధాకపూర్ ఉన్నారు. ఈ జాబితాలను హీరో, హీరోయిన్ల క్రేజ్, ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఆధారంగానే వెల్లడించినట్లు తెలుస్తోంది.

## వివాదాస్పద సీన్.. స్పందించిన అభినయ

'శంభో శివ శంభో'తో తెలుగు వారికి చేరువైన నటి అభినయ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా మలయాళ చిత్రం 'పని'. నటుడు జోజూ జార్జ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రస్తుతం ఓటీటీ వేదికగా అందుబాటులో ఉంది. ఇందులో హీరోయిన్ పై చిత్రీకరించిన అత్యాచార సన్నివేశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. జోజూ జార్జ్ మేకింగ్ ను పలువురు తప్పుపట్టారు. దీనిపై తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అభినయ స్పందించారు. దివ్యాంగురాలైన ఆమె.. సైన్ లాంగ్వేజ్ తో తన అభిప్రాయాన్ని తెలిపారు. ''తన సినిమాలో ఎలాంటి సన్నివేశాలు పెట్టాలి? ఎలా తెరకెక్కించాలి? అనేది పూర్తిగా దర్శకుడి నిర్ణయం. కాబట్టి దాని గురించి నేను పెద్దగా ఏమీ మాట్లాడాలనుకోవడం లేదు. ఏది ఏమైనా దర్శకుడి మాటే తుది నిర్ణయం. జోజూ గొప్ప నటుడు. ఎన్నో భాషల్లో, ఎంతోమంది పేరు పొందిన దర్శకులతో వర్క్ చేసిన అనుభవం ఆయన సొంతం'' అని అభినయ తెలిపారు. మిగిలిన భాషలతో పోలిస్తే మలయాళంలో యాక్ట్ చేయడం కాస్త భిన్నమైన అనుభూతిని అందించిందని ఆమె చెప్పారు. చిత్రీకరణ సమయంలో జోజూ తనకు ఎంతో సాయం చేశారన్నారు.



## ఈ నెలాఖరు నుంచి 'బన్నీ' సినిమా షురూ?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్ తో కొత్త ప్రాజెక్ట్ ను ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఐతే, ఈ సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది?, ఎప్పుడు రిలీజ్ కాబోతుంది? అంటూ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమా పై మరో క్రేజీ గాసిప్ వినిపిస్తోంది. ఈ మూవీ ఈ నెలాఖరు నుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. బన్నీ న్యూలుక్తో ఓ స్పెషల్ అనౌన్స్మెంట్ వీడియోను కూడా రిలీజ్ చేస్తారని టాక్ నడుస్తోంది. ఇక ఈ వీడియోలో హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను రివీల్ చేయరట. ఆ వివరాలను త్వరలో వెల్లడిస్తారని తెలుస్తోంది. కాగా జులాయి, సన్ ఆఫ్ సత్యమూర్తి, మరియు అల వైకుంఠపురములో వంటి సూపర్ హిట్ల తర్వాత, అల్లు అర్జున్ - త్రివిక్రమ్ మరోసారి జత కట్టారు. ఈ సినిమాని 300 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించనున్నారట. మొత్తానికి తమ నాలుగో చిత్రాన్ని త్రివిక్రమ్ - బన్నీ చాలా గ్రాండ్ గా ప్లాన్ చేశారు. హారిక హాసిని క్రియేషన్స్ మరియు గీతా ఆరట్స్ కలిసి ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించనున్నాయి. ఈ సినిమాకి సంగీత దర్శకుడు థమన్ సంగీతం అదించబోతున్నాడు.



## వరుణ్ తేజ్ బర్త్‌డే.. ఆ దర్శకుడితో కొత్త ప్రాజెక్ట్

సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న నటుడు వరుణ్ తేజ్ భిన్నమైన కాన్సెప్ట్ తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. దర్శకుడు మేర్లపాక గాంధీతో కొత్త సినిమాకు సంతకం చేశారు. ఆదివారం వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ ప్రాజెక్ట్ వివరాలను ప్రకటించింది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్ టైన్ మెంట్స్ సంయుక్తంగా దీనిని నిర్మిస్తున్నాయి. 'ఇండో - కొరియన్ హారర్ కామెడీ ఫిల్మ్'గా ఇది రూపుదిద్దుకోనుంది. తమన్ స్వరాలు అందించనున్నారు. వరుణ్ తేజ్ 15వ చిత్రంగా తెరకెక్కనుంది. 'ఎక్స్ ప్రెస్ రాజా', 'వెంకటాద్రి



ఎక్స్ ప్రెస్', 'ఏక్ మినీ కథ' వంటి చిత్రాలను మేర్లపాక గాంధీ తెరకెక్కించిన విషయం తెలిసిందే.



## నాకు నచ్చినట్లు ఉంటా - సానియా

సానియా అయ్యప్పన్.. నర్తకిగా అడుగుపెట్టి నటిగా స్థిరపడింది. తన అభినయంతో అభిమానులను సంపాదించుకుంది. అవార్డులనూ అందుకుంది. ఆమె గురించి కొన్ని విషయాలు..

- చిన్న వయసులోనే బుల్లితెరపై మెరిసింది.. సూపర్ డాన్సర్ అనే రియాలిటీ షో విన్నర్ గా! తర్వాత డీ2, డీ4 షోల్లోనూ పాల్గొని పాపులారిటీతోపాటు సినీ అవకాశాన్నీ అందుకుంది.
- సానియా అయ్యప్పన్ సొంతూరు కేరళలోని కొచ్చి. నలంద పబ్లిక్ స్కూల్ లో చదువుకుంది.
- 'బాల్యకాలసఖి' మలయాళ చిత్రంతో బాలనటిగా ఎంటరై, 'క్వీన్'తో హీరోయిన్ గా మారింది. ఈ చిత్రం ఆమెకు బెస్ట్ డెబ్యూ ఆర్టిస్ట్ గా 'ఫిల్మ్‌ఫేర్', 'వనిత ఫిల్మ్ అవార్డ్స్' ను తెచ్చిపెట్టింది. తర్వాత మోహన్ లాల్ నటించిన 'లూసిఫర్'లో నటించి, ఉత్తమ సహాయ నటిగా 'సౌత్ ఫిల్మ్ ఫేర్ అవార్డ్' ను గెలుచుకుంది. అటుపై వచ్చిన 'ద ప్రీస్ట్', 'ప్రేతమ్ 2', 'సెల్యూట్', 'సాటర్ డే నైట్' వంటి పలు సినిమాల్లో మాత్రం అతిథి పాత్రకే పరిమితమైంది.
- స్క్రిప్టు నమ్మి చేసిన 'కష్టన్ కుట్టి పని తుడంగి' హారర్ చిత్రం సూపర్ డూపర్ హిట్ అయింది. అలాగే 'ఇరుగప్పట్రు', 'సొర్గవాసల్'లు కూడా ఫీల్ గుడ్ మూవీస్ గా మంచి ఆదరణ పొందాయి. ప్రస్తుతం ఈ రెండూ నెట్ ఫ్లిక్స్లో స్ట్రీమ్ అవుతున్నాయి.
- చేతినిండా అవకాశాల కంటే గుర్తుండిపోయే పాత్రలతోనే మెప్పించాలని కొంత గ్యాప్ తీసుకుంది. ఆ గ్యాప్ లో వెబ్ దునియాలోకి అడుగుపెట్టి, కొన్ని మ్యూజిక్ ఆల్బమ్స్, 'బిలవ్డ్' 'స్ట్రింగ్స్' అనే షార్ట్ ఫిల్మ్స్లో నటించింది.
- నెగటివ్ కామెంట్స్ ను పట్టించుకోను. అసభ్యకరంగా ప్రవర్తిస్తే మాత్రం ఊరుకోను. కొడతాను కూడా. నా జీవితం నా ఇష్టం.. నాకు నచ్చినట్లు ఉంటా!



## నేను సంపాదించిన ఆస్తి అదే - బాలయ్య

నటసింహం బాలయ్య - దర్శకుడు బాబీ కాంబినేషన్ లో సంక్రాంతి కానుకగా వచ్చిన డాకు మహారాజ్ బ్లాక్ బస్టర్ టాక్ తో బాక్సాఫీస్ను షేక్ చేస్తోంది. ఈ చిత్రం తొలి రోజున ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబడుతోంది. పైగా సంక్రాంతి సెలవులు కూడా కలిసి రావడంతో.. ఈ సినిమాకి సాలిడ్ కలెక్షన్స్ వచ్చాయి. ఇక 'డాకు మహారాజ్' ప్రమోషన్ ఈవెంట్లో బాలయ్య ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ముఖ్యంగా ఫుడ్ విషయంలో తన భార్య వసుంధర తనను తిడుతుందని బాలయ్య చెప్పడం విశేషం. కానీ, తాను ఫిట్గా ఉండేందుకు ప్రత్యేక రహస్యం ఏమీ లేదని.. షూటింగ్ సమయంలో తాను ప్రొడక్షన్ ఫుడ్ కూడా తింటానని బాలకృష్ణ చెప్పారు.
అలాగే బాలయ్య ఇంకా మాట్లాడుతూ.. పార్టీలకు, కులాలకు అతీతంగా తనకు అందరు ఫ్యాన్స్ ఉన్నారని.. జీవితంలో అదే తాను సంపాదించిన ఆస్తి అని బాలయ్య తెలిపారు. మొత్తానికి డాకు మహారాజ్ తో ఈ సంక్రాంతి సీజన్లో బాలకృష్ణ మరో అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. కాగా ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్ మరియు శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే, చాందిని చౌదరి, ఊర్వశి రౌటేలా, బాబీ డియోల్, బేబీ వేద అగర్వాల్ మరియు ఋగగణేష్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్తో కలిసి సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించిన ఈ సినిమాకి థమన్ సంగీతం అందించారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.